

రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 286 | శుక్రవారం | 10-04-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



హోర్ముజ్ జలసంధి ద్వారా ముంబాయి జెఎన్‌పిఎకు చేరుకున్న భారత ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశ'

గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు

నేపాల్ మాజీ ప్రధానికి అరెస్టు వారెంట్ **05**


ఇరాన్ – అమెరికా

# చర్చలపై సస్పెన్స్

లెబనాన్‌పై యుద్ధం జరుగుతుంటే చర్చలకు అర్థంలేదు : పెజెష్కియన్

లెబనాన్‌తో నేరుగా చర్చిస్తాం : నెతన్యాహూ

ఒప్పందం కుదిరేదాకా మా బలగాలు చుట్టుముట్టి ఉంటాయి : ట్రంప్







**ఇస్లామాబాద్:** అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొద్ది గంటల ముచ్చటగా మారిపోయింది. శనివారం ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిగా తలపెట్టిన అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య చర్చలు కూడా సందిగ్ధంలో పడినట్లు కనిపిస్తున్నది. మొదట ఈ చర్చలు శుక్రవారంనాడే నిర్వహిస్తామని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. కానీ తర్వాత శనివారానికి వాయిదా వేశారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ మొండి పట్టుదలతో దాడులు చేస్తూన్న పరిస్థితులమధ్య ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఎక్స్ వేదికగా గురువాం సాయంత్రం ఒక ప్రకటన చేస్తూ, ఒకవైపు యుద్ధం జరుగుతుంటే చర్చలకు అర్థం లేదని విమర్శించారు. దీంతో చర్చల పరిస్థితి గందరగోళంలో పడింది. పది అంశాల ఇరాన్ ప్రకణాళికను అంగీకరిస్తూ ట్రంప్ మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా తన సానుకూల సంకేతాలను పంపించిన తర్వాత ఇస్లామాబాద్‌లో శుక్రవారం చర్చలకు వస్తున్నట్లు పెజెష్కియన్ ప్రకటించారు. ఇరాన్ తరపున అందరూ ఊహించిన విధంగానే పార్లమెంటు స్పీకర్ ఘాలిబాఫ్‌తోపాటు విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా హాజరవుతారని కొద్ది గంటల క్రిందటి వరకూ సానుకూల వార్తలే వచ్చాయి. తమ ప్రాతినిధ్యాన్ని ధృవీకరించారు. కానీ ఇప్పుడు పరిస్థితులు తలక్రిందులయ్యాయి.''లెబనాన్ యుద్ధ ప్రాంతాలలో కాల్పుల

తరువాయి 2లో



కేరళం, అసోం, పుదుచ్చేరిలలో...

## 'ప్రశాంతం'గా ముగిసిన పోలింగ్

కడపటి సమాచారం మేరకు

కేరళంలో 75.01, అసోంలో 84.42, పుదుచ్చేరిలో 86.92 శాతం నమోదు

**న్యూఢిల్లీ :** కేరళం, అసోం సహా కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా పూర్తి అయ్యింది. మొత్తం 296 నియోజకవర్గాలలో పోలింగ్ ప్రశాంతంగానే జరిగిందని కడపటి వార్తలు అందాయి. కేరళం, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా అసోంలో 5గంటలకే పోలింగ్ ముగిసింది. కేరళం రాష్ట్రంలోని 140 నియోజకవర్గాలలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 5 గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదు అయ్యిందని, కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం (ఇసి) తెలిపింది. కాగా వీటితో పాటు గురువారం త్రిపుర రాష్ట్రంలోని ధర్మనగర్ అసెంబ్లీ నియోజకవర్గం, నాగాలండ్‌లోని కొరిడాంగ్ అసెంబ్లీ స్థానానికి, కర్నాటక రాష్ట్రం బాగల్‌కోట్, దావణగెరే సౌత్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ధర్మనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ 80శాతం నమోదుకాగా, కొరిడాంగ్ నియోజకవర్గంలో మద్యాహ్నం ఒంటిగంట సమయానికి 59.52శాతం నమోదైంది. కర్నాటక రాష్ట్రం బాగల్‌కోట్ అసెంబ్లీ నియోజకవర్గంలో 68.73శాతం, దావణగెరే సౌత్‌లో 68.55శాతం నమోదైంది. 2021 కేరళం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో 74.06 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి (2026) ఎన్నికల పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. అసోంలో 126అ సెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆ రాష్ట్రంలో సాయంత్రం 5గంటల వరకు 84శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదుకాగా ఈ సారి అదనంగా రెండు శాతం పోలింగ్ జరిగింది. పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలు

తరువాయి 12లో

దేవాలయాల ప్రవేశంలో ఆంక్షలు

# సమాజాన్ని విభజిస్తుంది

హిందూమతంపై ప్రభావం చూపుతుంది: సుప్రీంకోర్టు





**న్యూఢిల్లీ :** ప్రతి ఒక్కరికీ అన్ని దేవాలయాలు, మతాలలోకి ప్రవేశం ఉండాలని, ఒక మత విభాగాన్ని మినహాయించడం హిందూమతంపై ప్రతికూల ప్రభావం చూపి, సమాజాన్ని విభజిస్తుందని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాలలో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై, అలాగే పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధి, విస్తృతిపై విచారణ జరుపుతున్న తొలుత తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు బి.వి. నాగారత్న, ఎం.ఎం. సుందరేశ్, అహ్‌సానుద్దీన్ అమానుల్లా, అరవింద్ కుమార్, అగస్టీన్ జార్జ్ మసిహ్, ప్రసన్న బి. వరలే, ఆర్. మహాదేవన్, జయమాల్య బాగ్చి ఉన్నారు. నాయర్ సర్వీస్ సొసైటీ, అయ్యప్ప సేవా సమాజం, క్షేత్ర సంరక్షణ సమితి వంటి సంస్థల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, ఒక మత సంబంధ దేవాలయం ఇతరులకు అనుమతినిస్తూ పూజలు జరపవచ్చని లేదా కేవలం తమ మతానికే పరిమితం చేయవచ్చని వాదనలు వినిపించారు.

ఈ సందర్భంగా జస్టిస్ నాగారత్న జోక్యం చేసుకొని 'ఒక ఆందోళన ఉంది. వెంకటరమణ దేవరు కేసు సందర్భంలో గౌడ సారస్వత్ బ్రాహ్మణులు తప్ప ఇతరులెవరికీ ప్రవేశం లేదని చెప్పినట్లుగా, మీరు ప్రవేశ హక్కు గురించి మాట్లాడితే, అది హిందూమతంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని వ్యాఖ్యానించారు. 'ప్రతి దేవాలయానికి, మతానికి వెళ్లేందుకు ప్రతి ఒక్కరికీ ప్రవేశం ఉండాలి. శబరిమల తీర్పులోని వివాదాన్ని పక్కన పెట్టండి. కానీ, ఇతరులను మినహాయించి, కేవలం నా వర్గం,

తరువాయి 2లో

రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు

## ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలి

సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన గురువారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ అర్థశాస్త్ర విభాగం, చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ''ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం : విభేదాలు, భవిష్యత్ దిశ'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా.బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి మాత్రమే కాకుండా ఆయన ఓ విశిష్ట ఆర్థికవేత్త కూడా అని కొనియాడారు. సామ్యవాద స్ఫూర్తి రాజ్యాంగంలో అంతర్లీనంగా నిక్షిప్తమై ఉందని, ముఖ్యంగా

తరువాయి 2లో



ప్రఖ్యాత కమ్యూనిస్టు చండ్ర రాజేశ్వర రావు

## ఆడంబరమెరుగని ఆదర్శ నేత

ప్రజాపక్షం/రంగారెడ్డి

ఆడంబరమెరుగని ఆదర్శ నేత చండ్ర రాజేశ్వర రావు అని పలువురు సిపిఐ నేతలు కొనియాడారు. సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వర్ రావు (సిఆర్) 32వ వర్ధంతి సందర్భంగా గురువారం సిఆర్ ఫౌండేషన్‌లోని ఆయన విగ్రహానికి సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె నారాయణ, అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు అజీజ్ పాషా, జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పి.జె చంద్రశేఖర్ రావు, పిడికిటి సంధ్యాకుమారి ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమకేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, కనపర్తి జ్యోస్న, వి.లలిత తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు

తరువాయి 2లో

కాళేశ్వరం బ్యారేజీలను

# మరమ్మతులు చేయండి

వర్షాకాలం ముందే పరీక్షలు, నమూనా సేకరణ పూర్తి కావాలి

డిసెంబర్ వరకు పనులకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేయండి

మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలి

ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/ హైదరాబాద్

కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు పైన సమీక్ష నిర్వహించారు.మరమ్మత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏజెన్సీలన్నింటిని అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణ ను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ , సిడబ్ల్యుపిఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు , డిజైన్ కన్సల్టేషన్స్ తో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పని లో సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డ లో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజ్ ని

తరువాయి 2లో



## బిఆర్‌ఎస్‌లో చేరేందుకు జీవన్‌రెడ్డి సానుకూలం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/జగిత్యాల

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాలనను గత రెండున్నర సంవత్సరాలుగా వైఫల్యాలతో నెట్టుకోస్తున్నారే తప్పా ప్రజలకు మేలు చేయడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం కెటిఆర్ పర్యటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత కెటిఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కెటిఆర్

తరువాయి 2లో

# తనిఖీలతో మెరుగుపడిన బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో మొదలైన కదలిక

ఇప్పటికే 4,600 పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరింత దూకుడుగా తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా 299 తనిఖీ బృందాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యలో నాణ్యత వైపు కొత్త అడుగులు

ప్రజాపక్షం/హైదరాబాద్




పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరచాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు చూపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ 2025 సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించేందుకు 299 బృందాలను నియమించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులతో, ఉన్నత పాఠశాలలకు తొమ్మిది మంది ఉపాధ్యాయులతో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ ఈ తనిఖీ బృందాలను గుర్తించి నియమించింది. కనీసం పదేళ్ల అనుభవం, ఇన్‌సర్వీస్ శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత, క్రమశిక్షణా రికార్డు సవ్యంగా ఉన్న టీచర్లను ఇన్‌స్పెక్టింగ్ అధికారులుగా ఎంపిక చేశారు. కేటాయించిన పాఠశాలల్లో తనిఖీలు పూర్తి చేసి, ప్రతి వారం జిల్లా విద్యాధికారు(డిఈఓ) నివేదికలు సమర్పించాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటి వరకు సుమారు 4,600 పాఠశాలల్లో తనిఖీలు జరగగా, వీటిలో 3,966 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 589 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉపాధ్యాయుల వివరాలు, సిలబస్ పూర్తి చేయడంలో వెనుకబడిన తరగతుల స్థితిగతులు ఈ నివేదికల్లో క్రమం తప్పకుండా నమోదవుతున్నాయి. ఈ తనిఖీల ప్రభావం ఉపాధ్యాయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. బోధనలో

తరువాయి 12లో



## ఆర్‌టిసి'కార్మిక గర్జన' వాయిదా

ప్రభుత్వం దిగి రాకపోతే

13న సమ్మె తేదీ ప్రకటన : ఆర్‌టిసి జెఎసి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి ఉద్యోగుల సమ్మె డిమాండ్ల పై లేబర్ డిపార్ట్‌మెంట్ చర్చలు జరపడానికి సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా నేడు(శుక్రవారం) తలపెట్టిన 'కార్మిక గర్జన' కార్యక్రమంను వాయిదా వేస్తున్నట్లు ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి ఒక ప్రకటనలో తెలిపింది. లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం కార్మిక సంఘాలతో పాటు ఆర్‌టిసి యాజమాన్యంతో సమ్మె

తరువాయి 2లో

## ఇరాన్‌కు సాయం చేశామనడం తప్పుడు సమాచారం

### చైనా ఖండన

**బీజింగ్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంలో ఇరాన్ సైన్యానికి చైనా సంస్థలు ఉపగ్రహ చిత్రాలను, సెమీకండక్టర్ చిప్ తయారీ పరికరాలను అందించాయన్న వార్తలను చైనా రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఖండించింది. సంబంధిత వర్గాలు చైనాను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఊహాజనిత, నిందారోపణలతో కూడిన తప్పుడు సమాచార వ్యాప్తిని చైనా గట్టిగా వ్యతిరేకిస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జాంగ్ జియావోగాంగ్ అన్నారు. సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ (ఎస్ఎంఐసి) ఇరాన్ సైన్యానికి చిప్ తయారీ పరికరాలను అందించిందని, అలాగే ఒక చైనా వాణిజ్య ఉపగ్రహ సంస్థ మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాల చిత్రాలను విడుదలచేసిందని వచ్చిన వార్తలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఇరాన్‌కు సహాయం చేసేందుకు చైనా, రష్యాలు తీసుకుంటున్న చర్యల గురించి తమకు తెలుసునని, అవసరమైతే ప్రతిస్పందిస్తామని అమెరికా అధికారులు చేసిన వ్యాఖ్యలను చైనా గట్టిగా తిరస్కరిస్తోందని జాంగ్ అన్నారు. 'ఇరాన్ సమస్యపై చైనా వైఖరి నిష్పక్షపాతమైన, సూటిగా ఉంటుంది. మేము ఎల్లప్పుడూ నిష్పాక్షికమైన, నిష్పక్షపాత వైఖరిని అవలంభించాము' అని జాంగ్ అన్నారు. శాంతి చర్చలను ప్రోత్సహించేందుకు చైనా నిరంతరం కృషి చేసిందని, ఎన్నడూ నిప్పుకు ఆజ్యం పోయలేదని వ్యాఖ్యానించారు. 'చెప్పేదొకటి, చేసేదొకటి అన్నట్లుగా ఎవరు వ్యవహరిస్తున్నదెవరు? ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలను ఎవరు సృష్టిస్తున్నారు?ఈ విషయాన్ని అంతర్జాతీయ సమాజం చాలా స్పష్టంగా గమనిస్తోంది' అని ఆయన అన్నట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'చైనా డైలీ' పేర్కొంది.

## హమాస్ ఉగ్రవాదిగా ముద్రవేసి అల్‌జజీరా జర్నలిస్టును చంపిన ఇజ్రాయెల్



**గాజా :** ఇజ్రాయెల్ సైనిక బలగాలు అల్‌జజీరా జర్నలిస్టును వెంటాడి లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడిలో దారుణ హత్య చేశాయి. పశ్చిమ గాజా సిటీలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనను అల్‌జజీరా సంస్థ తీవ్రంగా ఖండించింది. ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయెల్ తమ జర్నలిస్టును వేటాడి చంపిందని విమర్శించింది. అల్ జజీరా ముబాషర్ ఛానల్ జర్నలిస్టు మహ్మద్ విషాహ్ పోతూ మరో జర్నలిస్టు కూడా వాహనంలో వెళ్తుండగా డ్రోన్ దాడిలో వారు మరణించారని ఖతార్‌కు చెందిన సంబంధిత నెట్‌వర్క్ విభాగం అధికారులు చెప్పారు. ఐతే విషా ఒక హమాస్ ఉగ్రవాది అని, అతడు జర్నలిస్టు ముసుగులో తమ బలగాలను,ఇజ్రాయెల్‌కు ఒక ముప్పుగా తయారయ్యాడని అందుకే దాడి చేసి చంపామని ఇజ్రాయెల్ గురువారం ఆరోపించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గడచిన రెండు సంవత్సరాలుగా 200 మంది పైగా జర్నలిస్టులు హతులయ్యారు.

అంతర్జాతీయ జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ ఇజ్రాయెల్ ఈ నిరసనను ఏంతమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఉగ్రవాద ప్రతినిధులుగా ముద్రవేసి దాడుల్లో లక్ష్యంగా చేసుకుని అనేకసార్లు జర్నలిస్టులను చంపిన ఉదంతాలు గాజాలో జరిగాయి. విషాకు తమ సాయుధ సంస్థలో ఎలాంటి సంబంధం లేదని గతంలోనే హమాస్ ప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ సైన్యం దాడి చేసి ఆయనను చంపింది.

## ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం

### ఐఎంఎఫ్,డబ్ల్యుఎఫ్‌పి, వరల్డ్ బ్యాంక్ హెచ్చరిక

### ఆకలిబాధలో 4.50కోట్లమంది ప్రజలు



**వాషింగ్టన్ :** ఇరాన్, పశ్చిమాసియా ప్రాంతాలలో యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం, చమురు, ఎరువుల సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి), వరల్డ్ బ్యాంక్ ఒక ఉమ్మడి హెచ్చరిక జారీ చేశాయి. సమస్యాత్మక దేశాలకు సహాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సమావేశానంతరం ఆ ముగ్గురు అధిపతులు ఉమ్మడి ప్రకటనలో తెలియజేశారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్లకు అతిపెద్ద అంతరాయంగా మారిందని, ఇది అనివార్యంగా ఆహార సంక్షోభానికి, ఆహార అభద్రతకు దారితీస్తుందని స్పష్టం చేశాయి. పెరుగుతున్న ఆహార ధరల భారం ఎక్కువగా అత్యంత బలహీనవర్గాలపైనే పడుతుందని ఈ మూడు సంస్థల అధిపతులూ హెచ్చరించారు. ''పశ్చిమాసియాలో యుద్ధం ఆ ప్రాంతంలో, ఆ ప్రాంతం వెలుపలా కూడా ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తోంది, వారి జీవితాలను తలక్రిందులు చేస్తోంది, ఇది ఇప్పటికే ఆధునిక ప్రపంచ చరిత్రలో అతి పెద్ద అంతరాయాలలో ఒకటిగా మారింది, చమురు, సహజవాయువు, ఎరువుల రవాణా సమస్యగా మారింది, వాటి ధరలు విపరీతంగా పెరిగాయి, హోర్ముజ్ జలసంధి నుండి ఈ మూడింటి రవాణా ఆగిపోయింది.

ఈ సమస్య అనివార్యంగా ఆహార ధరల పెరుగుదలకు, ఆహార అభద్రతకు దారితీస్తుంది'' అని మూడు సంస్థల అధిపతులు హెచ్చరిక చేశారు. యుద్ధం వల్ల చమురు, ఎరువులు, ఆహార సరఫరాలకు అంతరాయం కలిగిందని, ఇది ప్రపంచ సంక్షోభానికి దారితీస్తుందని, ముఖ్యంగా తక్కువ ఆదాయాలుగల దేశాలు, దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థలపై పడుతుందని, ఆ దేశాలలో ప్రజలు తీవ్రంగా నష్టపోయి కష్టాలపాలవుతారని తెలిపారు. ఆర్థిక వనరులు తక్కువగా ఉండి, రుణ భారాలు ఎక్కువగా ఉండే దేశాలు ఇప్పటికే సమస్యల్లో పడ్డాయని చెప్పారు. దీనివల్ల బలహీన కుటుంబాలను ఆదుకునే సామర్థ్యం ప్రభుత్వాలకు తగ్గిపోతుందని కూడా వారు హెచ్చరించారు. ఇప్పటికే 4.50 కోట్ల మందికంటే ఎక్కువ మంది ప్రజలు తీవ్రమైన ఆకలిలో మగ్గుతున్నారని వారు పేర్కొన్నారు.

పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే కాలంలో కీలక సరుకు రవాణా సమస్యగా మారుతుందని, మరింత ఆహార భద్రతా సంక్షోభానికి దారితీస్తుందని హెచ్చరించారు.



## క్లస్టర్ బాంబ్ బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా

**ప్యాంగ్‌యాంగ్ :** ఉత్తర కొరియా మరోసారి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలు చేసింది. ఈసారి క్లస్టర్ బాంబుల వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను విజయవంతంగా ప్రయోగించామని ఆ దేశం ప్రకటించింది. నిర్దేశిత లక్ష్యాలను దారుణంగా ధ్వంసం చేయగల సామర్థ్యం వీటికి ఉన్నాయని నిర్ధారించుకున్నట్లు ప్రభుత్వం చెప్పిందని యోన్‌హాప్ న్యూస్ ఏజన్సీ ప్రకటించింది. భూతలం నుండి భూతలంపైకి ప్రయోగించే హ్వాసాంగ్ 11కెఎ క్షిపణులను ఉపయోగించి వీటిని విజయవంతంగా ప్రయోగించారు. అధిక సాంద్రతగల శక్తిని ఉపయోగించి దాదాపు ఏడు హెక్టార్ల పరిధిలోని లక్ష్యాలను బూడిద చేయగల ఆయుధాలను పరీక్షించారు.

## 12న హంగరీ ఎన్నికలు యూరప్‌కు కీలకం

### ఓర్బాన్‌కు ట్రంప్ బహిరంగ మద్దతు



**బుడాపెస్ట్:** మధ్యయూరప్‌లో భూబంధిత దేశం హంగరీలో ఆదివారం (ఏప్రిల్ 12) నాడు ఎన్నికలు జరుగుతాయి. జాతీయ అసెంబ్లీగా పిలిచే హంగరీ పార్లమెంటులో మొత్తం 199 స్థానాలు ఉన్నాయి. 2010 నుండీ గడచిన 16 సంవత్సరాలుగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉన్న ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బాన్ వరుసగా ఐదోసారి కూడా అధికార పీఠాన్ని దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆయనకు బాహాటంగా మద్దతు ఇస్తున్నారు. ఆయన తరపున అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ రెండు రోజుల క్రితం హంగరీ వెళ్ళి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 2022లో జరిగిన ఎన్నికల్లో అధికార ఫిడెజ్–కెఎన్‌డిపి కూటమి అత్యధికంగా 54.13 శాతం ఓట్లు సంపాదించింది. 2026లో జరుగుతున్న ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనవని, ఈసారి కూడా హంగరీ నియంతృత్వ పాలనలో మగ్గిపోతుందో? లేక రష్యా వైపే ఉండిపోతుందో? వీటికి భిన్నంగా స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం దిశగా యూరోపియన్ యూనియన్ వైపు తన మార్గాన్ని మార్చుకుంటుందో వేచి చూడాలని, రాబోయే 72 గంటలూ ఎంతో కీలకమైనవని జర్మనీ కేంద్రంగా పని చేసే డిడబ్ల్యు మీడియా సంస్థ వ్యాఖ్యానించింది. టిస్జా పార్టీ రెస్పెక్ట్ అండ్ ఫ్రీడమ్ పార్టీ) అధ్యక్షుడు, న్యాయవాది, హంగరీ రాజకీయవేత్త పీటర్ మాగ్యార్ (45) ప్రస్తుత ప్రధానమంత్రి విక్టర్ ఓర్బాన్‌కు ప్రధాన ప్రత్యర్థిగా సవాలు విసురుతున్నారు. 2020లో యూరప్ అనుకూల పార్టీగా టిస్జా పార్టీ ఆవిర్భవించింది.

## గ్లేసియర్స్ రక్షణకోసం అర్జెంటీనాలో భారీ ప్రదర్శన




**బ్యూనోస్ ఐర్స్ :** ప్రకృతిని నాశనం చేసేవిధంగా కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చేందుకు సిద్ధపడిన దేశాధ్యక్షుడు జేవియర్ మిలే విధానాలను వ్యతిరేకిస్తూ అర్జెంటీనా దేశ రాజధాని బ్యూనోస్ ఐర్స్‌లో గురువారం ప్రజలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.

ప్రకృతిని, ప్రకృతి వనరులను కాపాడాలని, ముఖ్యంగా హిమపాతాలను, స్వచ్ఛమైన తాగునీటిని ప్రసాదించే మంచు పర్వతాలను ధ్వంసం చేసే విధంగా కంపెనీలకు కాంట్రాక్టులు ఇవ్వొద్దని ప్రజలు ఈ ప్రదర్శనలో నినాదాలు చేశారు. ప్రజలకు రోజువారీ మంచినీటి అవసరాలను తీర్చే గ్లేసియర్ రిజర్వులకు సమీపంలోనే గనుల తవ్వకాలు చేసేందుకు కంపెనీలకు దేశాధ్యక్షుడు జేవియర్ మిలే అనుమతులు ఇవ్వడాన్ని ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు.

## సమాజాన్ని విభజిస్తుంది (మొదటి పేజీ తరువాయి)

నా మతం వారు మాత్రమే దేవాలయానికి హాజరవుతారు, మరెవరూ హాజరవ్వరు అనేది ఒక ఆచారం, ఇది మతపరమైన విషయం అని మీరు చెబితే, అది హిందూమతానికి మంచిది కాదు. మతం ప్రతికూలంగా ప్రభావితం కాకూడదు. అది ఆయా మతాలకే విఘాతం కలిగిస్తుంది.' ఆమె అన్నారు. ఈ అభిప్రాయంతో జస్టిస్ కుమార్ ఏకీభవిస్తూ, ఇలాంటి మినహాయింపులు సమాజాన్ని విభజిస్తాయని అన్నారు. దేవాలయాలు కేవలం తమ మతానికే సేవ చేస్తే, అవి ప్రభుత్వం, ప్రైవేట్ దాతలు లేదా ప్రజలపై ఆధారపడవు కాబట్టి వారి నుండి నిధులు కోరలేవని వైద్యనాథన్ వాదించారు.ఒక చట్టం చేయాలంటే, అది ప్రజా భద్రత, నైతికత లేదా ఆరోగ్యం అనే పరీక్షలో నెగ్గాలని ఆయన అన్నారు. దేవరు తీర్పులో, మద్రాసు ఆలయ ప్రవేశ అధికార చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఆలయం హిందువులందరికీ తెరిచి ఉన్నప్పటికీ, గౌడ సారస్వత్ బ్రాహ్మణులకు కేటాయించిన కొన్ని ఆచారాలు రాజ్యాంగబద్ధంగా అనుమతించదగినవేనని స్పష్టం చేసింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం మత స్వేచ్ఛ పరిధిపై ఏడు ప్రశ్నలను రూపొందించింది. 2018 సెప్టెంబర్‌లో, ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, 4:1 మెజారిటీ తీర్పుతో కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10 నుండి 50 ఏళ్ల మధ్య వయస్సుగల మహిళల ప్రవేశాన్ని నిరోధించే నిషేధాన్ని ఎత్తివేసింది. శతాబ్దాల నాటి ఈ హిందూ మత ఆచారం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని పేర్కొంది. తరువాత 2019 నవంబర్ 14న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ నేతృత్వంలోని మరో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 3:2 మెజారిటీతో, వివిధ ప్రార్థనా స్థలాలలో మహిళలపై వివక్ష అనే అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించింది. ఒక నిర్దిష్ట కేసుకు సంబంధించిన వాస్తవాలు లేకుండా మత స్వేచ్ఛపై విస్తృత అంశాలను నిర్ణయించలేమని పేర్కొంటూ ధర్మాసనం వాటిని రూపొందించింది.

## జీవన్‌రెడ్డి సానుకూలం (మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి బిఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి సానూకూలంగా స్పందించారు. మాజీ సీఎం కెసిఆర్‌తో త్వరలోనే ప్రత్యేక సమావేశమై పార్టీలో చేరే రోజును వెల్లడిస్తానని జీవన్ రెడ్డి వివరించారు. అనంతరం కెటిఆర్ విలేకరులు సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా మూడు సార్లు 70 లక్షల మందికి 27వేల కోట్లు రైతుబంధు ఎగగొట్టారని ఆరోపించారు. రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని రైతులను మభ్యపెడుతున్నారన్నారు. 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, గ్యారంటీ కార్డులను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రానున్న రోజుల్లో మేము అధికారంలోకి వస్తామనే సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొన్నారు. పార్టీ చీఫ్ కెసిఆర్ ఆదేశాల మేరకు జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించామని, జీవన్‌రెడ్డి సానూకూలంగా స్పందించారన్నారు. కెసిఆర్‌ను కలిసి పార్టిలో చేరే రోజును ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంఎల్‌సి రమణ, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు బాల కిషన్, రవి శంకర్, మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, సతీష్ కుమార్, మాజీ ఎంపి వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు. కాగా, కెటిఆర్ జీవన్ రెడ్డి ఇంటికి చేరుకునే సమయంలో జరిగిన తోపులాటలో అపశృతి చోటుచేసుకుంది. వార్తల కవరేజ్ కోసం ఉన్న సమయంలో నాయకులు జర్నలిస్టులను నెట్టివేయడంతో రిపోర్టర్ సాయి తీవ్రంగా గాయపడి కాలు విరిగింది.

## మరమ్మతులు చేయండి (మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందని, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ఈ పని పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మతులకు సంబంధించి డిజైన్ లు సిద్ధం చేయాలని సూచించారు.డిసెంబరు వరకు చేయాల్సిన పనులపైన పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. పనులలో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కలుగనివ్వబోమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశం లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్ , సిఎం కార్యదర్శి మానిక్ రాజ్ , ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమానత్వం, న్యాయంపై పీఠిక ఇచ్చిన ప్రాధాన్యతలో ఇది ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. 1946 నాటి కరాచీ తీర్మానాన్ని ప్రస్తావిస్తూ అది భారతదేశంలో సామాజిక ఆర్థిక హక్కులకు పునాది వేసిందన్నారు. కాలక్రమేణా అనేక రాజ్యాంగ సవరణలు ఆర్థిక పరమైన ఆందోళనలను పరిష్కరించాయని ప్రస్తావించారు. 1951 నాటి జవహర్ లాల్ నెహ్రూ ఆలోచనలను ఉటంకిస్తూ, నేటి సవాళ్లను తొలితరం నాయకులు ముందే ఊహించారని వెల్లడించారు. జమీందారీ వ్యవస్థ రద్దు, వ్యవసాయ పోరాటాలు, సమానత్వం దిశగా కీలకమైన అడుగులని పేర్కొన్నారు. ఫాసిజం కొత్త రూపాల పెరుగుదల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ చక్రపాణి మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నత విద్యారంగంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత రాజ్యాంగాన్ని, అందులోని ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పెరుగుదల విద్యా రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని, అందరికీ ఉన్నత విద్యా అందుబాటులో లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తపర్చారు. రాజ్యాంగంలో పొందు పర్చినట్లు విద్యా అవకాశాలు అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా చూడాల్సిన భాద్యత ప్రభుత్వంపై, ప్రభుత్వ సంస్థలపై ఉందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (న్యూ ఢిల్లీ), సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ అధ్యాపకులు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజా సంక్షేమాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వం కీలక రంగాలపై నియంత్రణను కలిగి ఉండాలని, ప్రభుత్వ రంగానికి, జాతీయీకరణకు ప్రాధాన్యతనిచ్చిన 1948 పారిశ్రామిక విధానాన్ని ఆయన గుర్తుచేశారు. ఆర్థిక విధానాలు ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్పా చక్రపాణి మాట్లాడుతూ ప్రజా విధానాలను రూపొందించడంలో సామాజిక న్యాయం, సమానత్వ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కోడైరెక్టర్, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చంచల్‌గూడ) వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. నాగోజీ, సీనియర్ ప్రొఫెసర్ ఐ. సుధా రాణి, ప్రొఫెసర్లు పల్లవి కాబ్డే, ఆనంద్ పవార్, శ్రీనివాస్ వడ్డాణం, పి. వెంకట రమణ, జి. దయాకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చంచల్ గూడ) అధ్యాపక సిబ్బంది, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చర్చలపై సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

విరమణను ఇజ్రాయెల్ ఉల్లంఘించింది, అందువల్ల ఇక చర్చలకు అర్థంలేదు'' అని అరాఘ్చి తదుపరి తాజా ప్రకటనలో విమర్శించారు. పరస్పర అనంగీకార పరిస్థితులమధ్య పాకిస్థాన్‌మాత్రం ఆశాభావం వ్యక్తం చేసింది. లండన్‌లోని పాకిస్థాన్ హై కమిషనర్ డా.మహ్మద్ ఫైజల్ ఒక ప్రకటన చేస్తూ, అన్ని పక్షాలు చర్చలు కోరుకుంటున్నాయని, అందువల్ల ఖచ్చితంగా చర్చలు సానుకూల వాతావరణంలో జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**లెబనాన్‌తో ముఖాముఖి చర్చిస్తాం : నెతన్యాహూ**

ఒకవైపు లెబనాన్‌లో మొండిగా దాడులు చేస్తున్న నెతన్యాహూ మరోవైపు లెబనాన్ ప్రభుత్వంతో ముఖాముఖీ చర్చలకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన ఒక ప్రకటన చేశారు. లెబనాన్‌తో వీలైనంత త్వరగా ముఖాముఖీ చర్చలు జరపాలని తాను మంత్రివర్గాన్ని ఆదేశించినట్లు ఎక్స్ వేదికగా హీబ్రూ భాషలో ఒక పోస్టింగ్ పెట్టారు. ఐతే హెజ్బొల్లాను నిరాయుధలను చేసే విషయంపైనే చర్చలు ప్రధానంగా కొనసాగాలని ఆయన షరతు విధించారు. హెజ్బొల్లాను నిరాయుధులను చేసే వరకూ లెబనాన్‌లో దాడులు చేస్తామని మొదటినుండీ నెతన్యాహూ చెబుతూ వస్తున్నారు. లెబనాన్‌లో కాల్పుల విరమణకు ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధం లేదని ట్రంప్ కూడా స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇదే సమయంలో పాకిస్థాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ సమస్య పరిష్కారానికి సహాయం చేయాల్సిందిగా తమ దేశానికి లెబనాన్ ఒక విజ్ఞప్తి చేసిందని పేర్కొంది.

లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ తమ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారని ఆ దేశ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిగా ప్రధాన పాత్ర నిర్వహిస్తున్న విషయం బాగా ప్రచారంలోకి వచ్చింది.

## ఒప్పందం కుదిరేదాకా మా బలగాలు చుట్టుముట్టి ఉంటాయి : ట్రంప్

**వాషింగ్టన్ :** ఒప్పందాన్ని అమలుచేయకపోతే ఇరాన్‌ను నాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన పది అంశాల ప్రణాళికను ట్రంప్ ఆమోదించిన తర్వాత కాల్పుల విరమణకు ఇరాన్ అంగీకరించింది. ఇస్లామాబాద్‌లో చర్చలకు కూడా అన్ని జాగ్రత్తలూ పాటిస్తూ పాల్గొంటామని ప్రకటించింది. కానీ ఈ ఒప్పందం కేవలం ఇరాన్–అమెరికాకు మాత్రమే పరిమితమని ట్రంప్ కూడా ధృవీకరించారు.

కానీ లెబనాన్‌లోని సైనిక కేంద్రాలు, కమాండ్ సెంటర్లపై ఇజ్రాయెల్ బుధవారం భారీ దాడులుచేసి దాదాపు 254 మందిని పైగా హతమార్చింది. దీంతో ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చర్చలను, ఒప్పందాన్ని తిరస్కరించింది. దీంతో ట్రంప్ తీవ్రంగా స్పందించారు. మొదట అకున్నవిధంగా ఒప్పందాన్ని అమలుచేయకపోతే ఇరాన్‌ను నాశనం చేస్తామని, గతంలో ఎవ్వరూ ఊహించని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతామని ప్రకటించారు. ఒప్పందం అమలు జరిగే వరకూ తమ బలగాలు హోర్ముజ్‌ను చుట్టుముట్టి ఉంటాయని చెప్పారు. ఒప్పందం అమలు జరిగేవరకూ అమెరికా సేనలు, విమానాలు, నౌకలుహోర్ముజ్ చుట్టూ పహారా కాస్తూ ఉంటాయి అని చెప్పారు. ఏదైనా కారణంతో ఒప్పందం అమలు కాకపోతే మళ్ళీ యుద్ధం మొదలవుతతుంది అని ముందుగానే బుధవారం ఆయన హెచ్చరించారు.రెండు వారాలుగా ఆయన ఇరాన్‌తో అస్థిరమైన చర్చలను ఆరంభించారు. అప్పటినుండీ అనేక రహస్యాలు, సందేహాలు పొర్లాడుతూనే ఉన్నాయి. ఇరాన్‌లో విశ్వసనీయ వ్యక్తులతో చర్చలు జరిపామని ట్రంప్ అన్నారు. వారెవరో ఆయన చెప్పలేదు. కానీ చాలామంది ఘాలిబాఫ్ అని భావించారు.

**పెరుగుతూనే ఉన్న చమురు ధరలు**

ఇరాన్ యుద్ధంలో ముంగింపు వచ్చిందని ప్రజలు బుధవారం కొద్ది గంటలసేపు మురిసిపోయారు. పెట్రోలు, డీజిలు ధరలు కూడా గణనీయంగా దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర యుద్ధ ఆరంభంలో 40 శాతం మేరకు పెరిగి బ్యారల్‌కు 120 డాలర్లకు చేరుకోగా బుధవారం ట్రంప్ ప్రకటన తర్వాత ఒక్కసారిగా 94 డాలర్లకు పడిపోయింది. కానీ అది తాత్కాలిక ముచ్చటగా మారిపోయింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన నిర్వాకం కారణంగా, గురువారం తెల్లారేసరికి మళ్ళీ పరిస్థితులన్నీ తారుమారయ్యాయి.చమురుధరలు మళ్ళీ పెరుగుతూనే ఉన్నాయి. యుద్ధం ఊసేలేని జనవరి నెలనాటి ధరలతో పోలిచూస్తే ఇప్పటికీ పెట్రోలు, డీజిలు, ఇతర సంబంధిత ఉత్పత్తుల ధరలు చాలా హెచ్చుస్థాయిలో కొనసాగుతున్నాయి. త్వరలోనే ధరలు తగ్గుముఖం పడతాయని వాహనదారులు ఆశించవద్దని ప్రభుత్వాల నుండి పరోక్ష సంకేతాలు వెళ్ళాయి. ఇప్పటికే తక్కువ ఆదాయాలు గల అనేక దేశాలలో తీవ్ర సమస్యలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వరంగ రవాణా వ్యవస్థలు చాలా దేశాల్లో మూతపడ్డాయి. మరోకొన్ని దేశాలలో పెట్రోలు హాలిడే ప్రకటించారు. పెట్రోలు,డీజిలుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించుకోవాలని నిపుణులు కూడా తాజాగా ప్రకటనలు చేయడం ప్రారంభించారు. చైనా దేశంలో ప్రధానంగా పెద్ద సంక్షోభం ఏర్పడింది. కానీ 40 శాతం మేరకు ఎలక్ట్రానిక్ వాహనాలు ప్రవేశపెట్టడం, వాటిని ముందునుండీ ప్రోత్సహించడం ద్వారా చైనా ఈ సమస్యను చాలా వరకూ అధిగమించింది.

## మళ్ళీ స్తంభించినపోయిన నౌకలు

### కాల్పుల విరమణ ప్రకటనతో సురక్షితంగా వెళ్ళిన తొమ్మిది నౌకలు

**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధి సమస్య ఇప్పుడు లెబనాన్ చుట్టూ తిరుగుతోంది. లెబనాతో హోర్ముజ్ సమస్య ముడిపడటంతో యుద్ధంలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు, తదుపరి శాంతి చర్చలన్నీ ఇప్పుడు పూర్తిగా ఇజ్రాయెల్ నిర్ణయంపైనే ఆధారపడే పరిస్థితి వచ్చింది. కానీ ఇజ్రాయెల్ ఇదేమీ పట్టించుకోకుండా లెబనాన్‌లో దాడులను మరింత ఉద్ధృతం చేసింది. బుధవారం ఉదయం అమెరికా అంగీకారం చెప్పగానే హోర్ముజ్ జలసంధిని రాకపోకలకు ఆనందంగా తెరచిన ఇరాన్ ఆ తర్వాత లెబనాన్‌లో ఘోరాతిఘోరమైన ఇజ్రాయెల్ దాడులతో ఆగ్రహం చెంది జలసంధిని మూసివేసింది. దీంతో అప్పటివరకూ జలసంధిని దాటి వెళ్ళిన నౌకలు కూడా వెనక్కు తిరిగొచ్చే పరిస్థితి వచ్చింది. కానీ కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత ఏప్రిల్ ఎనిమిదో తేదీ ఉదయం నుండి సాయంత్ర వరకూ ఎనిమిది నౌకలు జలసంధి దాటి వెళ్ళిపోయాయి. సాధారణంగా ప్రతిరోజు 138 నౌకలు జలసంధిని దాటి వెళతాయి. ఇప్పుడు మళ్ళీ ఇరాన్ హెచ్చరికలతో వందల నౌకలు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేశాక నౌకలను హోర్ముజ్ దాటకుండా ఆపేశామని ఇజ్రాయెల్ ప్రభుత్వ మీడియా ఒక ప్రకటన చేసింది. లెబనాన్‌లో తమ అనుమతి లేకుండా హోర్ముజ్ జలసంధిని దాటి వెళితే ఆ నౌకలను పేల్చివేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిందని, తక్షణం దిద్దుబాలు చర్యలు తీసుకోకపోతే కాల్పుల విరమణ ప్రక్రియతో పాటు హోర్ముజ్ జలసంధి కూడా స్తంభించిపోతుందని ఇరాన్ హెచ్చరించినప్పటికీ, ప్రపంచ దేశాల శ్రేయస్సును, ఆర్థిక సంక్షోభాన్ని, వివిధ దేశాలు ఎదుర్కొంటున్న చమురు సంక్షోభాన్ని ఎంతమాత్రం పట్టించుకోకుండా ఇజ్రాయెల్ గురువారం రాత్రి మరోసారి హెచ్చరిక చేసింది. కాల్పుల విరమణతో సంబంధం లేకుండా హెజ్బొల్లా ఉగ్రవాదులు ఎక్కడున్నాగానీ, వారిని మట్టుపెట్టేందుకు అవసరమైన భారీ దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రకటించారు. దీంతో కొత్త ప్రాంతాలను ఖాళీ చేయాలని ప్రజలకు ఐడిఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. లెబనాన్‌లో వందలమంది మరణించడంతో దేశవ్యాప్తంగా ప్రజలు సంతాపదినం పాటిస్తుండగా, ఐడిఎఫ్ మాత్రం హెచ్చరికలు చేస్తోంది. ''ఇజ్రాయెల్ మీ ప్రాణాలకు హాని తలపెట్టదు, మీరు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళండి, మీ మంచి కోసమే చెబుతున్నాం'' అని ఐడిఎఫ్ అధికారి లెబనాన్‌లో ప్రజలకు హెచ్చరికలు చేశారు. మరోవైపు లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడులను ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి.

## 'కార్మిక గర్జన' వాయిదా (మొదటి పేజీ తరువాయి)

డిమాండ్లపై చర్చలు జరపడానికి సమావేశం నిర్వహించగా, సమ్మె నోటీస్ ఇచ్చిన 6 సంఘాల ప్రతినిధులు హాజరుకావడం జరిగిందని, అయితే గతంలో మదిరీగానే ఆర్‌టిసి యాజమాన్యం కన్సిలేషన్ మీటింగ్‌కి ఉద్దేశపూర్వకంగా యాజమాన్యం గైర్హాజరయ్యారని తెలిపారు. అయితే మరో సమావేశం ఈ నెల 13 న ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ ప్రకటించారన్నారు. సమ్మె నోటీస్ ఇచ్చి నెల రోజులు కావస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తు, సమ్మె నివారణ చర్యలు చేపట్టడం లేదని ఇదే వైఖరి కొనసాగితే ఏప్రిల్ 13 న సమ్మె తేదీ ప్రకటించి కచ్చితంగా సమ్మె చేస్తామని జెఎసి నాయకులు హెచ్చరించారు.

## ఆడంబరమెరుగని ఆదర్శ నేత

(మొదటి పేజీ తరువాయి)

అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితోనే సిఆర్ ఫౌండేషన్‌ను నిర్మించి అందులో వృద్ధాశ్రమాన్ని, ఎన్ఆర్‌ఆర్ రిసెర్చ్ సెంటర్, మహిళా సంక్షేమ కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించడం కోసం కృషి చేస్తామని నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు, వృద్ధాశ్రమ వాసులు, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తి విద్యా కోర్సుల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్, అన్మాన్ కార్మికుల పోరుబాట – నిరవధిక సమ్మెకు శ్రీకారం

**సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన**





**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్మాన్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరుబాట ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్ప వేరే మార్గం లేదని స్ప ష్టం చేస్తూ, తొమ్మిది సంఘాలు ఏకమై జెఎసిగా ఏర్పడి ఉమ్మడి పోరాటానికి సిద్ధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 19,061 మంది ఆర్టిజన్లు ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడి సిఎల్ సంస్థల్లో సేవలు అందిస్తున్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలు, మీటర్ ఇన్‌స్టాలేషన్, బ్రేక్‌డౌన్ పునరుద్ధరణ వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నప్పటికీ, తగిన గుర్తింపు లేకపోవ డం కార్మికుల్లో ఆందోళనకు దారి తీస్తోంది. ప్రస్తుతం వీరికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు మాత్రమే వేతనం అందుతుండగా, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం తీవ్ర అసంతృప్తికి కారణమైంది. రెగ్యులర్ ఉద్యోగులతో స మానంగా పనిచేస్తున్నప్పటికీ, సరైన వేతనం, హక్కు లు లభించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో గురువారం ఆర్టిజన్లు నిరవధిక సమ్మెకు దిగారు. సర్వీస్ రూ ల్స్ లేకపోవడం, కన్వర్షన్ ప్రక్రియ అమలు కాకపోవ డం వల్ల తమ కు న్యాయం జరగడం లేదని వారు తెలిపారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు :** ఆర్టిజన్ కార్మికులకు ఎపిఎస్ఇబి రూల్స్ అమ లు చేయాలిఅర్హతల ప్రకారం కన్వర్షన్ చేపట్టాలిస్పాట్ బిల్లర్లను సంస్థలో విలీనం చేయాలిబిల్ కలెక్టర్లకు జిఒ నం.11 ప్రకారం కనీస వేతనం అమలు చేయా లి 2026 పిఆర్‌సి వెంటనే అమలు చేయాలి

**మంత్రి స్పందించాలి :** జిల్లా కన్వీనర్ దమ్మ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ శాఖ మం త్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

**పనికి తగ్గ వేతనం కావాలి :** డివిజన్ కోచైర్మన్ పిట్టల మహేష్ మాట్లాడుతూ, సంవత్సరాలుగా తక్కువ వేతనంతో, భద్రత లేకుండా పనిచేస్తున్నామని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రమాదాల్లో కుటుంబాలకు రక్షణ లేదు :** విధి నిర్వహణలో గాయపడిన కార్మికుడి కుటుంబ స భ్యురాలు సాంబారి రక్షిత మాట్లాడుతూ, ప్రమాదాల సమయంలో సరైన పరిహారం, రక్షణ లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

**ప్రమాదాలు సాధారణమే :** అన్మాన్ గాంధారి శ్రీకాంత్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో తర చూ ప్రమాదాలు ఎదురవుతున్నాయని, తగిన భ ద్రతా చర్యలు, పరిహారం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోచైర్మన్ కాశెట్టి రాంబాబు, డివిజన్ నాయకు లు మహేష్, విష్ణువర్ధన్, శ్రీకాంత్, క్రాంతి, లోకేష్, రాజేందర్, నాగార్జున,శ్రీధర్, సాగర్, శ్యా మ్, ధరణి, శరణ్య,తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు : ఎస్.బాల్‌రాజ్

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొని సంఘీభా వం తెలియచేస్తామని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. విద్యుత్ శాఖలో ఇంజనీర్లతో సమానంగా ఆర్టిజన్లు పనిచేస్తూ, సమాన అర్హతలు కలిగి ఉన్నప్పటికీ అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. గతంలోనే మెరుపు సమ్మె చేసి విద్యుత్తు కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేసినప్పుడు ప్రభుత్వం ఆర్టిజన్లకు సరి సమానమై న వేతనం ఇస్తామని చెప్పి సమ్మె విరమింపచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెను నివారించేందుకు వారి ఉ ద్యోగాలను పర్మినెంట్ చేయాలని లేదా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి స మాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ఆర్టిజన్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాపితంగా సమ్మె, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో చర్చలు జరపనందున చివరి ఆయుధంగా సమ్మె హక్కును వినియోగించుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ ఆర్టిజన్ల సమ్మెను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర వ్యాపితంగా విద్యుత్ సరఫరాలో అనేక ఆటుపోట్లకు గురవుతార ని బాల్‌రాజ్ హెచ్చరించారు.

# యుద్ధం పట్ల భారత్ మౌనం పాటించడం బాధాకరం

**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధం పట్ల ప్రపంచంలో అధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ మౌనం పాటించడం బాధాకరమే కాకుండా సిగ్గుచేటని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. యుద్ధం కారణంగా అమాయక పిల్లలు, నిరపరాధ ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే భారతదేశం కేవలం చూస్తూ ఉండాలా? ఇదేనా భారత విదేశాంగ విధానమని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆశ్చర్యకరంగా పా కిస్తాన్ కూడా మధ్యవర్తిత్వానికి ముందుకు వస్తూ భారత్ చేయాల్సిన పని ఆ దేశం చేస్తుంటే భారత్ మాత్రం మౌనం పాటిస్తున్నదని విమర్శించారు. భార త ప్రధాని మోదీ ప్రపంచం మొత్తం తిరుగుతారని, కానీ ఇలాంటి క్లిష్ట సమయంలో ఒక అడుగు ముందుకు వేసి యుద్ధాన్ని ఆపే ప్రయత్నం చేయకపోతే ఆ పర్యటనల అర్థమేమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో తాను రష్యా, జర్మనీ, వియత్నాం, క్యూబా, చైనా, ఇటలీ దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి సాధారణ ప్రజలు భారతీయులను ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని గుర్తు చేసుకునేవారని, అదే భారత్ గౌరవం, అదే భారత్ ప్రభావంఅని నారాయణ తె లిపారు. ప్రస్తుతం ఆ స్థాయి ఎందుకు కనిపించడంలేదని? ఇది స్పష్టంగా నాయకత్వ వైఫల్యం కారణంగా ఒక గొప్ప అవకాశాన్ని భారత్ కోల్పోయిందన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా

**ఎంఎల్‌సి అద్దంకి దయాకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తోడ్పాటును అందించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఎంఎల్‌సి అద్దంకి దయాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎంఎల్‌సిని బంజారా హిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతాని హామీ ఇచ్చారు. తనతో పాటు యూనియన్ నాయకులను కూ డా తీసుకువెళ్ళి ముఖ్యమంత్రితో సమావేశపరిచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి అద్దంకి దయాకర్‌ను వనంపల్లి జైపాల్ రెడ్డి శాలువాతో సన్మానించారు.

# మీ సేవ ‘వాట్సాప్’తో ఓపెన్ స్కూల్ హాల్‌టికెట్ల జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓపెన్ స్కూల్ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం మరో సులభతరమైన డిజిటల్ సేవను అందుబాటులోకి తీసుకొచ్చిందని మీ సేవ కమిషనర్ టి.రవికిరణ్ తెలిపారు. ఇకపై ఓపెన్ స్కూల్ పరీక్షల హాల్‌టికెట్లను మీ సేవ అధికారిక వాట్సాప్ ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించిందని, ఈ సేవలు 9వ తేదీ (గురువారం) నుంచి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు లేదా తల్లిదండ్రులు మీ సేవ అధికారిక వాట్సాప్ నంబర్ 80 96958096ను ఉపయోగించుకోవాలని సూచించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్ ) సమన్వయంతో అందిస్తున్న ఈ సేవ ద్వారా విద్యార్థులు ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి, ఓపెన్ స్కూల్ ఇంటర్, ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్లను సులభంగా పొందగలుగుతారన్నారు.

# కమ్యూనిస్టు ఉద్యమ ధృవతార చంద్ర రాజేశ్వరరావు

**సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ్మా**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పీడిత, తాడిత ప్రజల కోసం అలుపెరగని పోరాటలు చేసిన కమ్యూనిస్టు ఉద్యమ ధృవతార చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య యోధులు, సిపిఐ అగ్రనాయకులు చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) 32వ వర్థంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంమఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి ఈ.టి.నరసింహ్మా, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇటి.నరసింహ మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు పేదలు, అణగారినవర్గాల కోసం ఎర్రజెండా చేతబూని యావదాస్థిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అన్నారు. నిజాం నిరంకుశ పాలన సమయంలో తెలంగాణాలో అనేక సార్లు పర్యటించి పార్టీ నిర్మాణానికి కృషి చేస్తూనే తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లను సమన్వయ పరుస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సిఆర్ కీలకపాత్ర వహించారని గుర్తు చేశారు. మతోన్మాద విషాన్ని వ్యాపింపజేసే కార్యకలాపాలను సిఆర్ నిరంతరం అడ్డుకుంటూ దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడిన గొప్ప దేశభక్తుడని ఆయన కొనియాడారు. చంద్రరాజేశ్వరరావు జీవితం, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నమ్మిన సిద్ధాంతం ఎల్లవేళలా ఆదర్శణీయమని, అనుసరణీయమని, అయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని ఇటి.నరసింహ పిలుపునిచ్చారు.

సిఆర్‌కు నివాళులు అర్పించిన వారిలో తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ్మా, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వేసవి రద్దీకి ప్రత్యేక రైళ్లు

**కోయంబత్తూరు –జైపూర్ మధ్య వారాంత స్పెషల్ సేవలు ప్రారంభం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ ని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కోయంబత్తూ రు జైపూర్ మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. దీనిలో భాగంగా ట్రైన్ నం.06181 కోయంబత్తూరు జంక్షన్ నుం చి జైపూర్ జంక్షన్‌కు 4వ తేదీ జూన్ వరకు ప్రతి గురువారం మొత్తం 9 స ర్వీసులు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో ట్రైన్ నం.06182 జైపూర్ నుంచి కోయంబత్తూరుకు 12వ తేదీ ఏప్రిల్ నుంచి 07 జూన్ వరకు ప్రతి ఆదివారం 9 సార్లు ప్రయాణిస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు మార్గమధ్యంలో తిరుప్పూర్, ఈరోడ్, సేలం, కాట్పాడి, రెనిగుంట, కడప, గూటి, ధోనే, కర్నూల్ సిటీ, గద్వాల్, మహబూబ్‌నగర్, కాచిగూడ, నిజామాబాద్, నాందేడ్, భు సావల్, వడోదర, రత్లామ్, అజ్మీర్ తదితర ముఖ్య స్టేషన్లలో ఆగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లలో మొత్తం 3టైర్ ఏసి (3ఎసి) కోచ్‌లను మాత్రమే ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్‌ఒ ఎ.శ్రీధర్ తెలిపారు.

## చర్లపల్లి–రక్సౌల్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు..

**చర్లపల్లి రక్సౌల్ ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించిన దక్షిణ మధ్య రైల్వే**

ఈ మేరకు ట్రైన్ నం. 07005 చర్లపల్లి నుంచి రక్సౌల్‌కు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు బయలుదేరి రెండో రోజు సాయంత్రం 4.50 గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీసులు ఏప్రిల్ 12 నుంచి మే 31 వరకు మొత్తం 8 సార్లు నడుస్తాయి. అలాగే ట్రైన్ నం. 07006 రక్సౌల్ నుంచి చర్లపల్లికి ప్రతి బుధవారం తెల్లవారుజామున 3.15 గంటలకు బయలుదేరి తదుపరి రోజు సాయంత్రం 7.40 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఏప్రిల్ 15 నుంచి జూన్ 3 వరకు 8 సార్లు నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు జంగావ్, కాజీపేట్, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, బాల్హార్షా, రాయపూర్, రౌర్కెలా, రాంచీ, ధన్బాద్, బరౌని, సమస్తిపూర్, దర్భంగా, సీతామర్హి వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతాయి. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ రైళ్లలో 2ఎసి, 3ఎసి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో తెలంగాణ నుంచి ఉత్తర భారతానికి వెళ్లే ప్రయాణికులకు ఈ రైళ్ల పొడిగింపు ఎంతో ఉపశమనం కలిగించనుంది.

# పోరాటాలతోనే చేనేత రంగానికి న్యాయం

**రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోరాటాల ద్వారానే చేనేత రంగానికి న్యాయం జరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కా దేవదాస్ అధ్యక్షతన గురువారం ‘చేనేతకు టెండర్ గండం ప్రభుత్వ నిరంకుశ నిర్ణయం’ అంశంపై రౌండ్ టెబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టిజి ఎండిసి చైర్మన్ ఈరావత్రి అనిల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బిసి సంఘాల జెఎసి నాయకులు బాలగోని బాల్‌రాజ్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పోరాటాలు ఆపితే ఎవ్వరూ పట్టించుకోరని, పోరాటాల ద్వారానే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. చేనేత వస్త్రాల కొనుగోలు అంశంలో టెండర్ ప్రక్రియ విధానం తీసుకరావడం తనకు తెలియదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారన్నారు. ఈ సమస్యను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అనిల్ హామీనిచ్చారు. చిరంజీవులు మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి పారుదల ప్రాజెక్టుల కోసం లక్షలాది కోట్ల రూపాయాలు ఖర్చు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రెండు దఫాలుగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 7లక్షల 32 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. బడా ప్రాజెక్టులకు కమీషన్‌లకు కోసం బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం గడుపుతున్న కార్మిక వర్గానికి నిధులు విడుదల చేయడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. పేరుకు బడ్జెట్‌లో కేటాయింపులు చూపించడం, వాస్తవ పరిస్థితుల్లో మాత్రం నిధులు విడుదల చేయకపోవడంలో ప్రభుత్వ కుట్ర స్పష్టమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ. 280 కోట్ల మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన వస్త్రాలను టెండర్‌లు పిలవడం ద్వారా చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసమే అని మండిపడ్డారు. ఇప్పటికైన ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలతో ఎదరయ్యే ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని చిరంజీవులు హెచ్చరించారు. బాల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు ఐక్య పోరాటాలతోనే పరిష్కారం అవుతాయని అన్నారు. బిసి యూనైటెండ్ ఫ్రంట్ చేనేత కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఆయిలీ వెంకన్న గౌడ్, కర్నాటి వెంకటేశం, వనం శాంతి, భైరీ శేఖర్, రాపోలు జ్ఞానేశ్వర్, కర్నాటి మనోహర్, సరస్వతి, బొమ్మ రఘురాం నేత, గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అక్షరమే ఆయుధంగా ఎదగాలి

- అంతరాలు లేని ఆదర్శ సమాజం విద్య ద్వారానే సాధ్యం
- రాష్ట్రంలో పుట్టిన ప్రతీ బిడ్డ చదువుకోవటానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/ బోనకల్ /ఎర్రుపాలెం :** అక్షరమే ఆయుధంగా మలుచుకుని తెలంగాణ బిడ్డలు చదువుకుని బాగా ఎదగాలని, ఏ ఆయుధం తెలంగాణ బిడ్డలను నిలబెట్టలేదని కేవలం అక్షరం ద్వారానే సమసమాజం, అంతరాలు లేని ఆదర్శసమాజం విద్యాద్వారానే సాధ్యమవుతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆయన బోనకల్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ద్వారా కూడా స్పష్టమైందని తెలిపారు. విద్యార్థులకు రానున్న జూన్ 2 నుంచి అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియేట్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు పెడుతుందని, ఈ పెట్టుబడి వృధా కాకూడదని ఆయన కోరారు. రాష్ట్రంలో పుట్టిన బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో విద్యను బోధించేందుకు రాష్ట్రంలో ఒకేసారి 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూ ల్స్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట చదువుకుని ఒక వసుదైక కుటుంబ భావన ఏర్పాటు చేసేందుకు ఈ యవఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు పేద, మధ్య తరగతి వర్గాల ఫీజుల పేరిట చేసే ఖర్చును ఆదా చేసి ఆయా కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పర్చడంతో పాటు, పేద మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పిల్లలు బాగా చదుకునేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తనకు తెలిసిన మిత్రులతో మాట్లాడి అమ్మ ఫౌండేషన్ ద్వారా మధిర నియోజకవర్గంలోని బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లోని విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధు, ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య కోసం బడ్జెట్‌లో 13.5శాతం నిధులు కేటాయింపు : భట్టి

విద్యార్థుల భవిష్యత్ బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని వారి ఎదుగుదలే రాష్ట్ర ఎదుగుదలగా భావించి బడ్జెట్లో విద్యాశాఖకు 13.5 శాతం నిధులు కేటాయించి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఎర్రుపాలెం మండల కేంద్రంలో అమ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులుగా ఉచితంగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాటు విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జిలు పెంచలేదని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థిక భారం అయినప్పటికీ విద్యార్థుల డైట్ చార్జిలను 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 20శాతం పెంచామని తెలిపారు. విద్యార్థుల సమయం విలువైనది ఆ సమయం ఆదా చేయడంతో పాటు వారికి శ్రమ ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

# రైతు నుంచి రూ.10 వేలు లంచం!

**ఎసిబికి చిక్కిన అంతర్గాం గిర్ధావర్!**



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని తహసీల్దార్ కార్యాలయ గిర్ధావర్ సెడంక శ్రీమాన్ రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు గురువారం పట్టుబడ్డాడు. ఎసిబి ఎస్.ఐ. తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండంలోని రాయదండి గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో తహసీల్ కార్యాలయంలో ఆర్ఐని పట్టుకున్నట్లు తెలిపారు. తన తండ్రి మరణించడంతో అతడి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తల్లి పేరు మీద మార్చాలని, ధరణిలో పేరు కూడ తప్పుగా నమోదు అయిందని గత ఏడాది జూన్‌లో భూభారతి గ్రామసభలో వెంకటస్వామి దరఖాస్తు చేసుకున్నాడు. ఆరు మాసాలు అవుతున్న సమస్య పరిష్కారం కాలేదు. ఈ విషయమై ఇటీవల ఆర్ఐ. శ్రీమాన్‌ను వెంకటస్వామి కలిసి కోరాడు. అయితే క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి నివేదికను తహసీల్దారుకు ఇవ్వాలని, అందుకు డబ్బు ఖర్చు అవుతుందని, రూ.10 వేలు లంచం ఇస్తేనే పని చేసి పెడ్తానని ఆర్ఐ. చెప్పినట్లు వెంకటస్వామి తెలిపారు. ఈ విషయమై బాధితుడు కరీంనగర్‌లోని ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. లంచం తీసుకుంటున్న ఆర్ఐని వల పన్ని పట్టుకున్నారు. రైతు వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని శుక్రవారం గిర్ధావర్ శ్రీమాన్‌ను కరీంనగర్ లోని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ. తిరుపతి తెలిపారు.



# బిసి మహిళల వాటా తేల్చాల్సిందే : విహెచ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్ల బిల్లులో బిసి మహిళల వాటా తేల్చాల్సిందేనని కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి కేటగిరి రిజర్వేషన్ రెండోసారి చేస్తామని కేంద్రం పేర్కొటోందని, అయితే ఈ ప్రకటనపై తమకు నమ్మకం లేదన్నారు. గాంధీభవన్‌లో గురువారం మీడియాతో హనుమంతరావు మాట్లాడుతూ మహిళా బిల్లులో బిసిలకు సంఖ్యాపరంగా న్యాయం జరగాలని, దీనికి అన్ని పార్టీల మద్దతు ఇవ్వాలని కోరారు. రాజ్యాధికారంలో బిసి మహిళకు చోటు కల్పించకుంటే ‘నరేంద్ర మోదీకో అటావో ఒబిసికో బచావో’ నినాదంతో ఉద్యమం చేపడతామని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల16న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి ఓబిసి మహిళా తరలిరావాలని కోరారు.

# మహిళా రిజర్వేషన్లపై కేంద్ర నిర్ణయం ఏకపక్షం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని కేంద్రం చెప్పడం మహిళా లోకాన్ని మోసం చేయడ మేనని గురువారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత జనగణనలో ఒబిసి గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనగణనలో ‘కులం’ కాలం ఉన్నప్పటికీ వారు ఒబిసిలకు చెందుతారనే క్లాసిఫికేషన్ లేదని, తద్వారా బిసిల జనాభా ఎంత అనే లెక్క తేలబోదని తెలిపారు. జనగణన లో ఒబిసిలను లెక్కించి ఆ తర్వాతనే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కోటా విషయంలో బిజెపి చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బిసి మహిళలంతా సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు.

GHMC ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.

Short NIT No. 01/EE-II/CIRCLE-39/KHAIRATABAD ZONE/GHMC/2026-27, తేది: 08.04.2026

NIT No. 01/EE-II/CIRCLE-39/KZ/GHMC/2026-27, పని పేరు: సివిల్ పనులు (1 నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.5.20 లక్షలు, ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం: క్ర.సం.01 నుండి 02 వరకు పనుల కొరకు 09.04.2026న మ.12.00గం.ల నుండి 13.04.2026న మ.12.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు, ఇ-మెయిల్ ఐడి: eec39.ameerpet@gmail.com, మొబైల్ నెం. 9063836121.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 387-PP/CL/ADVT/2026-27, Date: 09-04-2026

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయుకట్టు అభివృద్ధి శాఖ
O/o కార్యానిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నెం.1, యల్.యం.డి.కాలనీ, కరీంనగర్.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

వరుస నెం. 1, టెండర్ నోటీసు నెం. EE/ID1/LMD/KNR08/2025-26, తేది: 17.03.2026 (2nd Call), పని పేరు: శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్, మాన్వాడ (వి), బోయినిపల్లి (మం), రాజన్న సిరిసిల్ల జిల్లా - శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్ (MMR) యొక్క నిర్వహణ మరియు ఆపరేషన్ కొరకు 2026-27 సంవత్సరానికి గాను సిబ్బంది అవసరం. పని విలువ: రూ.28,48,935/-, షెడ్యూల్ సేల్ (అమ్మకం): 10.04.2026న ఉ.11.00గం.ల నుండి 16.04.2026న ఉ.11.30గం.ల వరకు, బిడ్ సమర్పించుటకు చివరి తేది మరియు సమయం: 16.04.2026న ఉ.11.31గం.ల వరకు, బిడ్ ఓపెనింగ్ తేది మరియు సమయం: 16.04.2026న మ.12.00గం.ల వరకు, సంప్రదించు ఫోన్ నెం. 8341815718, సంప్రదించరు మెయిల్ ఐడి: eediv2ffc2@gmail.com, మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ : www.tender.telangana.gov.in చూడగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నెం.1, యల్.యం.డి.కాలనీ, కరీంనగర్.

DIPR R.O. No. : 412-PP/CL/ADVT/2026-27, Date: 09-04-2026

# ధాన్యం కోటా పెంచండి

## కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో భారీగా పెరుగుతున్న వరి ధాన్యం ఉత్పత్తికి, కేంద్రం కేటాయిస్తున్న సేకరణ కోటాకు మధ్య నెలకొన్న వ్యత్యాసాన్ని పరిష్కరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. రైతులు ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు అమ్ముకునేందుకు కేంద్రం సహకారం అందించాలని లేఖలో కోరారు. ఇందుకు ఎఫ్‌సిఐ ముడి బియ్యం లక్ష్యాన్ని తగ్గించి, రబీ 2024–25కు గాను 5 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ బియ్యం లక్ష్యాన్ని పునర్‌కేటాయించాలని మంత్రి కోరారు. ప్రస్తుతం 8.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా సరఫరా చేయాల్సి ఉందని, అయితే గడువు 2026 ఫిబ్రవరి 28తో ముగిసిందని, దీనిని మరో 60 రోజుల పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వరి ధాన్యం శ్రేష్టమైన



గింజ లక్షణాలు, తక్కువ స్థాయి తేమ ఉంటుందని, దీంతో పారాబాయిల్డ్ బియ్యంగా మార్చడానికి ఎంతో అనువైనవని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు కేవలం 5 శాతం నూకలను మాత్రమే సరఫరా చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించారని, ఇది ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఉత్పత్తి సామర్థ్యానికి అనుగుణంగా, ప్రస్తుత స్థాయిల నుండి గణనీయంగా పెంచుతూ, మొత్తం కెఎంఎస్ 2025–26 (ఖరీఫ్ రబీ సీజన్‌లు రెండింటిని కలిపి) కోసం ఉడకబెట్టిన బియ్యం లక్ష్యాన్ని 20 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు పెంచాలని ఆయన కోరారు. రబీ 2024–25 సరఫరాకు సంబంధించి కూడా మరో రెండు నెలల పొడిగింపు అవసరం ఉందన్నారు. ఎఫ్‌సిఐకి అందించే ఉడికించిన బియ్యం శాతం తగ్గుముఖం పడుతూ, 2024–25 నాటికి ఇది 66.78 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2023 తర్వాత వరి ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, దీంతో లక్షలాది మంది రైతులను కాపాడటానికి సేకరణ కొనసాగించడం అత్యవసరం మని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంమద్దతు లేకుండా అదనపు వరి వల్ల కలిగే ఆర్థిక భారాన్ని రాష్ట్రం నిరవధికంగా భరించలేదని, ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించాలని కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.



## ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలి

ఎస్.ఛాయాదేవి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల కోసం నిరంతరం ఉద్యమిస్తున్న సిపిఐకి ఆర్థికంగా తోడ్పాటు అందించి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా గురువారం సింగరేణి కాలనీలో ఇంటింటికి ప్రచారం చేస్తూ ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఛాయాదేవి మాట్లాడుతూ సిపిఐకి ప్రజలందరూ సహకారం అందిస్తూ తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా సిపిఐ ఇలాగే ఆదరించాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మహిళా నాయకురాలు వి.సక్రీవాయి, డివిజన్ సహయ కార్యదర్శి దశరథ్ నాయక్, యువ నాయకులు కళ్యాణ్, జోసెఫ్ భాను, డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత ప్రొఫెసర్, విద్యార్థులను నక్సలైట్ పేరుతో వేధింపులు ఆపివేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొన్ని రోజులుగా ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతను, దళిత విద్యార్థి కరికే మహేష్‌లను అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తూ వేధించడాన్ని తక్షణమే ఆపేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ కె.చక్రధర్‌రావు, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో దళిత ప్రొఫెసర్, విద్యార్థులను నక్సలైట్ పేరుతో వేధిస్తున్నారని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతను, కరికే మహేష్ అర్బన నక్సలైట్ అంటూ కొందరు విద్యార్థులు కలెక్టర్‌కు, ఎంపిలకు ఫిర్యాదు చేస్తున్నారని, వివిధ మాధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తున్నారనితెలిపారు. ఇప్పటికైనా ఇటువంటి నిరాధారమైన ఆరోపణలను, వేధింపులను, కక్ష పూరిత చర్యలను మానకోవాలని, యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి, అకాడమిక్ వాతావరణాన్ని కాపాడాలని వారు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను కోరారు.

## ఇంటి అద్దె భత్యం మంజూరు చేసేలా సిఫారసు చేయండి’

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఉద్యోగులకు కొత్త కార్పొరేషన్ పరిధిలో 17 శాతం, మున్సిపాలిటీల్లో 13 శాతం ఇంటి అద్దె భత్యం మంజూరు చేయాలని టిఎస్ యుటిఎఫ్ కోరింది. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ కార్పొరేషన్లకు, వాటి శివారు 8 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 17 శాతం , నూతన మునిసిపాలిటీలకు, వాటి శివారు 8 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు 13 శాతం ఇంటి అద్దె భత్యం చెల్లించే విధంగా సిఫారసు చేయాలని కోరుతూ టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, కోశాధికారి టి. లక్ష్మారెడ్డిలు రెండవ వేతన సవరణ సంఘం చైర్మన్ శివశంకర్ , సభ్యులు ఎ రామయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. జులై 1, 2023 నాటి పరిస్థితులపైన తమ సిఫారసులు ఉంటాయని, అయితే తర్వాత అప్‌గ్రేడ్ అయిన నగరాలు, పట్టణాలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వమే ఇంటి అద్దె భత్యం మంజూరు చేయవచ్చని సూచిస్తామని శివశంకర్ చెప్పినట్టు వారు వివరించారు.

## 102 మంది జీవిత ఖైదీల విడుదలకు వినతి : హెచ్‌ఆర్‌ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంబేద్కర్ జయంతి సందర్భంగా 102 మంది జీవిత ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హ్యూమన్ రైట్స్ ఫోరం (హెచ్‌ఆర్‌ఎఫ్) వినతి పత్రం సమర్పించారు. ‘‘సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం విడుదలకు అర్హులైన 102 మంది జీవిత ఖైదీల (వారిలో 6 మంది మహిళలు) జాబితా ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో పరిశీలనలో ఉన్నట్లు మా వేదికకు తెలిసింది. ఈ నిర్ణయం న్యాయం, సంస్కరణ, మానవత్వం అనే విలువలను ప్రతిబింబిస్తుంది. అయితే విడుదలకు అర్హులైన ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఈ నిర్ణయం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. జిఓ 126, తేదీ 27.10.2025 ప్రకారం మరో జాబితా కూడా విధివిధానాల ప్రకారం జాబితా తయారు చేసే ప్రక్రియలో ఉందని మాకు తెలిసింది. ఈ నేపథ్యంలో పై పేర్కొన్న 102 మంది జీవిత ఖైదీలను ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా విడుదల చేయాలని మేము వినమ్రంగా కోరుతున్నాము. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ న్యాయం, సమానత్వం, మానవ గౌరవం అనే ఆదర్శాలకు యథార్థ నివాళిగా నిలుస్తుంది. ఈ విడుదల కోసం ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్‌ను వీలైనంత త్వరగా ప్రకటించాలని మనవి. ఇది సంబంధిత కుటుంబాలకు అపారమైన ఆనందాన్ని కలిగించడమే కాకుండా, ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరుస్తుంది’’ అని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎస్.జీవన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.తిరుపతయ్య, హైదరాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి సంజీవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## వాహన్ పోర్టల్ ద్వారా మరిన్ని సేవలు అందుబాటులోకి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా వాహన్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు సుమారు 33 వేల వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు(ఆర్‌సి) జారీ చేయబడ్డాయనీ, ఇందులో భాగంగా ఏప్రిల్ 11 నుంచి రాష్ట్రంలోని అన్ని షోరూంలలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్‌సి)తో పాటు డ్రైవింగ్ లైసెన్సులు (డిఎల్) నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్ యాప్ ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రంలో నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు వాహన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను ఏప్రిల్ 23 నుంచి అమలు చేయనున్నట్లు రవాణా శాఖ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్‌టిఎ కార్యాలయాల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయనీ, ముఖ్యంగా రూ.1 వెయ్యి వరకు డీలర్‌కు ప్రతినిధి అనుమతి ఇవ్వడం ద్వారా ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయనున్నట్లు వెల్లడించారు.

‘వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ల ’ నియామకాల్లో అక్రమాలు..

## ఉన్నతస్థాయి విచారణ చేపట్టండి

డాక్టర్స్ ఫెడరేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చేపట్టిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (టిడిఎఫ్) ఆరోపించింది. పోస్టుల కేటాయింపు నిమ్మితం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.12 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు డబ్బులను డిమాండ్ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని టిడిఎఫ్ తెలిపింది. నియామక ప్రక్రియపైన ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు టిడిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్. విజయేందర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పారదర్శకత లేని ఎంపిక విధానంతో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, నియామక ప్రక్రియలో మార్కుల కేటాయింపులు అస్తవ్యస్తంగా ఉన్నదని, మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు జరగడం లేదని పేర్కొన్నారు.



## గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

గోదావరి పుష్కర ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

**ప్రజాపక్షం/హైదాబాద్ :** రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే ముఖ్యమంత్రి తగిన సూచనలు చేశారని, ఆ ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగిన ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సమర్పించాలని సిఎస్ సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈఎన్‌సిలు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని ఆయన సూచించారు.

## విద్యార్థిశక్తి దేశభవిష్యత్తును తీర్చిదిద్దే దిక్సూచి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థి శక్తి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక దిక్సూచి అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యుఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి విద్యార్థులకు, విద్యార్థి సంఘాల నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. తన విద్యార్థి దశలోనే ఎన్‌ఎస్‌యుఐలో చురుకుగా పనిచేసిన అనుభవం తన రాజకీయ ప్రస్థానానికి బలమైన పునాది వేసిందని మంత్రి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అచంచల నిబద్ధతతో పనిచేస్తే, ఆ కృషిని పార్టీ ఎప్పటికప్పుడు గౌరవిస్తూ అవకాశాలను కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, విప్‌గా, ప్రస్తుతం మంత్రిగా తన ఎదుగుదల కాంగ్రెస్ పార్టీ అందించిన అవకాశాల ఫలితమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిజాయితీగా పనిచేసే ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని ఆయన అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా 13 నుంచి 18వ తేదీ వరకు ‘అరైవ్-అలైవ్’

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అరైవ్‌అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల ప్రాణాలను రక్షించడానికి రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం అమలుపై డిజిపి బి.శివధర్‌రెడ్డితో కలిసి సిఎస్ గురువారం డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని అన్నారు. వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలను కనుగొనాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి, వారాంతర అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఇది పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు , ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, సిఐపిఆర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

## నిర్మాణ నిబంధనలు పాటించాల్సిందే

బిల్డర్‌లకు స్పష్టం చేసిన సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో జరుగుతున్న నిర్మాణాల్లో నిబంధనల అమలు, పర్యావరణ ప్రమాణాల పాటించాల్సిందేనని నిర్మాణదారులకు కమిషనర్ సృజన స్పష్టం చేశారు. అన్ని ప్రాజెక్టుల్లో మార్గదర్శకాలను పాటించని పక్షంలో చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కమిషనర్ సృజన అధ్యక్షతన బిల్డర్స్ అసోసియేషన్‌లు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో గురువారం సంస్థ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత, రాబోయే నిర్మాణ ప్రాజెక్టుల్లో నిర్మాణ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు, చట్టబద్ధ నియమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సైబరాబాద్ వ్యాప్తంగా సాగుతున్న, రాబోయే అన్ని ప్రాజెక్టులలో చట్టబద్ధమైన నిబంధనలను, నిర్మాణ నియమాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము, వాయు కాలుష్యాన్ని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం నిర్ణీత పరిమితికి మించకుండా చూడాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణం మంజూరైన ప్లాన్ ప్రకారం పూర్తిగా పూర్తయిన తర్వాతే పాక్షిక ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విషయంలో జి.ఓ 168 నిబంధనలను పాటించడం తప్పనిసరి అన్నారు. నిర్మాణ వ్యర్థాలను కేవలం ప్రభుత్వం గుర్తించిన లేదా అధీకృత ఏజెన్సీలకు మాత్రమే అప్పగించాలన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో కార్మికులు, పౌరుల భద్రత కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంజూరైన ప్లాన్ ప్రకారం బఫర్ జోన్‌లను ఖచ్చితంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. నిర్మాణ సమయంలో, పత్రాల పరిశీలన సమయంలో బిల్డర్లు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాజెక్టుల్లో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. బాధ్యతాయుత నిర్మాణాలు జరపాలన్నారు.



## బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా మురికి వాడల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 740 మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందినట్లు అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్ తెలిపారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆరోగ్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక నిపుణుల వైద్య బృందాలు రోగులను పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించాయి. జ్వరం, జలుబు, రక్తపోటు, షుగర్ వంటి సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి, తక్షణ చికిత్స అందించారు. రోగుల పరిస్థితికి అనుగుణంగా సలహాలు ఇచ్చి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రజల నుంచి స్పందన వచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

## ఉత్తమ విజిలెన్స్-అధికారులకు రివార్డ్స

శిఖా గోయల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది కేవలం ఆదాయ లీకేజీలను గుర్తించడం మాత్రమే కాకుండా, సేవా పంపిణీలో లోపాలను సరిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని విజిలెన్స్ డిజి శిఖా గోయల్ అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, విచారణలు, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో విశిష్టంగా పనిచేసిన అధికారులకు ప్రశంసా పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రాంతీయ విభాగాలు చురుకుగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. గత ఆరు నెలల్లో విభాగం రూ.90 కోట్ల మేర ఆదాయ లీకేజీలను గుర్తించిందని ఆమె వెల్లడించారు.
రాష్ట్రవ్యాప్తంగా 2,669 మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుకను స్వాధీనం చేసుకుని 27 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 134 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అదనంగా రూ.103.70 లక్షల విలువైన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం మళ్లింపు, ఆహార కల్తీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డిజి స్పష్టం చేశారు. ప్రతి త్రైమాసికంలో ఈ రివార్డ్స్ రోల్ నిర్వహించి సిబ్బందిలో ప్రేరణ పెంపొందించనున్నట్లు తెలిపారు. అక్రమాలు, పన్ను ఎగవేతపై సమాచారం ఉంటే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలియజేయాలని అధికారులు కోరారు.

## బడుగు విద్యార్థుల చావులకు ప్రభుత్వమే కారణం

జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బడుగు విద్యార్థుల చావులకు ప్రభుత్వమే కారణమని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బుధవారం రాత్రి హైదరాబాదులోని వనస్థలిపురం వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారని, వారి చావుకు రాష్ట్ర ప్రభుత్వ మే పరోక్ష కారణమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రియంబర్స్‌మెంట్ అమలు చేయకపోవడంతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ జిల్లాకు చెందిన బడుగు విద్యార్థులైన కంచర్ల శివ, నకరికంటి సందీప్ కాలేజీ ఫీజులు చెల్లించడానికి ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌లుగా పార్ట్ టైంగా పనిచేస్తూ బుధవారం రాత్రి 11:30 గంటలకు రామ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి మద్యం మత్తులో విద్యార్థులు వెళుతున్న వాహనాన్ని ఢీ కొట్టి చంపేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీలో ఫీజులు చెల్లించలేక తీవ్ర మానసిక క్షోభకు గురై ఇప్పటికీ 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ప్రమాదంలో మృతి చెందిన కంచర్ల శివ, నకరికంటి సందీప్‌లకు ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రమాదంలో గాయపడిన మరో విద్యార్థి సభావత్ శ్రీధర్‌కు మెరుగైన వైద్యాన్ని అందించడంతో పాటు అతనికి కూడా రూ.20 లక్షల చెల్లించాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలుగుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రం గౌడ్, గూడూరు భాస్కర్ పాల్గొన్నారు.

షేక్‌పేట్ – మాసబ్ ట్యాంక్ మార్గం..

## ‘మోడల్ కారిడార్’గా అభివృద్ధి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసబ్ ట్యాంక్ వరకు ఉన్న రహదారిని ‘మోడల్ కారిడార్’గా అభివృద్ధి చేయడానికి అధికార యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు గురువారం జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌తో పాటు ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. అధికారులు ఒకే బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యలోని ట్రాఫిక్ అడ్డంకులు (బాటిల్ నెక్స్), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను పరిశీలించి తక్షణ పరిష్కార చర్యలను సూచించారు.

**పాదచారుల భద్రతకు చర్యలు**

ఎస్‌డిఐ హాస్పిటల్, బృందావన్ కాలనీ రోడ్ నెంబర్1 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించనున్నారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు సెంట్రల్ మీడియన్, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రహదారిని విస్తరించనున్నారు. ఎన్‌ఎండిసి, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి పనులు చేపట్టాలని నిర్ణయించారు.

**అడ్డంకుల తొలగింపు – సులభ రాకపోకలు**

రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్డురాయి, షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించాలని నిర్ణయించారు. మాసబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫర్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నెంబర్12కు స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.

**శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు**

నగర ట్రాఫిక్ పనుల కోసం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నట్లు కర్ణన్ వెల్లడించారు.
కెబిఆర్ పార్క్ వద్ద పెండింగ్ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టామని సిపి సజ్జనార్ తెలిపారు. ఈ పర్యటనలో జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, గోల్కొండ జోనల్ కమిషర్ జి.ముకుంద రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డెవిస్, అదనపు డిసిపి వేణుగోపాల్ రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి డి.ధనలక్ష్మి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సునేత్రా పవార్ ఏకగ్రీవం!



**ముంబయి:** మహారాష్ట్రలో బారామతి అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికపై కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పోటీ నుంచి వైదొలగనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో డిప్యూటీ సీఎం సునేత్రా పవార్ ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అజిత్ పవార్‌పై ఉన్న గౌరవంతో తమ అభ్యర్థిని ఉపసంహరించుకుంటున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ వెల్లడించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సహా ఇతర సీనియర్ నేతలు కాంగ్రెస్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి 28న మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన బారామతి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏప్రిల్ 23న అక్కడ పోలింగ్ జరగాల్సి ఉంది. చివరకు పోటీ నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలగనున్నట్లు ప్రకటించడంతో పవార్‌కు కంచుకోటగా ఉన్న బారామతి నుంచి సునేత్రా పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# కేంద్ర మాజీ మంత్రి అబు హుసేం ఖాన్ చౌదరి కన్నుమూత

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి అబు హుసేం ఖాన్ చౌదరి (88) కన్నుమూశారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేతగా గుర్తింపు పొందారు. కోల్‌కతాలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మతి చెందారు. ఆయన అంత్యక్రియలు మాల్దాలోని స్వగ్రామంలో నిర్వహించనున్నారు. 1996 నుంచి 2006 వరకు కాలియాచోక్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన, మాల్దా దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. యూపీఏ ప్రభుత్వ కాలంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో రాష్ట్ర మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

# ట్రెక్కింగ్‌కు వెళ్లి మరో బాలిక అదృశ్యం



**బెంగళూరు:** కేరళకు చెందిన మరో బాలిక (14) కర్నాటకకు వెళ్లి అదృశ్యమైంది. ఈ క్రమంలో పోలీసులు బందాలుగా ఏర్పడి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం... కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన బాలిక పదోతరగతి చదువుతోంది. కర్నాటకలోని చంద్రద్రోణ హిల్స్ పైకి ఈ నెల ఏడో తేదీన దాదాపు 40 మంది కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లింది. అదేరోజు సాయంత్రం తమ బందం నుంచి ఆ బాలిక దారి తప్పిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే బాలిక కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. కొండలపై తాళ్ల సాయంతో వెతికారు. రాత్రి వేళల్లో డ్రోన్లతోనూ ఆమె కదలికలను గుర్తించేందుకు ప్రయత్నించారు. కర్నాటక పోలీసులతోపాటు కేరళ పోలీసులు కూడా ఈ కేసు దర్యాప్తు చేశారు. కాగా కేరళకు చెందిన శరణ్య అనే యువతి కూడా ఈ నెల రెండో తేదీన కర్నాటకలో ట్రెక్కింగ్‌కు వెళ్లి తప్పిపోయింది. అనంతరం పోలీసులు గాలింపులు చేపట్టడంతో నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ దొరికింది.

# కేరళలో బిజెపి ఖాతా తెరవదు: శశిథరూర్



**తిరువనంతపురం:** కేరళలో బిజెపి భవితవ్యంపై కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపి శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ ఎన్నటికీ అధికారంలోకి రాలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో గురువారం ఓటు హక్కు వినియోగించుకున్న ఆయన... మీడియాతో మాట్లాడారు. కేరళలో బిజెపి ఎప్పటికీ అధికారంలోకి రాదు. ఆ పార్టీ ఖాతా కూడా తెరవదు. అసలు ఆ పార్టీ ఇక్కడ ఎలాంటి ప్రభావం చూపబోదు. ఇక్కడ పోటీ ఎల్డీఎఫ్‌యూడీఎఫ్ మధ్యే ప్రధానంగా ఉండబోతోంది. విజయన్ పాలనలో కనీసం ఇళ్లు కూడా నిర్మించలేకపోయారు. భారీగా పోలింగ్ నమోదు అవుతోంది. దీనిని మా యూడీఎఫ్ అధికారానికి సంకేతంగా భావిస్తున్నా అని అన్నారాయన. 2011లో తమ ప్రభుత్వానికి కేరళ ప్రజలు అధికారం ఇచ్చారని... ఆ సమయంలో తక్కువ మెజారిటీ దక్కిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఈసారి మాత్రం భారీ మెజారిటీతో అధికారం కట్టబెడతారని ఆశిస్తున్నట్లు తెలిపారాయన.

## హోర్ముజ్ జలసంధి ద్వారా నవీ ముంబయిలోని జెఎన్‌పిఏకు చేరుకున్న...

# 15,400 టన్నుల భారత ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశ'

### యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి జెఎన్‌పిఏకు చేరుకున్న తొలి నౌక ఇది




**థానే:** పశ్చిమాసియా ఘర్షణల నడుమ హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటిన 15,400 టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)ను తీసుకువెళ్తున్న భారత జెండా కలిగిన నౌకను తమ వద్దకు చేరుకుందని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జెఎన్‌పిఎ) గురువారం తెలిపింది. ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతోన్న యుద్ధం నేపథ్యంలో ఈ పరిణామం గమనార్హమైనదని జెఎన్‌పిఏ అభివర్ణించింది. ఈ రోజు హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటి జెఎన్‌పిఏ ద్రవ నిల్వ కేంద్రంలో లంగరు వేసిన భారత జెండా కలిగిన ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశ'కు జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ సగర్వంగా స్వాగతం పలికిందని, ఈ నౌకను బిపిసిఎల్‌ఐఓసిఎల్ నిర్వహిస్తుంటాయని జెఎన్‌పిఏ ఒక ప్రకటనలో తెలియజేసింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి జెఎన్‌పిఏకు చేరుకున్న మొట్టమొదటి నౌక ఇదే కావడం ఒక ముఖ్యమైన మైలురాయి అని, ఈ 'గ్రీన్ ఆశా' నౌక 15,400 టన్నుల ఎల్‌పిజిని తీసుకువచ్చిందని అది పేర్కొంది. ఓడ సహా దానిలోని సరుకు, సిబ్బందిలోని ప్రతీ ఒక్కరూ క్షేమంగా ఉన్నారని పేర్కొంది. సంక్లిష్టమైన భౌగోళిక, రాజకీయ పరిస్థితుల మధ్య కూడా దేశానికి అవసరమైన ఎల్‌పిజి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించగల సముద్ర కార్యకలాపాల సామర్థ్యాన్ని ఈ నౌక రాక చాటిచెబుతోందని జెఎన్‌పిఏ ప్రకటన తెలిపింది.నవీ ముంబయిలోని జెఎన్‌పిటి, నవ శేవా పోర్ట్ అని పిలువబడే ఈ సదాఉపాయం కంటైనర్, ద్రవసరుకుల కార్గోను నిర్వహించే కీలకమైన ఓడరేవులలో ఒకటి అని, దేశ ఇంధన సరఫరా గొలుసులో ఇది కీలకపాత్ర నిర్వర్తిస్తుందని అధికారులు తెలిపారు. పశ్చిమాసియా సంఘర్షణ హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాను తీవ్రస్థాయిలో ప్రభావితం చేసింది.

# గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు



**న్యూఢిల్లీ:** అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ... దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీంతో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి ఖతార్ పర్యటనకు వెళ్లారు. హర్దీప్ సింగ్ పురి గురు, శుక్రవారాల్లో ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటనకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇరాన్ ప్రతీకార దాడులకు గురైన గల్ఫ్ దేశాల్లో ఖతార్ ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉత్పత్తులను పునఃప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దష్ట్యా పరిమిత కార్యకలాపాలే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇక భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యనకు సిద్ధమయ్యారు. ఈనెల 1112 తేదీల్లో జైశంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ పేర్కొంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హోర్మూజ్ జలసంధిని మూసివేయడంతో భారత్‌లో ఇటీవల ఎల్‌ఎన్‌జీ కొరతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. కేంద్రం ఈ ఆందోళనలను కొట్టిపారేసింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉన్నాయని, కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారాలు నిరాధారమైనవని చెప్పుకొచ్చింది.

# వాతావరణ సదస్సు జరపలేం: భారత్



**న్యూఢిల్లీ:** 2028లో జరగనున్న ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ మార్పుల సదస్సు, సిఒపి 33కు ఆతిథ్యం ఇచ్చేందుకు దాఖలు చేసిన బిడ్‌ను భారత్ ఉపసంహరించుకుందని అధికార వర్గాలు తెలిపాయి. 2023లో దుబాయ్‌లో జరిగిన సిఒపి 28 సందర్భంగా, 2028లో సిఒపి 33కి భారతదేశం ఆతిథ్యం ఇవ్వాలనుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆ అంతర్జాతీయ వేదిక నుండి ప్రతిపాదించారు. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రపంచ పోరాటంలో భారత్ పాత్రను, నాయకత్వాన్ని నొక్కిచెబుతూ ప్రధానమంత్రి నాడు ఈ ప్రతిపాదన చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిఒపి 33కు ఆతిథ్యం ఇచ్చే తన ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు భారతదేశం సంబంధిత అంతర్జాతీయ సంస్థలకు అధికారికంగా తెలియజేసింది. ఈ నిర్ణయం వెనుక గల కారణాలపై పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు, బాన్‌లోని సిఒపి ప్రధాన కార్యాలయానికి పంపిన ప్రశ్నలకు కూడా ఇంకా సమాధానం రాలేదు. వాస్తవంగా ఈ కార్యక్రమానికి సన్నాహాలు చేయడంలో భారతదేశం చాలా చురుకుగా ఉంది. 2025 జూలైలో భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేకమైన 'సిఒపి 33 సెల్'ను ఏర్పాటు చేసింది. వత్తిపరమైన, లాజిస్టికల్ అవసరాలు తీర్చడం, 2028 శిఖరాగ్ర సమావేశానికి ప్రణాళిక రూపొందించడం ఈ సెల్ ప్రాథమిక ఉద్దేశం. ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో జరిగే ఈ వార్షిక వాతావరణ సదస్సులకు ఆఫ్రికా, ఆసియాపసిఫిక్, లాటిన్ అమెరికా, తూర్పు ఐరోపా, పశ్చిమ ఐరోపా వంటి వివిధ ప్రాంతీయ సమూహాలు ఆతిథ్యం ఇస్తాయి. ఈ సంవత్సరం సిఒపి 31కి టర్కీ, ఆస్ట్రేలియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనుండగా, వచ్చే ఏడాది సిఒపి ఇథియోపియా రాజధానిలో జరగనుంది. సిఒపి లేదా 'కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్' అనేది ఐక్యరాజ్యసమితి వాతావరణ చట్రం కింద జరిగే అతిపెద్ద వార్షిక సమావేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు వాతావరణ మార్పును ఎదుర్కోవడానికి వ్యూహాలు, లక్ష్యాలు, విధానాలపై చర్చిస్తాయి.

## బెంగాల్ ఎన్నికల కోసం అదనపు బలగాలు..

# 150 సిఏపిఎఫ్, రాష్ట్ర పోలీసు కంపెనీలు మోహరింపు

### కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ



**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సెస్ (సిఏపిఎఫ్)కు చెందిన 150 అదనపు కంపెనీలు సహా రాష్ట్ర పోలీస్ కంపెనీలను మోహరించేందుకు రంగం సిద్ధమైంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో బెంగాల్ శాసనసభ ఎన్నికలు జరిగేలా చూసేందుకు సిఏపిఎఫ్ అదనపు కంపెనీలు, రాష్ట్ర పోలీస్ కంపెనీలను మోహరించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బుధవారం ఆదేశించినట్లు ఒక అధికార ప్రకటన తెలిపింది. దీంతో మొత్తం బలగాల సంఖ్య సుమారు 2,400 కంపెనీల నుండి 2,550కి పెరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు 480 కంపెనీలను మోహరించగా, మార్చి 19న అదనంగా 1,920 కంపెనీలను మోహరించినట్లు ప్రకటించి, ఏప్రిల్ 17నాటికి మోహరింపును పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తాజా మోహరింపులో సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బిలతో కూడిన సిఏపిఎఫ్‌కు చెందిన 95 కంపెనీలు, అలాగే అసోం, మధ్యప్రదేశ్, బిహార్, హహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల సాయుధ పోలీసు బలగాలకు చెందిన 55 కంపెనీలు ఉన్నాయని ఆ ప్రకటన తెలిపింది. ఏప్రిల్ 18నాటికి బలగాలను చేర్చుకోనున్నట్లు ఆ ప్రకటన తెలియజేసింది. సున్నితమైన నియోజకవర్గాలలో భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేయడమే ఈ చర్య లక్ష్యమని ఎన్నికల సంఘం (ఇసి) సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేసిన ఎన్నికల సంఘం అందరికీ సమాన అవకాశాలను కల్పించేందుకు కేంద్ర బలగాల మోహరింపును పెంచాలని నిర్ణయించింది. శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడానికి తగినంత బలగాల మోహరింపు చాలా కీలకం అని పేరు వెల్లడించని అధికారి ఒకరు 'పిటిఐ'కి తెలిపారు. ఏరియా ఆధిపత్యం, మార్గ పాదయాత్రలు, పోలింగ్ రోజు విధుల కోసం కేంద్ర బలగాలను వ్యూహాత్మకంగా మోహరిస్తారని ఆ అధికారి వివరించారు. సమర్థవంతమైన మోహరింపు, త్వరిత ప్రతిస్పందన సామర్థ్యాన్ని నిర్ధారించడానికి తాము రాష్ట్ర అధికారులతో కలిసి పనిచేస్తున్నామని ఆయన చెప్పారు. విధులలో పాల్గొనేందుకు రానున్న కంపెనీలకు వసతి కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతన్నాయన్నారు. ఇందుకోసం రాష్ట్ర పోలీసులు, కేంద్ర ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని ముమ్మరం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. తక్షణమే పాటించడం కోసం మంత్రిత్వ శాఖ ఆదేశాన్ని రాష్ట్ర ప్రధానకార్యదర్శి, హోం కార్యదర్శి, డిజిపికి పంపించడం జరిగిందన్నారు. 294మంది సభ్యులు కలిగిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23,29 తేదీలలో జరుగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

# భారత వృద్ధి రేటు 6.6 శాతం: ప్రపంచబ్యాంక్



**న్యూఢిల్లీ:** ఈ ఆర్థిక సంవత్సరంలో భారత వద్ధి రేటు అంచనాలను స్వల్పంగా పెంచి 6.6 శాతానికి సవరించినట్లు ప్రపంచబ్యాంక్ తెలిపింది. ప్రారంభంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వినియోగదారుల డిమాండ్‌ను పెంచినప్పటికీ పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులు వద్ధిలో కోత విధించవచ్చని పేర్కొంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వద్ధి అంచనాలను ఆర్‌బీఐ 6.9 శాతం, ఓఈసీడీ 6.1 శాతం, మూడీస్ రేటింగ్స్ 6 శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ 'దక్షిణాసియా ఆర్థిక నివేదిక'ను విడుదల చేసింది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల పటిష్టత కారణంగా భారతదేశ వద్ధి రేటు 2025లో నమోదైన 7.1 శాతం నుండి 2026 ఆర్థిక సంవత్సరంలో 7.6 శాతానికి వేగవంతమవుతుందని అంచనా వేసింది. తక్కువ ద్రవ్యోల్బణం, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) క్రమబద్ధీకరణతో వ్యక్తిగత వినియోగ వద్ధి వేగవంతమైందని పేర్కొంది. 'పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్న ప్రతికూలతల కారణంగా 2027 ఆర్థిక సంవత్సరంలో వద్ధి 6.6 శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాము' అని నివేదిక పేర్కొంది.

# వంట గదిలోకి అనుమతించకపోవడమూ క్రూరత్వమే

### బాంబే హైకోర్టు



**ముంబయి:** అత్తారింట్లో మహిళను వంట గదిలోకి అనుమతించకపోవడమూ మానసిక క్షోభకు గురిచేయడమేనని బాంబే హైకోర్టు స్పష్టంచేసింది. భర్త తనను వంటగదిలోకి రానివ్వడం లేదంటూ ఇటీవల ఓ మహిళ అతడిపై కేసు పెట్టింది. దీంతో అతడు బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ... ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతో పాటు మానసిక క్షోభకు గురిచేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. వారిద్దరూ 2022లో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే వారి మధ్య వివాదాలు మొదలయ్యాయి. దీంతో అత్తింటివారంతా ఆమె ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నన్ను వంట గదిలోకే అనుమతించలేదు. ఆహారం కూడా బయట నుంచి తెచ్చుకోవాలని బలవంతం చేశారు. పుట్టింటి వాళ్లని కూడా కలవనివ్వలేదు. విడాకులు ఇవ్వాలని ఇబ్బందిపెడుతున్నారు' అని ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలను ఆమె భర్త ఖండించారు. 'విడాకులు ఇవ్వాల్సివస్తుందనే కారణంతోనే ఆమె ఇవన్నీ సష్టించారు' అని భర్త తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం అతనిపై వేధింపుల కేసు కొట్టివేసేందుకు అంగీకరించలేదు. ఇంట్లో ఆమె సాధారణ అవసరాలు తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం మానసిక క్రూరత్వం కిందకే వస్తుందని పేర్కొంది. ఈ కేసులో ఆమె అత్తపై చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయంటూ ధర్మాసనం కొట్టివేసింది.

## డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి

# బెంగాల్ ప్రచారంలో మోదీ హామీల వర్షం



**కోల్‌కతా:** ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి కలిసి పనిచేస్తేనే రాష్ట్ర ప్రజలు అత్యధికంగా ప్రయోజనం పొందుతారని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా పూర్బా మేదినీపూర్ బహిరంగ సభలో మోదీ గురువారం ప్రసంగించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ ప్రజలపై ఆయన హామీలు గుప్పించారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో ఉన్న భయానక వాతావరణాన్ని తొలగించి... న్యాయ పరిపాలనపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తామని చెప్పారు. బిజెపి పాలనలో పరిపాలనా వ్యవస్థ పూర్తిగా ప్రజలకు బాధ్యత వహించేలా జవాబుదారీగా మారుతుందన్నారు. అవినీతి, అక్రమాలు, మహిళలపై జరిగిన అన్యాయాలు, అత్యాచారాల కేసులు సహా అన్ని ఫైళ్లను మళ్లీ పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు. తృణమూల్ పాలనలో అవినీతికి పాల్పడిన మంత్రి అయినా, సాధారణ వ్యక్తి అయినా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని, ఎవరూ తప్పించుకోలేరని, తృణమూల్ గూండాలు చట్టం నుంచి తప్పించుకోలేరని మోదీ చెప్పారు. శరణార్థులకు రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులు ఇస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశంలో ఉండనివ్వమన్నారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 7వ వేతన సంఘం సిఫారసులు అమలు చేస్తామని, ఈ హామీలతో పశ్చిమ బెంగాల్ అభివద్ధి దిశగా ముందుకు సాగుతుందని మోదీ హామీ ఇచ్చారు. 'ప్రస్తుతం బెంగాల్‌కు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అత్యంత అవసరం. డబుల్‌ఇంజిన్ ప్రభుత్వం బెంగాల్‌ను మత్స్య, సముద్రపు ఆహార రంగాల్లో స్వయం సమద్ధిగా చేస్తుంది. బిజెపి మత్స్య రంగానికి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత మా ప్రభుత్వం మొట్టమొదటిసారిగా మత్స్యకారులు, వారి కుటుంబాలు, మొత్తం నీలి ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఎకానమీ) అవసరాలు తీర్చడానికి ఒక ప్రత్యేక మత్స్య మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడమే కాకుండా మత్స్యకారుల సంక్షేమం కోసం బిజెపి ప్రత్యేకంగా, రికార్డు స్థాయిలో బడ్జెట్ కేటాయించింది' అని మోదీ ప్రగల్భాలు పలికారు.

# నేపాల్ మాజీ ప్రధానికి అరెస్టు వారెంట్



**కాట్మండు:** అవినీతి కేసులో నేపాల్ మాజీ ప్రధాని షేర్ బహదూర్ దూబే (79)కు అరెస్టు వారెంట్ జారీ అయింది. దూబే ప్రస్తుతం వైద్య చికిత్స కోసం విదేశాలకు వెళ్లారు. కాగా, నేపాల్ ప్రభుత్వ చర్యలపై దూబే సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తనతో పాటు తన కుటుంబంపై మనీలాండరింగ్ కేసును నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. తన కుటుంబ ఆస్తులపై తప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు తెలిపారు. దూబే భార్య, మాజీ విదేశాంగ మంత్రి అర్జూ రాణా దూబేకు కూడా అరెస్టు వారెంట్ జారీ అయింది. కాట్మండు కోర్టు అధికారులు ఈ విషయం వెల్లడించారు. మనీలాండరింగ్ శాఖ ఓ కేసులో దూబేను విచారిస్తున్నట్లు అధికారులు చెప్పారు. దూబే దంపతులు సింగపూర్‌లో ఉన్నట్లు ఇటీవల నేపాలీ మీడియా వెల్లడించింది. అయితే ఇంటర్‌పోల్‌కు నోటీసు ఇవ్వాలని పోలీసులు చూస్తున్నారు. నేపాల్‌లో నెల క్రితం 35 ఏళ్ల ర్యాపర్, పొలిటీషియన్ బాలేంద్ర షా ప్రధానిగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన అరెస్టు వారెంట్ జారీ చేయించినట్లు తెలుస్తోంది. నేపాల్ ప్రధానిగా దూబే అయిదు సార్లు గెలిచారు. నేపాలీ కాంగ్రెస్ పార్టీలో ఆయన సీనియర్ నేత. నేపాల్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకు తన జీవితాన్ని త్యాగం చేసినట్లు ఆయన చెప్పారు. నేపాల్ ప్రభుత్వం అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని అణిచివేసిన మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాజీ హోంశాఖ మంత్రి రమేశ్ లఖక్‌ను కూడా గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమ సమయంలో దూబే ఇంటికి కూడా ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఆ దంపతులపై దాడి చేసిన వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. ఆయన ఇంటి నుంచి నోట్ల కట్టల్ని నిరసనకారులు తీసుకెళ్లారు.

## ఆరేళ్ళ లోపు వారికే కొత్త ఆధార్ కార్డులు

# యుఐడిఎఐకి ఆదేశించాలని 'సుప్రీం'లో పిల్



**న్యూఢిల్లీ :** భారత పౌరులు ముసుగులో చొరబాటుదారులు చొరబడకుండా నిరోధించేందుకు, కేవలం ఆరేళ్లలోపు పౌరులకు మాత్రమే కొత్త ఆధార్ కార్డులు జారీ చేయాలని, అలాగే కౌమారదశలో ఉన్నవారికి, పెద్దలకు వాటి జారీకి కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ)ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్), 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేవలం 'గుర్తింపు రుజువు' మాత్రమేనని, అది పౌరసత్వం, చిరునామా లేదా పుట్టిన తేదీకి రుజువు కాదని పేర్కొంటూ కామన్ సర్వీస్ సెంటర్లలో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించాలని కూడా కోరింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు, ఆధార్ కార్డులను జారీ చేసే అథారిటీ అయిన యుఐడిఎఐ, కేంద్ర హోం, న్యాయ, ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలను కూడా ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. న్యాయవాది అశ్వనీ దుబే ద్వారా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో వాస్తవానికి గుర్తింపు రుజువుగా ఉద్దేశించిన ఆధార్, క్రమంగా రేషన్ కార్డులు, నివాస ధృవీకరణ పత్రాలు, ఓటరు గుర్తింపు కార్డులు వంటి ఇతర గుర్తింపు పత్రాలను పొందేందుకు వ్యక్తులకు వీలు కల్పించే ఒక 'ప్రాథమిక పత్రం'గా మారిందని వాదించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE
AT BHUPALPALLY
O.S.No. 749 OF 2022

Between:
1. Elpula Laumamma
2. Elpula Muktheswari
...Plaintiffs

AND

1. Elupula Shailaja
2. Elupula Umamaheshwari
3. The District Collector, Jayashankar Bhupalpally District.
4. The Mandal Tahasildar, Bhupalpally Mandal
5. The SCCL, General Manger, Area JayaShankar Bhupalpally
6. To whomsoever it may concern.
... Defendants

NOTICE

To
1.To whomsoever it may concern.

The Plaintiffs herein filed the above O.S No.749 of 2022 against the above Defendant no.1 to 6 for the declare the plaintiffs as the Legal Heirs of the deceased Late Elupula Komuraiah, and Late Elupula Kumaraswamy. Hence you are required to appear before the Hon,ble Court through legal counsel on: **23-06-2026 at 10:30 am.** Failing which the matter will be heard and decided in your absence.

MANGALAPALLY RAJ KUMAR
ADVOCATE
3-18/1, KHASIMPALLY,
Bhupalapally Jayashankar Dist.
Cell : 9848708057

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
10-04-2026
www.prajapaksham.in


# పెద్దల చేతుల్లోనే భూములు

స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్ళు దాటినా ఇంకా భూమి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అణగారిన వర్గాలకు భూమి అనేది సుదూర స్వప్నం గానే మిగిలింది. భూ పంపిణీ జరిగినప్పటికీ, వివిధ రూపాలలో భూమి కొందరి చేతుల్లో కేంద్రీకృతమవుతున్న చేదు వాస్తవం మరోసారి వెలుగులోకి వచ్చింది. గ్రామీణ భారతంలో 10 శాతం కుటుంబాల చేతుల్లో 44 శాతం భూమి ఉన్నట్లు వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఆధ్వర్యంలో ' భారతదేశంలో భూ అసమానత : స్వభావం, చరిత్ర, మార్కెట్' అనే అంశంపై చేసిన అధ్యయనంలో వెల్లడైంది. భారత దేశంలోని సుమారు 2.7 లక్షల గ్రామాలకు చెందిన ఆరున్నర కోట్ల మంది వ్యక్తుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా భూముల యాజమాన్య స్థితిగతులను ఈ అధ్యయన నివేదికలో ఆవిష్కృతమైంది.

గ్రామీణ భారతంలో భూ కేంద్రీకరణ ఎంతలా ఉందంటే , ఈ అధ్యయనం ప్రకారం ఒక్క శాతం ఎగువ శ్రేణి కుటుంబాల చేతుల్లో 18 శాతం భూమి ఉండగా, 5 శాతం కుటుంబాల చేతుల్లో 32 శాతం, 10 శాతం ఉన్నత కుటుంబాల చేతుల్లో 44 శాతం భూమి ఉందనే దిగ్భ్రాంతికర సత్యం వెలుగులోకి వచ్చింది. తద్విరుద్ధంగా ఇంకా 46 శాతం కుటుంబాల చేతుల్లో సెంటు భూమి కూడా లేదు. అతిపెద్ద భూస్వామి ఆధీనంలో ఉన్న భూమి సగటు వాటా 12.4 శాతం. అలాగే 3.8 శాతం గ్రామాలలో బడా భూస్వామి 50 శాతం కంటే ఎక్కువ భూమిని కలిగి ఉన్నారు. ఇది విస్తుకొలిపే నిజం.భారతదేశంలో భూ అసమానత ప్రపంచంలో అత్యంత అసమానత కలిగిన ప్రాంతాలతో సమానంగా ఉందనే చేదు వాస్తవం తెలిసింది. ఈ విధంగా, సగటు అసమానతా స్థాయి విస్మయపరిచేంత ఎక్కువగా ఉంది, ఇది అనేక భారతీయ ప్రాంతాలను ప్రపంచంలోని అత్యంత అసమానత గల ప్రదేశాలతో సమానంగా నిలుపుతోంది. భారతదేశంలో భూ అసమానత చారిత్రక, సంస్థాగత వ్యవస్థలలో లోతుగా పాతుకుపోయిందని, ఇది అభివృద్ధి విధానం, ఆర్థిక పరివర్తనపై దీర్ఘకాలిక ప్రభావాలను కలిగి ఉందని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మరికొన్ని ఆసక్తికర అంశాలు ఈ అధ్యయనంలో వెలుగు చూశాయి. సారవంతమైన నేల, క్రమబద్ధమైన నీటిపారుదల, అనుకూలమైన వాతావరణం వంటి అధిక వ్యవసాయ స్థిరత్వం కలిగిన ప్రాంతాలలో భూమి మరింత కేంద్రీకృతమవుతోంది. భూమి విలువ పెరిగేకొద్దీ, అది మరింత కేంద్రీకృతమయ్యేందుకు దారితీస్తుంది. ఫలితంగా బడా భూస్వాములు తమ భూముల పరిధిని విస్తరించుకోగా, చిన్న రైతులు క్రమంగా భూమి నుంచి వైదొలిగేలా చేయబడి, భూమిలేని వారుగా మిగిలిపోయే పరిస్థితికి నెట్టబడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగునీటి సౌకర్యాలు కల్పించే పథకాలు సరిగ్గా అమలు చేయకపోతే, పెద్ద భూస్వాములు విపరీతంగా లబ్ధి పొందుతున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలతో ముడిపడి ఉన్న నీటి పారుదల పథకం లేదా 'కమాండ్ ఏరియా' పరిధిలో భూమి అసమానత (గిని గుణకం– అసమానతల సూచిక) దాదాపు 1 శాతం పాయింట్ పెరుగుతుందని అధ్యయనంలో వెల్లడైంది. కాబట్టి వ్యవసాయ రంగంలో వృద్ధి అనేది దానంతట అదే అన్ని సామాజిక–ఆర్థిక వర్గాలకు ఉమ్మడి అభివృద్ధిగా రూపాంతరం చెందదు.

వలస పాలన కాలంలో ఏర్పడిన భూ వ్యవస్థల ద్వారా రూపుదిద్దుకున్న ప్రాంతాలు నేటికీ విభిన్న అసమానతా నమూనాలను ప్రదర్శిస్తున్నాయని నివేదిక పేర్కొంది. నాటి బ్రిటీష్ పాలించిన ప్రాంతాలలో జమీందారీ వ్యవస్థ వంటి పరిపాలనా నిర్మాణాల పరిధిలో నేటికీ అధిక అసమానతలు కనపడుతున్నాయి. కొద్దిమంది సంపన్న భూస్వాముల చేతుల్లో అధికారాన్ని కేంద్రీకరించడానికి పనిచేసిన ఈ వ్యవస్థలు, వలస పాలన ముగిసిన దశాబ్దాల తర్వాత కూడా కొనసాగుతున్న క్రమాణుగత వర్గాలు శాశ్వతం చేశాయి. అంతేకాకుండా, చిన్న రైతులను వెళ్లగొట్టిన ప్రత్యక్ష బ్రిటిష్ పాలనకు భిన్నంగా, స్థానిక పాలకులు కొంత నియంత్రణను నిలుపుకున్న పూర్వపు 'రాచరిక రాజ్యాల'లోని గ్రామాలలో పూర్తిగా భూమిలేని కుటుంబాలు తక్కువగా ఉండటంతో అసమానత తక్కువగా ఉందని ఈ అధ్యయనం కనుగొంది. ఏళ్ళ తరబడి ఆధునీకరణ, ఆర్థిక మార్పులు, భూ సంస్కరణలు జరిగినప్పటికీ, ఈ వ్యత్యాసాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది భూ పంపిణీపై హానికరమైన వలస వాద సంస్థల శాశ్వత ముద్రకు నిదర్శనం. షెడ్యూల్ కులాల వర్గాలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలలో భూ అసమానత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని నివేదిక వెల్లడిస్తోంది. వారు ఉన్నత స్థాయికి ఎదగడానికి, సాధికారత పొందడానికి చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి.

మార్కెట్‌లో భూమి ఉండే వ్యూహాత్మక స్థానం కూడా కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పట్టణాలకు, పెద్ద రహదారులకు, రైల్వే స్టేషన్‌లకు సమీపంలో ఉన్న గ్రామాలలో అసమానత ఎక్కువ. బ్యాంకు లేదా వ్యవసాయ మార్కెట్ కలిగిన గ్రామాలలో అసమానతలు ఎక్కువగా ఉన్నాయి, కానీ సమీప గ్రామాలలో మాత్రం అలా లేదని నివేదిక పేర్కొంది.

భూమి అనేది కేవలం పంటలను పండించే నేల మాత్రమే కాదు. వ్యక్తి ఆత్మగౌరవానికి ప్రతీక. సామాజిక గుర్తింపుకు కొలమానం. స్వాతంత్ర్యం పూర్వం నుంచి భూమి ప్రాధాన్యతకు గుర్తింపు ఉంది. ఆదిమ కాలంలో సంచార జీవిగా ఉన్న మానవుడు, స్థిర నివాసం ఏర్పరచుకున్న తరువాత నివాసాలు, పట్టణాలు, సరిహద్దులతో రాజ్యాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి భూమికి ప్రాముఖ్యత ప్రారంభమైంది. ఎక్కువ భూమి ఉన్న వారే ధనవంతుడు, బలవంతుడు. అలాంటి భూమి భారతదేశంలో అనేక చారిత్ర పోరాటాలు జరిగాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కేరళలోని పున్నప్ర వయలార్ పోరాటం, తేబాగ పోరాటం వంటివి పేరెన్నికగన్నవి.

ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాల ద్వారా భూ పంపిణీ అంశం కేంద్ర బిందువైంది. పాలకులు సైతం భూ సంస్కరణలు చేపట్టి, నూతన చట్టాలను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కేరళ, పశ్చిమ బెంగాళ్ రాష్ట్రాలలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు భూ పంపిణీ చేయడం ద్వారా అందరికంటే ముందున్నారు. అయినప్పటికీ పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న మాదిరిగానే ఉంది. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల పేరుతో వెనక్కి తీసుకుంటున్నాయి. అభివృద్ధి, పరిశ్రమల పేరుతో అగ్గువకే భూములను ఐటి, సాఫ్ట్‌వేర్, ఎంఎన్‌సి కంపెనీలు, బడా పరిశ్రమలకు కట్టబెడుతున్నాయి. గతంలో సెజ్‌ల పేరుతో ఈ ప్రక్రియ సాగింది. ప్రభుత్వాలు సైతం భూమిని వారసత్వ సంపదగా కాకుండా, ఆదాయ వనరుగా భావిస్తూ వేలం వేసి, పప్పు బెల్లాలు మాదిరిగా పంచుతోంది. ఏ మాత్రం ఉత్పాదక లేని ఫక్తు జూదంలాంటి రియల్ ఎస్టేట్‌కు ఊతమిస్తూ నగరాలు, పట్టణాలో సామాన్యునికి భూమి జీవితకాలంలో 'అందని ద్రాక్ష' గా మార్చేశారు. పట్టణ భూ గరిష్ఠ పరిమిత చట్టాలకు కోరలు తీసేశారు.అందుకే మరోసారి భూ కేంద్రీకరణకు బాటలు పడుతున్నాయి. ఇప్పటికైనా భూముల పంపిణీకి, రియల్ ఎస్టేట్ బారి నుంచి భూములను తప్పించేందుకు భూ పరిమితి చట్టాలను తీసుకువచ్చేలా ప్రజోద్యమాలు వెల్లువెత్తడమే పరిష్కారం. ●

## యుద్ధం ఆందోళనకరమైన ప్రభావం చూపుతుంది

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఇరాన్‌పై యుద్ధం దీర్ఘకాలిక 'ఆందోళన కరమైన ప్రభావాలను' మిగిల్చి వేస్తుంది. ఒకవేళ కాల్పుల విరమణ కుదిరినప్పటికీ ఆ పర్యవసానాలు కొనసాగే అవకాశం ఉంది. అత్యంత ఆశాజనకమైన పరిస్థితిలో కూడా ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలు తగ్గుముఖం పడతాయి. అలాగే పూర్వ స్థితికి తిరిగి వెళ్లడం అనేది ఏమాత్రం సాఫీగా లేదా సులభంగా జరగదు.

– అంతర్జాతీయ ద్రవ్య నిధి మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా




# దుష్ప్రభావాలు లేని వైద్య విధానం హోమియోపతి

ప్రజారోగ్య పరిరక్షణలో హోమియోపతి వైద్య విధానాలను వ్యాప్తి చేయడానికి, హోమియో వైద్య అభివృద్ధికి, సవాళ్లను అధిగమించడానికి, సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌న ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారింది. హోమియో వైద్య వ్యవస్థాపకుడు, పితామహుడు అయిన డా॥ క్రిస్టియన్ శామ్యూల్ హానిమాన్ జన్మదినం 10 ఏప్రిల్ 1755 సందర్భంగా ప్రపం చ హోమియోపతి దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది. ప్రకృతి ప్రసాదించే మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుంచి సేకరించిన ఔషధాలతో వ్యాధులకు హోమియో చికిత్సలు చేస్తారు. హోమియోపతి వైద్య విధానానికి ప్రధాన సూత్రంగా లైక్ లౌస్ లైక్ అనే భావాన్ని తీసుకుంటారు. హోమియోపతి అనగా హోమియో (ఒకే రకమైన), పతోస్ (వ్యాధి) అనే గ్రీక్ భాష అర్థాలు ఉన్నాయి.

**భారతంలో హోమియోపతికి ప్రజాదరణ:** హోమియోపతి వైద్య విధానం భారతంలో 1973లో ప్రభుత్వ గుర్తింపుతో బహుళ ప్రచారం పొందడం, 2014 తర్వాత అల్లోపతి వైద్యంతో పాటు ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ యోగా, నాచురోపతి, హోమియోపతి) అంత్రికదత్వ శాఖను ప్రారంభించి హోమియో వైద్య విధానానికి పట్టం కట్టడం జరిగింది. శరీర వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ వ్యాధి మూలాలను కనుగొని ఔషధ చికిత్సను చేయడం, ఎలాంటి ఔషధ దుష్ప్రభావాలు లేకుండా ఉండడం హోమియో ప్రత్యేకతగా తీసుకోవాలి. మన దేశంలో అనేక హోమియో వైద్య కళాశాలలు, హోమియో ఆసుపత్రులు ప్రారంభించడం జరుగుతున్నది. హోమియోపతి వైద్యం ద్వారా చర్మ, జీర్ణకోశ, ఎలర్జీ, మైగ్రెయిన్, మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, నీరసం, రుతుస్రావం, ముందు అనారోగ్యం, దీర్ఘకాలిక అలసట, అస్తమా, వినికిడి రోగాలు, బిపీ, జలుబు లాంటి వ్యాధులకు సమర్థవంతంగా చికిత్సలు చేస్తారు. దేశవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు హోమియో చికిత్సలు పొందుతుండగా, 2 లక్షల హోమియో డాక్టర్లు సేవలు అందిస్తూ, ప్రతి ఏట 12,000 మంది వైద్యులు హోమియో రంగంలోకి అడుగిడుతున్నారు.

ప్రపంచ హోమియో దినం రోజున హోమియో వైద్య శిబిరాలు, సెమినార్లు, సింపోజియాలు, కార్యశాలలు, హోమియో వైద్యులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ప్రపంచ హోమియోపతి దినోత్సవం–2026 ఇతివృత్తంగా హోమియోపతితో సామరస్యం హద్దులు దాటి వైద్యం చేయడం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సహజమైన, సరళమైన, సురక్షితమైన, ప్రభావితమైన హోమియోపతితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా రోగం మూలలను కనుగొని స్వస్థత చేకూర్చుతున్న ప్రపంచ హోమియోపతి వైద్యులకు, హోమియో వైద్యం పొందుతున్న రోగులకు ప్రపంచ హోమియోపతి దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.

**(10 ఏప్రిల్ ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా)**

# ఉన్నత విద్య విధ్వంసం దిశగా రాష్ట్ర బడ్జెట్



ప్రొ కె.లక్ష్మీ నారాయణ డాక్టర్ జి. రమేశ్
తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ
9441219028

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య కోసం ఎంత ఖర్చు చేసినా తక్కువేనని అవి భవిష్యత్తుకు పెట్టుబడులని అంటూ ఉంటాడు. కానీ వాస్తవ కేటాయింపులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

తలసరి ఆదా యం పెరిగిందని చెప్పుకుంటూనే ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క విద్యా రంగానికి తన పార్టీ మేనిఫెస్టోలో వాగ్దానం చేసినట్టుగా కనీసం 15% నిధులు కేటాయించలేదు. విద్యా కమిషన్ సిఫారసు చేసిన 18 శాతం నిధులు కేటాయించలేదు. విద్యకు కేటాయించిన 8.2% అనేది ఈ సిఫారసు చేసిన దానిలో సగం కూడా లేదు. ఇక్కడ ఉన్నత విద్యకు సంబంధించి అంశాలను జాగ్రత్తగా పరిశీలిద్దాం.

**ఉన్నత విద్యలో పరిస్థితులు**

ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రస్తుతం 16% డిగ్రీ కాలేజీలకు సొంతభవనాలు లేవు. దాదాపు 60 శాతం పైగా కాలేజీలకు కంప్యూటర్ ల్యాబ్స్ లేవు. 13 కాలేజీలు పాడుబడ్డ భవనాలలో నడుస్తున్నాయి. కాలేజీలలో రిక్రూట్మెంట్ లేక 60 శాతం ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో 74% ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులు చూస్తే కాకతీయ యూనివర్సిటీలో 332, శాతవాహనలో 115, తెలంగాణ యూనివర్సిటీలో92, మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 35, పాలమూరు యూనివర్సిటీలో 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి వివిధ సామాజిక ప్రకృతి శాస్త్రాల, భాషా శాస్త్రాల శాఖలు నడపడానికి ఆఫీసు స్టాఫ్ లేదు. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు నడపడానికి కావలసిన బోధనేతర సిబ్బంది పోస్టులు వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి.

**ఉన్నత విద్యకు కేటాయింపులు**

బడ్జెట్‌లో కాలేజీలకు, యూనివర్సిటీలకు కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. ఇంటర్ విద్యకు రూ.114 కోట్లు, డిగ్రీ విద్యకు రూ. 839 కోట్లు యూనివర్సిటీ విద్యకు రూ.2641 కోట్లు కేటాయించారు.

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం కేటాయించిన వెయ్యి కోట్ల గురించి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి ఇచ్చిన 400 కోట్ల రూపాయల గురించి విపరీతమైన ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో బహిరంగంగానే ఈ డబ్బులు మౌలిక వసతుల కోసమే కానీ ప్రొఫెసర్ల పోస్టులు నింపడం కోసం కాదని ఆర్థిక మంత్రి స్పష్టంగానే చెప్పారు. మిగిలిన విశ్వవిద్యాలయాలకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నాము అని చెప్పి తప్పించుకున్నారు. కాకతీయ యూనివర్సిటీకి ప్రగతి పద్దు కింద రూ.40 కోట్లు, శాతవాహన యూనివర్సిటీకి, తెలంగాణ యూనివర్సిటీకి, మహాత్మా గాంధీ యూనివర్సిటీకి పాలమూరు యూనివర్సిటీకి ఒక్కొక్క యూనివర్సిటీకి రూ. 25 కోట్ల చొప్పున మాత్రమే కేటాయించారు. ఈ యూనివర్సిటీలకు మౌలిక వసతులకు గాని, ప్రొఫెసర్ల పోస్టులు నింపడానికి గాని వేరేగా కేటాయించింది ఏమీ లేదు.



**బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చులు :** 2024 బడ్జెట్‌లోఉన్నత విద్యకు మొత్తం రూ. 2,859 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు చేసింది రూ. 2258 కోట్లు మాత్రమే అంటే కేటాయించిన దానిలో రూ. 600 కోట్లు కోత పెట్టారు. ఇంకా వివరాలలోకి వెళ్తే ప్రగతి పద్దు కింద కేటాయించింది 617 కోట్లు ఖర్చు పెట్టింది. రూ. 46 కోట్లు మాత్రమే. అంటే కేటాయించిన దానిలో కేవలం 7 శాతం కూడా ఖర్చు పెట్టలేదు.

అలాగే అదే 2024–25 బడ్జెట్ ఉన్నత విద్యలో వివిధ భాగాలకు ఎంతెంత కేటాయించారో, ఎంత ఖర్చు పెట్టారో చూద్దాం.

**యూనివర్సిటీ విద్య, డిగ్రీ విద్య, ఇంటర్మీడియట్ విద్య**

యూనివర్సిటీ విద్యకు మొత్తం 1291 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రగతి పద్దు కింద రూ. 500 కోట్లు కేటాయించి కేవలం రూ. 5 కోట్లు ఖర్చు చేశారు. అంటే ఒక్క శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఇటువంటి పరిస్థితులలో మన యూనివర్సిటీలను ఆక్స్‌ఫర్డ్ స్టాన్ ఫర్డ్ తరహాలో అభివృద్ధి చేస్తామనడం హాస్యాస్పదంగా ఉన్నది.

డిగ్రీ విద్య కోసం నిర్వహణ పద్ధతి కింద రూ. 606 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ. 111 కోట్లు మొత్తం రూ. 717 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు పెట్టింది మాత్రం రూ. 640 కోట్లే. ఇక్కడ కూడా ప్రగతి పద్ధతి కింద రూ.111 కోట్లు కేటాయించి రూ. 40 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు అంటే 36% మాత్రమే .

ఇక ఇంటర్మీడియట్ విద్య కొరకు నిర్వహణ, ప్రగతి పద్దు కింద రూ. 841 కోట్లు కేటాయించి రూ. 826 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రగతి పద్దు కింద రూ. 6 కోట్లు కేటాయించి ఒక్క కోటి రూపాయలు మాత్రమే ఖర్చు చేశారు. అంటే 17% కన్నా తక్కువ. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే శ్వేత పత్రం విడుదల చేసింది. అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో 75 శాతం మాత్రమే ఖర్చు పెట్టిందని 25 శాతం ఖర్చు చేయలేదని వివరించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అంతకన్నా తక్కువగా ఉన్నత విద్యకు ఏడు శాతం, యూనివర్సిటీ విద్యకు ఒక్క శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నట్టు పై గణాంకాలు తెలుపుతున్నాయి. కనుక ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేటాయించిన నిధులలో ఎంత శాతం ఖర్చు పెడతారు ఊహించుకోవచ్చు.

అంటే టిఆర్ఎస్/బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నత విద్యకు చేసిన విధ్వంసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత వేగంగా కొనసాగిస్తున్నదని పై గణాంకాలు తెలియజేస్తున్నాయి.

# వీధి శునకాలకు వింత వ్యాధులు

లేఖ

ఉభయ తెలుగు రాష్ట్రాలలో వీధి కుక్కలు వింత వ్యాధిబారిన పడుతూ వున్నాయి. ప్రతి గ్రామం, పట్టణం, నగరాల లో ఎక్కడ చూసినా చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శునకాలు కనినిపిస్తున్నాయి. వెంట్రుకలు మొత్తం ఊడిపోయి, శరీరం కమిలిపోయి పుండ్లు పడ్డాయి. వ్యాధి తీవ్రత అధికంగా వున్న కుక్కలు తీవ్రంగా నీరసించి, ఆహారం తినలేక కదల్లేని స్థితిలో వున్నాయి. ఈ తరహా కుక్కలు కొద్ది రోజులకే మృత్యువాత పడుతున్నాయి. వీటి పరిస్థితిని చూసి పలువురు జంతు ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. వీధి కుక్కల్లో సాధారణంగా మాంజ్, సార్కోపిక్ మాంజ్, డెమాడిక్ట్ మాంజ్ రకం వ్యాధులబారిన పడతాయుని పశువైద్యనిపుణులు చెబుతున్నారు. చర్మ వ్యాధులబారిన పడిన కుక్కలు సంచరించే ప్రదేశాల్లో మనుషులు కూడా కొంత మేర వీటిబారిన పడే అవకాశం వుందని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల వీధి కుక్కలకు సోకిన చర్మవ్యాధుల నియంత్రణకు వ్యాక్సిన్లు వేయడంతో పాటు, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయాలని సూచిస్తున్నారు. వీధి కుక్కల సంతతి నియంత్రణ కోసం సుప్రీంకోర్టు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రత్యేకంగా సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, వీధుల్లో సంచరిస్తు న్న కుక్కలను పట్టుకొని వీటికి తరలించాలని స్పష్టం చేసింది. అనంత రం సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి, కొద్ది రోజులపాటు కేంద్రంలోనే వుంచాలి. తరువాత వాటిని తిరిగి ఆయా వీధుల్లోనే విడిచిపెట్టాలి. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. వీధి కుక్కల నియంత్రణ, సంరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇంతవరకు ఎక్కడా కేంద్రాలను తెరవలేదు. వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయలేదు. కొన్ని కుక్కలకు రేబిస్ సోకి వింతగా ప్రవర్తిస్తున్నాయి. కుక్కల వ్యాధులను గుర్తించి వాటికి టీకాలు వేయాలి. ప్రజలు కూడా కుక్క కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కామిడి సతీష్ రెడ్డి, 9848445134

# తల్లిదండ్రులను చూడని వారికి గుణపాఠం చెప్పే చట్టమిది!

రాష్ట్రంలోని ఏ తల్లిదండ్రులు వారి పిల్లల ఆదరణకు దూరమై అనాథలుగా ఉండకూడదు. చివరి రోజుల్లో బాగోగులు చూసేవారు లేక ఇబ్బంది పడొద్దు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో భావోద్వేగంతో సామాజిక బాధ్యతతో, 'ది తెలంగాణ ఎంప్లాయిస్ ఎకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరంటల్ సపోర్ట్ చట్టం 2026' తెస్తుంది అని సిఎం రేవంత్ రెడ్డి ఒక నెల రోజుల క్రితం అన్నారు. వారు అన్నట్లుగానే ఈ సంవత్సరం 2026–27 బడ్జెట్ సెషన్‌లో మార్చి 29న 'పేరంటల్ సపోర్ట్ చట్టం 2026' బిల్లుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం పొందించింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ 'సమాజంలో తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో సాగుతున్న వివక్ష నిర్లక్ష్యం మనం చూస్తున్నాం. అందుకే కన్నవారి బాగోగులు చూడని వారికి గుణపాఠం చెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగులు వారి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి నెల వేతనములో 15% లేదా రూ.10 వేల మొత్తం కోతపడుతుంది. భక్తితో కాకుండా భయంతోనైనా తల్లిదండ్రుల హక్కులను కాపాడుతారని ఈ చట్టం తీసుకొస్తున్నాం. కేంద్ర చట్టంలోని నిబంధనల వల్ల రూ.10వేలకు మించి వేతనంలో కోత పెట్టడం సాధ్యం కావడం లేదు. నిబంధనలు సడించాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేద్దాం'.

**కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వృద్ధుల సంక్షేమ చట్టం–2007**

'తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, 2007' ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. ఈ విషయంలో పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 లో 125 ప్రకారం తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, చట్టమే వారి పోషణకయ్యే ఖర్చులను పిల్లలనుంచి ఇప్పిస్తుంది. కానీ పిల్లల మీద ప్రేమ వల్ల కుటుంబ ప్రతిష్ట దిగజారుతుందన్న భయం వల్ల, కేసు లావాదేవీలను నడిపేందుకు ఎంతో కాలాన్ని, డబ్బును హెచ్చించవలసి రావడం వంటి కారణాలతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఈ రకమైన కేసులను వేయడం లేదు. అందుకే పెద్దవారికి అవసరమైన పోషణ సంరక్షణ విషయాలలో సులభమైన, వేగవంతమైన న్యాయసహాయాన్ని అందించేందుకు న్యాయస్థానాలతో సంబంధంలేని ప్రత్యేక చట్టం 'తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం–2007' ను కేంద్ర ప్రభుత్వం ఏర్పా టు చేసింది.

ఈ చట్టంను తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి, మరియు సవరణ నియమావళి, 2022' ను రూపొందించింది. కానీ అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఆర్థిక స్వావలంబన**

ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం వృద్ధులకు 'ఆర్థిక గౌరవాన్ని' కల్పించడం. ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్లు కేవలం మనుగడకు సరిపోతాయి. కానీ, అనారోగ్యం సమస్యలు ఉన్నప్పుడు లేదా మెరుగైన జీవన ప్రమాణా లు కావాలన్నప్పుడు అవి చాలవు. ఈ నేపథ్యంలోనే, పిల్లల సంపాదనపై తల్లిదండ్రులకు చట్టబద్ధమైన హక్కును కల్పించడం ద్వారా, వారు ఎవరి ముందు చేతులు చాచాల్సిన అవసరం ఉండదు. 15% జీతం అంటే చిన్న మొత్తం కాదు అది ఒక వృద్ధ దంపతులకు గౌరవప్రదమైన జీవనానికి సరిపోతుంది.

**నైతికత వర్సెస్ చట్టం**

ఈ నిర్ణయం వల్ల సమాజంలో మిశ్రమ ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. చట్టం పట్ల భయంలేని వారికి, కనీసం ఆర్థిక నష్టం కలుగుతుందనే



భయంతోనైనా తల్లిదండ్రులను బాగా చూసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ఒక రకమైన 'బలవంతపు బాధ్యత' అయినప్పటికీ, బాధితులకు న్యాయం జరుగుతుంది. నేడు నగరాల్లో వృద్ధాశ్రమాలు కిక్కిరిసిపోతున్నాయి. పిల్లలు ఉండి అనాథలుగా బతుకుతున్న వారికి ఈ చట్టం ఒక పెద్ద ఊరట. ఇంటిపట్టునే ఉండి, తమకు రావలసిన వాటాను పొందుతూ వారు మనశ్శాంతిగా శేష జీవితం గడపవచ్చు. రాబోయే తరాలకు ఇది ఒక గట్టి సందేశాన్ని పంపుతుంది. కన్నవారిని గౌరవించడం అనేది ఆప్షనల్ కాదు, అది తప్పనిసరి అని ఈ చట్టం గుర్తుచేస్తుంది.

**ప్రభుత్వ ఉద్యోగులపై ప్రభావం–పర్యవేక్షణ**

తెలంగాణలో లక్షలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని కేవలం ప్రభుత్వరంగంలోనే పరిమితం చేయకుండా, ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థలు, కార్పొరేషన్లకు, స్థానిక సంస్థలకు, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ట్రెజరీ ద్వారా చెల్లిస్తారు. జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత అధికారి ఆదేశాల మేరకు నేరుగా జీతంలో కోత విధించడం సాంకేతికంగా సులభం. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు బాధ్యతగల అధికారులు విచారణ జరిపి, నిజంగానే నిర్లక్ష్యం జరుగుతుందని తేలితేనే ఈ చర్య తీసుకోవాలి. ఇది పారదర్శకంగా జరగడం ప్రధానం.

**ఎదురయ్యే సవాళ్లు– ఆందోళనలు**

ఏ చట్టమైన అమలులోకి వచ్చేటప్పుడు కొన్ని సవాళ్లను ఎదుర్కోక తప్పదు. జీతం కట్ చేసిన తర్వాత, అదే ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు కలిసి ఉండటం కష్టతరమవుతుంది. ఇది మరిన్ని గొడవలకు మానసిక వేదనకు దారితీస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులు తమ ఇతర పిల్లల మాటలు విని లేదా ఆస్తి తగాదాల వల్ల ఒక కొడుకుపై ద్వేషంతో తప్పుడు ఫిర్యాదులు చేస్తే పరిస్థితి ఏంటి? దీనిని అరికట్టడానికి బలమైన 'అప్పిలేట్ అథారిటీ' అవసరం. ఐటితోపాటు ఇతర ప్రైవేట్ రంగాల్లో పనిచేసే వారిపై రాష్ట్ర ప్రభు త్వం నేరుగా నియంత్రణ సాధించటం కష్టం. దీనికోసం కేంద్ర చట్టాల సాయం లేదా ప్రత్యేక లేబర్ రూల్స్ సవరించాల్సి ఉంటుంది.

**చట్టం కంటే సంస్కారమే మిన్న**

మనదేశంలో అస్సాంలో ఇప్పటికే అమల్లో ఉన్న 'ప్రణామ' చట్టం స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ఈ ముందడుగు వేసింది. అక్కడ కూడా ఉద్యోగి జీతం నుంచి 10–15 శాతం వరకు వృద్ధాప్య తల్లిదండ్రులకు ఇచ్చే విధంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని మరింత పకడ్బందీగా అమలు చేయాలని చూస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మక అవసరం. ఒక పక్క అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ, మరోపక్క తన సంస్కృతి, సాంప్రదాయాలను, కుటుంబ విలువలను కాపాడుకోవడంలో వెనుకబడ కూడదనే తపన ఇందులో కనిపిస్తుంది. కేవలం చట్టం ద్వారా మాత్రమే కుటుంబాల్లో ప్రేమానురాగాలను పెంచలేం. చట్టం అనేది చివరి అస్త్రం కావాలి. తల్లిదండ్రులను గౌరవించాలనే భావన సమాజంలో లోతుగా పాతుకు పోవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ '15శాతం' భరోసా, కేవలం డబ్బు రూపంలోనే కాకుండా వృద్ధులకు ఒక 'ఆత్మ గౌరవ చిన్నం' గా నిలవాలి. ఈ చట్టం విజయవంతం కావాలంటే పారదర్శకమైన విచారణ వ్యవస్థ, వేగవంతమైన న్యాయం, సామాజిక అవగాహన ముఖ్యం. కన్నవారి కన్నీరు తుడిచే ఈ 'తల్లిదండ్రుల పోషణ బిల్లు' అక్షరాల అమల్లోకి వస్తే వృద్ధాప్యంలో ఉన్న ఎందరికో అది నిజమైన ఆసరా అవుతుంది.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646



## శ్రీలంక దేశపు మార్కెట్లోకి పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : శ్రీలంక దేశపు మార్కెట్లోకి పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు ప్రవేశ పెట్టేందుకు ఆ దేశ ప్రజలు ఆసక్తి చూపుతున్నారని శ్రీలంక ప్రమోటింగ్ బయ్యర్స్ బృందం నాయకులు ఇర్ఫాన్ తెలిపారు. శ్రీలంక దేశ ప్రజలు చీరలు ధరిస్తారని పోచంపల్లి చేనేత వస్త్రాలు చూసి వారు ముచ్చటపడి దేశ వ్యాపార రంగంలోకి ఇక్కత్ చీరలతో పాటు చేనేత వస్త్రాలు తమ దేశంలో కొనుగోలు చేసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిందని అన్నారు. ఇటీవల జరిగిన ఆర్ బి ఎస్ సమ్మిట్ లో చేనేత వస్త్రాల విశిష్టతల గురించి తెలిపినప్పుడు ఆసక్తిని కనపరిచారని అన్నారు. బయ్యర్లు మార్కెటింగ్ చేసేందుకు పూర్తి అవగాహన కోసం తయారీ విధానాలను తెలుసుకోవడానికి చేనేత వస్త్రాలు తయారు చేసే క్లస్టర్ యూనిట్లను సందర్శించడానికి బయ్యర్స్ బృందం గురువారం సందర్శించినట్లు తెలిపారు. వినియోగదారులు వస్త్రాలపై విశ్వాసాన్ని నమ్మకాన్ని కలిగించేందుకు ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో చేనేత కళారూపాలు వస్త్రాలు తయారీ ముడిసరుకు నాణ్యత ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపు వంటి అంశాలను తెలుసుకునేందుకు బృందం పేర్కొన్నారు. శ్రీలంక మార్కెట్లో ఇప్పటివరకు పోచంపల్లి వస్త్రాలు లేవని ఎగుమతి చేయడానికి సరైన అవకాశం వచ్చిందని బయర్లు అక్కడ చేనేత వస్త్రాలను లాంచ్ చేయడానికి మొగ్గు చూపుతున్నారని చెప్పారు. తెలంగాణ ట్రేడ్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, జగదీష్ మార్కెటింగ్ సంయుక్తంగా చేనేత ఇక్కత్ వస్త్రాలను ఎగుమతి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి బాలరాజు ప్రధాన కార్యదర్శి ఈ పూరి ముత్యాలు సంఘ సభ్యులు వారి వెంట ఉన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే సిపిఐని ఆదరించండి

### సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్



**ప్రజాపక్షం/చండూరు:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు ,ఉద్యమాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి అండగా నిలబడి విరాళాలు ఇచ్చి ఆదరించాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ప్రజలను కోరారు. గురువారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో మండల కార్యవర్గ సభ్యుడు సిహెచ్ ఊషయ్య అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో నల్పరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ చండూరు మండల , మున్సిపాలిటీలో ఉన్న ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తిప్పర్తి రాములు , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, జెల్ల శ్రీను, బండమీది వెంకన్న, గంట రమేష్ , ఇరిగి సంజీవ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ**: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గురువారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 444 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 38 లక్షల విలువైనముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఒక వరమని, ముఖ్యంగా వైద్య ఖర్చులు, అత్యవసర పరిస్థితుల్లో ఈ సహాయం ప్రజలకు గొప్ప ఊరటనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఇరాన్‌పై యుద్ధాన్ని నిలిపివేయాలి

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ




**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న క్రూరమైన దాడులు, యుద్ధాన్ని ఆపివేయాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాల పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం విడాలని డిమాండ్ చేశారు. దాడులపై స్పందించకుండా రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని అన్నారు. వలసవాద సామ్రాజ్యవాద దాడులను వ్యతిరేకిస్తున్నామని ధైర్యంగా చెప్పలేని మోడీ ప్రభుత్వానికి దేశ సార్వభౌమత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. యుద్ధం వల్ల ఆయిల్ సంక్షోభం పెరగడం మూలంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలంగా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి , మల్లు నాగార్జున్ రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

### సమ్మెను అణచివేయడం కాదు..

# చర్చలతో పరిష్కారం కావాలి

### ఆర్టిజన్‌ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి-లేకపోతే ఉద్యమం ఉద్ధృతం

### ప్రభుత్వానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరిక



**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద టివిఏసి జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె రెండో రోజు సందర్భంగా ఆయన పాల్గొని ఆర్టిజన్స్ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా ఆర్టిజన్స్ సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు చర్చలకు పిలవకపోవడం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అని మండిపడ్డారు. 22 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆర్టిజన్స్‌ను ఇంకా తాత్కాలిక స్థితిలోనే ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గుర్తించిన కన్వర్షన్ అంశాన్ని అమలు చేయకుండా,పాతకాలపు స్టాండింగ్ ఆర్డర్స్ నిబంధనలను చూపిస్తూ ఆర్టిసన్స్‌కు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్హతల ఆధారంగా జూనియర్ లైన్‌మెన్,సబ్ ఇంజనీర్,జూనియర్ అసిస్టెంట్ వంటి పదవులకు కన్వర్షన్ చేయాలని స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభు త్వ బాధ్యత అని, వెంటనే కన్వర్షన్ చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెను అణచివేయాలని ప్రయత్నిస్తే పరిస్థితులు మరింత ఉద్రిక్తం అవుతాయి వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలి అని ప్రభుత్వని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లొడంగి శ్రావణ్ కుమార్,గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీర స్వామి, జేఏసీ జిల్లా చైర్మన్ జిట్టబోయిన లింగ స్వామి,జిల్లా నాయకులు గుండ లింగారెడ్డి, పెరిక శేఖర్,వేణుగోపాల్ రెడ్డి,పెరమళ్ళ మురళి, అద్దంకి వెంకన్న,లతీఫ్,విజయ్, ఉమాదేవి, నాగమణి, రమ్య, సతీష్, ప్రవీణ్, రమేష్, నరసింహ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నందం,బాసాని వెంకటయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగేలా చూడాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని ఎర్కారం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. వడ్ల మిల్లులను కూడా గుర్తించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రావచ్చుని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌళిక సదుపాయాలైన వెయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, త్రాగునీరు, టెంట్లు, వర్షాలు వస్తే అత్యవసర పరిస్థితుల్లో టార్పలిన్ పట్టాలు, ట్యాజింగ్ మిషన్లు, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. 2, 3 మండలాలకు కలిపి ఒక ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దీనిని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తారని అలాగే మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్‌బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

## నల్లగొండలో ఎల్‌పిజి గ్యాస్ విస్తరణ వేగవంతం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లాలో పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా విస్తరణ పనులను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.వాణిజ్య ఎల్‌పిజిపై ఆధారాన్ని తగ్గించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో గ్యాస్ పంపిణీ విస్తరణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్య సంక్షోభం ప్రభావంతో ఎల్‌పిజి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో పిఎన్‌జి విస్తరణ అవసరమని పేర్కొన్నారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా పనులు జరుగుతుండగా, వేగవంతం కోసం 24 గంటల పని అనుమతి ఇచ్చారు. శబ్ద కాలుష్య,భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ఈ అనుమతి సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఎల్‌పిజికు మారే వాణిజ్య వినియోగదారులకు మాత్రమే 50 వరకు ఎల్‌పిజి కేటాయింపు లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.ప్రాజెక్ట్ మేనేజర్ వంశీకృష్ణ ప్రకారం, వలిగొండ నుంచి నార్కట్‌పల్లి, అక్కడి నుంచి నల్లగొండ వరకు పైప్‌లైన్ పనులు కొనసాగుతూ,గ్రామాలకు గ్యాస్ సరఫరా ఏర్పాట్లు చేస్తున్నారు. సమీక్ష సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈసమీక్ష సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,ఎఎస్‌పి రమేష్, పౌరసరఫాల శాఖ అధికారి వెంకటేష్,జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్ ఆర్అండ్‌బి ఈఈ శ్రీధర్ రెడ్డి పంచాయతీరాజ్ అధికారి శేఖర్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర హాజరయ్యారు.



## నకిలీ కరెన్సీ మోసం.. విదేశీ నిందితుడు అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నకిలీ కరెన్సీ నోట్లతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న విదేశీ నిందితుడిని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.తిప్పర్తి మండల పరిధిలో జరిగిన ఈ ఘటనలో ఏ2 గోయిటా సొంగాలో (53), మాలి దేశానికి చెందిన వ్యక్తి కాగా, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రధాన ఏ1నిందితుడు సల్మాన్ ఉమా దాలియా పరారీలో ఉన్నాడు. పోలీసుల వివరాల ప్రకారం నిందితులు వాట్సాప్ ద్వారా పరిచయాలు పెంచుకుని,తక్కువ డబ్బుకు ఎక్కువ కరెన్సీ ఇస్తామని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్నారు. నల్లటి రంగు పూసిన కాగితాలను ప్రత్యేక రసాయనంతో కడిగితే అసలు నోట్లుగా మారుతాయని చూపించి బాధితులను మోసం చేస్తున్నారు.ఇటీవల మల్లేపల్లి వారిగూడెం వద్ద వంగూరి జానయ్య అనే వ్యక్తి నుంచి రూ.1లక్ష తీసుకుని,రూ.5లక్షల కట్టగా నమ్మబలికి నకిలీ కాగితాలు ఇచ్చినట్లు గుర్తించారు.బాధితుడు మోసపోయినట్లు తెలుసుకుని,తన స్నేహితుడి సహాయంతో నిందితుడిని మళ్లీ సంప్రదించి, తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించాడు.నిందితుడి వద్ద నుంచి నాలుగు కట్టల నకిలీ కాగితాలు, రసాయన ద్రావణం, ఒక మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై గతంలో మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో కూడా మోసం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన డిఎస్‌పి శివరాం రెడ్డి, సిఐ కొండల్ రెడ్డి,ఎస్ఐ వి. శంకర్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

## పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి



### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/యాదాద్రిక కలెక్టరేట్** : పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదులను, డార్మెటరీ హాల్ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంట శాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల లోని పరిసర ప్రాంతాలు పరిశీలిస్తూ పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు.పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

### నిందితుడిపై పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 9 ఏండ్ల మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడకు చెందిన ఓ బాలికపై శాంతినగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అఘాయిత్యానికి పాల్పడగా బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు భయపడి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఇంటికి వచ్చి కూతురిని వివరాలు అడగగా చిన్నారి ఏడుస్తూ జరిగిన విషయాన్ని వివరించింది. వెంటనే బాలిక తల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు యువకుడిపై ఫిర్యాదు చేయగా డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసుకోని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

## చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం

### వర్ధంతి సందర్భంగా పలువురు వక్తలు




**ప్రజాపక్షం/దేవరకొండ:** నిజాం నవాబ్ పునాదులను కదలించి, తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచి ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వర్‌రావు 32వ వర్ధంతి సందర్భంగా గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలకొండ కాంతయ్యతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, నాయకులు జ్యోతిబసు, వెంకటయ్య, మల్లేష్, గోవర్ధన్, ఆనందచారి, వెంకటయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోత్కూర్** : పేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన పోరాటయోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సిపిఐ భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చండ రాజేశ్వరరావు 33వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో సిపిఐ కార్యాలయం(కేఆర్) భవన్‌ల సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీతా పని వారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి మోత్కూరు మండలం అధ్యక్షులు గొలుసుల యాదగిరి, బీసీ సంఘం మండల కార్యదర్శి పెండ వెంకటేశ్వర్లు, తాడూరు లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : భారతదేశ పోరాటాల యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) 32వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం యాదగిరిగుట్టలోని సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై, సి.ఆర్. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు కోకల రవీందర్ పాల్గొన్నారు.

# నేరం.. ఏదైనా.. నెపం మాపైనే!!

### నేటికి చాలిచాలని వేతనాలు

### పండగ పబ్బాలకు సెలవులే ఉండవు!

### ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి అధ్వానం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : నేరం... ఏదైనా..నెపం మాపైనే..!! ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన. ఎంతటి ఒత్తిడినైన మౌనంగా భరిస్తూ విధులు నిర్వహిస్తున్నాం. పూర్తి చేస్తారు. స్వామి సన్నిధిలో మేమ అంటే అందరికి అలుసేనని ఔట్సోర్సింగ్ సిబ్బంది తమలో తామే కుమిలిపోతున్నారు. విశ్వక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేయని తప్పులకు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతోనే దేవస్థానంలో ఏ ఘటన చోటు చేసుకున్న అధికారులు తమపై నెపం మోపుతూ నేరం నెట్టేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. పండగ పబ్బాలకు కూడా సెలవుల్లేకుండా సేవలు చేస్తుంటే వివిధ కారణాలు చూపుతూ ఉద్యోగం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని వాపోతున్నారు. విధి నిర్వాహణలో తమకు ఎదురవుతోన్న సమస్యలను ఎవరితోనైనా పంచుకుంటే కుట్రలు చేస్తూ తొలగించేస్తున్నారు. దుకు కూడా జంకుతున్నారు. 2022 సంవత్సరం నుంచి సురక్ష ఏజెన్సీ అందుబాటులోకి వచ్చింది. దేవస్థానం పరిధిలోని 17 విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందే సేవలే కీలకమయ్యాయి. 2025 జూన్ 1 న ఉంచి ఆయా విభాగాల్లో 420 పైచిలుకు అనుమతి ఉంది. సుమారు గ్లోబల్ ఏజెన్సీ ద్వారా సుమారు 314 మంది. కృష్ణ కన్స్ట్రక్షన్స్ కింద 132 మంది పారిశుద్ధ్య (ఔటిసోర్సం (గ్) సిబ్బందికి విధులు నిర్వహిస్తున్నారు. కానీ, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సదుపాయాలు మాత్రం వీరి దరిచేరవు. అధికారుల దయాదాక్షిణ్యాల మీద వీరి జీతం, ఉద్యోగ జీవితం ఆధారపడి ఉంటుంది. ఇదే క్రమంలో దేవస్థానం పరిధిలో ఏ చోట ఏం జరిగిన వీరినే బాధ్యులను చేస్తూ అధికారులు వారి ఉద్యోగాలకే ఎసరు తెస్తున్నారు.

**సదుపాయాల కోత** : ఏజెన్సీ ద్వారా ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి వేతన చట్టం అమలు కావడం లేదు. అన్స్కిల్ రూ. 15,600, సెమీస్కిల్ రూ.19,500, స్కిల్ రూ.22,750 మూడు విభాగాల ఒగా విభజించి ఈఎస్ఐ, పీఎఫ్తో కలిపి సిబ్బందికి వేతనాలు అందిస్తున్నారు. నెలకు మూడు, ఏడాదికి 15 సాధారణ సెలవులు, పండగ, ఇతర అవసరాలకు వేతనంతో కూడిన సెలవులు మంజూరి చేయాలి. ఒకవేళ సిబ్బంది మరణిస్తే ఈపీఎఫ్ కింద రూ. 15 లక్షల ఆర్థిక సహాయంతో పాటు కుటుంబ సభ్యుడులో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఇవి మాత్రం అమలు కావడం లేదు.

**ఔట్‌సోర్సింగ్ సిబ్బందే బలిపశువులు :** 2025 ఆగస్టు 28న చింతపండు దొంగతనం, సెప్టెంబరు 1న పుష్కరిణీలో రంగు మారిన నీళ్లు, లైట్లు వెలగనందుకు ఔట్సోర్సింగ్ సిబ్బందిపైనే క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. కాగా, చింతపండు దొంగతనంలో అధికారి, వంటస్వాములు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బలి చేసి పర్యవేక్షించాల్సిన అధికారులను వదిలేశారు. అధికారుల ప్రమేయ ఎంతోనే దొంగతనం చేసినట్లు బాధితులు బహిరంగం చేసినప్పటికి పక్షపాతంతో కమిటీ విచారణ చేసిందని ఆరోపణలు వెలువడ్డాయి. ఇఒ పర్యటనలో భాగంగా కొండకింద లక్ష్మీ పుష్కరిణీలో నీళ్లు రంగు మారగా ఆగ్రహించిన ఇఒ తక్షణమే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు వేశారు. కొండ చుట్టూ వలయ రహదారిలో గత ఏడాది అక్టోబరు 22న లైట్లు వెలగనందుకు నిర్వహణ బాధ్యతలు చూసే ఈసీఐఎల్ సంస్థను వదిలేసి ఇద్దరు ఔట్సోర్సింగ్ సిబ్బందిని బలి చేశారు. వీరిని తిరిగి విధుల్లోకి చేర్చుకునేందుకు గడువు ఏమి లేకపోవడం చేత అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తూనే వారి వ్యక్తిగత పనులను చక్కాబెట్టాల్సి వస్తుంది. పైగా దేవస్థానంలో ఔట్సోర్సింగ్ సిబ్బందినే అధికారులు బలిపశువులను చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన తమను తగిన గుర్తింపుతో పాటు నిబంధనల ప్రకారం సదుపాయాలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

## ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు తనిఖీ



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** వాటర్ ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. ఈ మేరకు జలమండలి ఓ అండ్ ఎం డివిజన్6 ఎస్ఆర్‌నగర్‌లో జెఎండీ మయాంక్ మిట్టల్ పర్యటించారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న.. జూబ్లీహిల్స్, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి? ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ట్యాంకర్లను సమయానికి పంపిణీ చేయడం అత్యంత ముఖ్యమని, పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాంకర్లను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్యాంకర్ల కదలికపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి వినియోగదారులకు సమయానికి ట్యాంకర్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



**ప్రజాపక్షం/అబిడ్స్:** ఉద్యోగానికి వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహాభారత్‌నగర్‌లో నివాసముండే ఉమాదేవి గత కొద్ది కాలంగా ఐమాక్స్ గేమ్స్ జోన్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహిస్తోంది. బుధవారం రోజువారీగా ఉద్యోగానికి వెళ్లిన ఆమె సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి లక్ష్మీ దేవి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో, ఆమె పని చేసే కార్యాలయంలో విచారణ చేయగా డ్యూటీకి లేట్‌గా వస్తానని చెప్పి అసలు రాలేదని చెప్పారు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులకు, తెలిసినవారు, స్నేహితుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లేకపోయేసరికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏకగ్రీవంగా శివాజీ ఎన్నిక

టిఇఇఎ అధ్యక్ష పీఠంపై
నాల్గవ పర్యాయం



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** తెలంగాణ ఉద్యమ కెరటం ఎన్.శివాజీ నాల్గవ పర్యాయం టిఇఇఎ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని పదవులకు పోటా పోటీగా నామినేషన్లు దాఖలైనా.. అధ్యక్ష స్థానం కోసం మాత్రం కేవలం శివాజీ నామినేషన్ మాత్రమే దాఖలయ్యింది. దీంతో ఆయన మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికవడం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక శివాజీ నాల్గవ సారి తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికవడంతో విద్యుత్ సంస్థల్లో హర్షం వ్యక్తమవుతోంది. తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిఇఇఎ) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించింది. 2020 సంవత్సరం నుంచి 2024 వరకు రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో శివాజీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు కీలక భూమిక పోషించారు. తెలంగాణ ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో, కొత్త ఉద్యోగ నియామకాలలో టిఇఇఎ తరపున శివాజీ ముఖ్యపాత్ర పోషించారు.

## సర్వే కోసం ఎంఆర్ఒకు వినతి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** లలితాబాగ్‌లోని హిందూ శ్మశాన వాటిక భూమి సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని బండ్లగూడ రెవిన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను కలిసిన స్థానికులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ వారం రోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి గేట్ నిర్మించేందుకు కావలసిన అన్ని ప్రక్రియలు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఎంఆర్ఓను కలిసినవారిలో శ్మశాన వాటిక అధ్యక్షుడు అడ్డాల అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు బుంగ శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జెరిపోతుల రాజ్‌కుమార్, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## రిజర్వేషన్ల వ్యతిరేకి ఆర్ఎస్ఎస్



కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** కుల వ్యవస్థ రద్దు చేయాలన్న మందకృష్ణ మాదిగ బిజెపి ఏజెంట్ అని కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ ఘాటుగా విమర్శించారు. కుల, మత రిజర్వేషన్లను ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని అన్నారు. కులాలు రద్దు అయితే రిజర్వేషన్లు రద్దు అవుతాయని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించినప్పటి నుంచి అంటరాని కులాలకు, క్రిస్టియన్ మతానికి, ముస్లిం మతానికి వ్యతిరేకమన్నారు. రాజ్యాంగంలో మనుసంస్మృతే చట్టం కావాలి తప్ప, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాదని 1949–50లో ఆర్ఎస్ఎస్ వ్యాఖ్యానించిందని తెలిపారు. సిక్కు మతంలోకి, బౌద్ధమతంలోకి ఎస్‌సిలు వెళ్తే ఎస్‌సి రిజర్వేషన్లు, చట్టాలు వర్తిస్తాయని 1956లో 1950 చట్టాన్ని సవరించారని గుర్తుచేశారు. దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి రిజర్వేషన్ల వర్తింపుపై ప్రధాని మోదీని మందకృష్ణ ఒప్పించాలని డిమాండ్ చేశారు. 1990లోనే మండల్ కమిషన్ ద్వారా ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఆర్ఎస్ఎస్ మొదట వాదించి, తర్వాత సవరించుకొన్నదన్నారు. నాటి నుంచి రిజర్వేషన్ల వ్యతిరేకి ఆర్ఎస్ఎస్ అని ఆయన తెలిపారు.

# యువత సానుకూల ఆలోచనలవైపు మళ్లాలి

మత్తు పదార్థాలు శాంతి, అభివృద్ధికి దెబ్బ
యూత్ ఫెస్టివల్ – 26లో ఆళ్ల రామకృష్ణ




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** మత్తు పదార్థాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబాల స్థిరత్వాన్ని, సమాజంలో శాంతి, అభివృద్ధిని దెబ్బతీస్తాయని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం జాతీయ చైర్మన్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ అల్లా రామకృష్ణ అన్నారు. యూత్ ఫర్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైనబుల్ సొసైటీ (వైఐఎస్ఎస్) ఆధ్వర్యంలో " సే నోటు టు డ్రగ్స్ ఆనంద భరితమైన, సంతోషకరమైన క్యాంపస్" అనే అంశంపై యూత్ ఫెస్టివల్2026 హైదరాబాద్ వర్సిటీలో గురువారం నిర్వహించారు. దీనికి గౌర వ అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ యువత బాధ్యాతయుత నిర్ణయాలు , సానుకూల ఆలోచనలు, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలవైపు వైపు మళ్లాలని సూచించారు. ధించిం చారు టెన్నిస్ క్రీడాకారిణి డా.నైనా జైస్వాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, లక్ష్యసాధనతో ముందుకు సాగాలని కోరారు. వైఐఎస్ఎస్ వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని కోరారు. మంచి అభిరుచులు, సానుకూల దృక్పథం ద్వారా సంతోషకరమైన జీవితం సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో సినీ దర్శకులు అభినయ కృష్ణ, నటులు శరణ్య, ప్రదీప్, హీరో విరాట్ కర్ణ వైఐఎస్ఎస్ కన్వీనర్ లక్కీ, అధ్యక్షురాలు మేఘన, సభ్యులు శివ యాదవ్, ప్రీతి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

## పాతికేళ్ల తెలంగాణ కథ పుస్తక రచన పోటీలు

**ప్రజాపక్షం/అబిడ్స్:** పాతికేళ్ల తెలంగాణ కథ గ్రంథరచన పోటీ గడువును మే 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ దశ 2000 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు తెలంగాణ గొంతును ఆవిష్కరించే ప్రత్యేక గ్రంథాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో పరిషత్తు ఈ పోటీ ప్రకటించిందని వివరించారు. 150 పుటలు (పేజీలు) ఉండాలని, పోటీకి పంపే రచన (అనూ సెవెన్ పేజ్ మేకర్ ఓపెన్ ఫైల్)తో పాటుగా అది స్వీయ రచన అని హామీ పత్రం జత చేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ పోటీ ఏప్రిల్ 10తో ముగియనుండగా తాజాగా మే 10 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎంపికైన రచనకు రూ.25 వేల నగదు బహుమతి ఉంటుంది. టైపింగ్ ఖర్చు అదనం. పుస్తకాన్ని పరిషత్తే ప్రచురిస్తుంది. 2026 మే 10వ తేదీలోగా సాఫ్ట్ కాపీ పరిషత్ మెయిల్‌కి పంపాల్సి ఉంటుంది.

## పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం

సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్




**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పోరాటాల ద్వారానే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతామని.. ఆ దిశగా పోరాటం చేసి సిపిఐ పార్టీకి విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన సీతాఫల్‌మండి డివిజన్‌లోని నామాలగుండు, విశాల్‌మార్ట్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ఇరాన్, అమెరికా యుద్ధం కారణంగా ముఖ్యంగా చిరు వ్యాపారులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఆటో కార్మికులకు ఎల్పిజి, సిఎన్జి గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీలు గ్యాస్ లేదని చెప్తున్నాయని.. కానీ బ్లాక్ మార్కెట్లో వేలాది రూపాయలకు సిలిండర్లు అమ్ముకుంటున్నా సంబంధిత అధికారులు బ్లాక్ మార్కెట్ ను అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు ఒకవైపు ఫ్రీ బస్సు, మరోవైపు సిఎన్జి గ్యాస్ కొరత మూలాన రూ.60 నుంచి ఏకంగా రూ.120 పెరగడంతో పేదల బతుకులు ఆగమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోలు నడవక తీవ్రమైన గందరగోళ పరిస్థితి ఏర్పడిందని.. ఆటో డ్రైవర్ల తమ బాధలను వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపైన భవిష్యత్తులో మరిన్ని బలమైన పోరాటాలు నిర్వహించాలంటే ప్రజలంతా తమ వంతుగా విరాళాలు ఇచ్చి కమ్యూనిస్టు పార్టీలు చేసే పోరాటాలలో పెద్ద ఎత్తున భాగస్వామి కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమర్ఖాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చైతన్య యాదవ, సహాయకార్యదర్శి కొమురెల్లి బాబు, సోమయ్య, సయ్యద్ గౌస్, యాదగిరి, యూసుఫ్, ఉదయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్‌లో నేరగాళ్ల ఉచ్చులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో వచ్చిన ఫోన్ కాల్‌ను నమ్మి ఆయన రూ.1 లక్ష కోల్పోయారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. తెలంగాణ ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శి అనంతరామిరెడ్డిని అంటూ ఒక గుర్తు తెలియని వ్యక్తి ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్' పథకం కింద జనగామ నియోజకవర్గానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున రుణాలు మంజూరయ్యాయని సదరు వ్యక్తి నమ్మబలికాడు. నమోదు ప్రక్రియకు ఈరోజే ఆఖరి గడువు అని, లబ్ధిదారుల ప్రాసెసింగ్ ఫీజు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున మొత్తం రూ.1 లక్ష తక్షణమే చెల్లించాలని కోరాడు. నియోజకవర్గం ప్రజలకు లబ్ధి చేకూరుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు.డబ్బులు పంపిన తర్వాత అనుమానం వచ్చిన ఎమ్మెల్యే, వెంటనే సచివాలయంలోని ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించారు. తమ శాఖ నుంచి అటువంటి ఫోన్ కాల్స్ ఏవీ చేయలేదని అధికారులు స్పష్టం చేయడంతో తాను మోసపోయానని గ్రహించారు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరూ వ్యక్తిగత ఖాతాలకు నగదు బదిలీ చేయమని అడగరని, ఇలాంటి మోసపూరిత కాల్స్ పట్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

## బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

-బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ డిమాండ్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారు తమ ధోరణిని వెంటనే మార్చుకోవాలని, చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (బాస్) చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇటీవలి కాలంలో బ్రాహ్మణ జాతిని కించపరుస్తూ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. దళిత క్రైస్తవుల కుల హోదా అంశంపై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని కోరుతూ, సంబంధం లేని బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరి కాదని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని బ్రాహ్మణులను సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది సమాజంలో అసమానతలు సృష్టించడమేనని మండిపడ్డారు. హిందూ ధర్మాన్ని, మతాన్ని అవమానపరుస్తూ క్రైస్తవ మత వ్యాప్తికి సహకరిస్తున్నారని ఆరోపించారు. భారత స్వాతంత్ర్య సమరంలో, రాజ్యాంగ రచనలో, ఆర్థిక సంస్కరణల్లో, అంటరానితనం నివారణలో బ్రాహ్మణులు పోషించిన విశిష్ట పాత్రను మంద కృష్ణ మాదిగ తెలుసుకోవాలని సూచించారు. గూగుల్లో వెతికినా బ్రాహ్మణుల గొప్పతనం, సమాజానికి వారు చేసిన సేవలు తెలుస్తాయని అన్నారు. బ్రాహ్మణులను టార్గెట్ చేయడం మాని, చేస్తున్న విపరీత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ధోరణి కొనసాగితే తాము కూడా ధీటుగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మీడియా సమావేశంలో బ్రాహ్మిన్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ప్రతినిధులు రామకృష్ణ మూర్తి, రాఘవరావు, లక్ష్మీ నారాయణ, ఇవటూరి కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం సమరం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** సమస్యలపై సమరంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్లోని ఇందిరానగర్ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమగ్రంగా తెలుసుకున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించాలని కోరారు.

## నూతన పార్టీ పోస్టర్ విడుదల

**ప్రజాపక్షం/చార్మినార్:** అమరుల ఆశయ సాధన కోసం.. సంపూర్ణ తెలంగాణ వికాసం కోసం.. నవ శకానికి నాంది పలుకుతూ ఈనెల 25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఏర్పాటు చేయబోతున్న నూతన రాజకీయ పార్టీ పోస్టర్ ఆవిష్కరణ చార్మినార్ వేదికగా జరిగింది. ఈ మేరకు గురువారం సాయంత్రం 4 గంటలకు తెలంగాణ జాగృతి చార్మినార్ నియోజకవర్గం ఇంచార్జి పుప్పాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద ఆవిష్కరించారు.

## అక్రమ వాటర్ ప్లాంట్ తనిఖీ

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌పై చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఓల్డ్ మలక్‌పేట్లోని గ్రీన్‌నెస్ట్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన అధికారులు, అవసరమైన చట్టబద్ధ అనుమతులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.అదేవిధంగా, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా, అనారోగ్యకర పరిస్థితుల్లో మంచినీటిని తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కోసం చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు.

## 26న హిందూ సమ్మేళనం

**ప్రజాపక్షం/చార్మినార్:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప్పుగూడ రాఘవేంద్ర బస్తీలో ఈనెల ఏప్రిల్ 26వ తేదీన హిందూ సమ్మేళనం జరుగనున్నది. కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఉప్పుగూడ మల్బార్ బాగ్ శివాలయంలో అధ్యక్షుడు గుల్లం బొజ్జయ్య పంతులు అధ్వర్యంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఏర్పాటు చేయడం జరిగింది.

## పాత నేరస్థులకు జైలు శిక్ష

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** పట్టుబడిన పాతనేరస్థులకు మూడవ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు నెలల జైలు శిక్ష విధించింది. ఏప్రిల్ 9 రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు.. వీహెచ్పీ ఆఫీస్ లేన్ వద్ద నెంబర్ ప్లేట్ లేని యాక్టివాపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ ఖాజా(21), మహ్మద్ షాహిద్ హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద ఒక కత్తి, బ్లేడ్ (కట్టర్) లభించడంతో సుల్తాన్‌బజార్ పోలీసులు సీపీ యాక్ట్ సెక్షన్ 61(ఎ) కింద ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. ఈ ఇద్దరికీ గతంలోనూ పలు నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కోర్టులో వీరు నేరం చేసినట్లు రుజువు కావడంతో 60 రోజుల సాధారణ జైలు శిక్ష ఖరారైంది.

## వైభవ్ ఇంపీరియల్ బ్యాంకెట్ ప్రారంభం

ప్రారంభించిన మాజీ హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** బౌద్ధనగర్‌లో వైభవ్ ఇంపీరియల్ బ్యాంకెట్ హాల్‌ను మాజీ హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. కార్యక్రమానికి పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, వ్యాపార వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.... ఆధునిక సదుపాయాలతో కూడిన ఫంక్షన్ హాళ్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. బ్యాంకెట్ హాల్ నిర్వాహకుడు బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శి, సికింద్రాబాద్ బిల్డర్స్ ఆస్సోసియేషన్ అధ్యక్షుడు మద్దర్ల శ్యాంసుందర్‌ను దత్తాత్రేయ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్, బిజెపి సీనియర్ నేత వెంకటరమణ, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండెగోని భరత్ గౌడ్, సికింద్రాబాద్ బిల్డర్ ఆస్సోసియేషన్ చైర్మన్ నోముల ప్రకాష్ రావు, బండ కార్తికరెడ్డి, మేకల సారంగపాణి, మాజీ కార్పొరేటర్ కంది శైలజతో పాటు గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పరీక్షలను సక్రమంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్, నేషనల్ డిఫెన్స్ అకాడమి మరియు నావెల్ అకాడమి పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూఅధికారి ఈ.వెంకటాచారి అధికారులను ఆదేశించారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఈ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈనెల 12న యుపిఎస్‌సి కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (1) పరీక్ష, నేషనల్ అకాడమి అండ్ నావెల్ అకాడమి(1) పరీక్షలు జురగనున్నాయి. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ తెలిపారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు ఇచ్చారు. జిల్లాలో 27 సబ్‌సెంటర్లలో 10,967 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఫేస్ అథెంటికేషన్ పద్ధతిని సక్రమంగా అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌళిక వసతులు, ఇతర సదుపాయాలను ఇన్స్‌పెక్టింగ్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రంలోకి అడ్మిడ్ కార్డులో తెలిపిన వస్తువులను మాత్రమే అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏసిపిలు కెవిఆర్ సత్యనారాయణ, జి.లక్ష్మ ణ్, పరీక్షల సూపరింటెంటెంట్ ఎం.మహిందర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మహనీయుల స్ఫూర్తి బాటలే మాకు అడుగుజాడలు

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్
ఆకునూరి మురళి




**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** మనలో ఆత్మగౌరవాన్ని నింపి.. స్వేచ్ఛా సమానత్వాలను అందించేది విద్య మాత్రమేనని.. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉద్ఘాటించారు. సేవాభావం, పరోపకారం, దేనికీ భయపడని తత్వం, త్యాగంతో మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయులు మనకు పూలబాటలు పరిచారని, వారి స్ఫూర్తి బాటలే మనకు అడుగుజాడలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ అధ్యక్షతన.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సెల్స్ సహకారంతో సమత, శిక్ష, సమృద్ధి పేరిట మహనీయుల జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆకునూరి మురళి మాట్లాడుతూ.. దేశంలో అత్యంత భయంకరమైన రోగం కుల వివక్ష అని, దాన్ని నిర్మూలించకుండా సమృద్ధి సాధ్యం కాదన్నారు. కులం గోడల్ని బద్దలు కొట్టి, మనమంతా భారతీయులమే అన్న స్పృహతో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, వివక్షపై సంఘటితంగా పోరాడాల్సిన ఆవశ్యకతను మహనీయుల జీవితాల నుంచి మనం గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో విశిష్ట తెలంగాణ పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్, శాతవాహన వర్సిటీ సోషల్ సైన్సెస్ డీన్, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, సినీ గేయ రచయిత్రి పింగళి చైతన్య, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లోక పావని, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రజనీ మాలతి, ఎంఎన్జే క్యాన్సర్ ఆస్పత్రి డీన్ డాక్టర్ గాయత్రి, వీరనారి చాకలి ఐలమ్మ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పవన్ ఖేరా బెయిల్ పిటిషన్

విచారణార్హతపై నేడు ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అస్సాంలో నమోదైన కేసుకు సంబంధించి కాంగ్రెస్ నేత పవన్ ఖేరా దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్ విచారణార్హతపై ముందుగా నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు తెలిపింది. కేసు గౌహతిలో నమోదవగా, పిటిషనర్ ఢిల్లీలో నివసిస్తున్న నేపథ్యంలో తెలంగాణ హైకోర్టుకు ఈ పిటిషన్‌ను విచారించే పరిధి ఉందా అన్నది తేల్చాల్సి ఉందని పేర్కొంది. ఈ అంశంపై నిర్ణయం తీసుకునేందుకు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రిణికి భూయాన్ శర్మ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముందస్తు బెయిలు కోరుతూ పవన్ ఖేరా పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ ఇది రాజకీయ ఉద్దేశంతో పెట్టిన కేసు అని పేర్కొన్నారు.

# కోల్‌కతాపై లక్నో గెలుపు



కోల్‌కతా: ఐపిఎల్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 181/4 స్కోరు చేసింది. ఈ లక్ష్యాన్ని లఖనవూ సరిగ్గా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆయుష్ బదోని (54; 34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సు) రాణించాడు. ఒక దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన లఖ్ నవూను ముకుల్ చౌదరి (54*; 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి గెలిపించాడు.కోల్కతా బౌలర్లలో వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్ తలో 2, సునీల్ నరైన్, కార్తిక్ త్యాగి, కామెరూన్ గ్రీన్ తలో వికెట్ పడగొట్టారు. ఆఖరి ఓవర్లో ఏం జరిగిందంటే.. లఖ్నవూ విజయానికి ఆఖరి ఓవర్లో 14 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో ఉన్న అవేశ్ ఖాన్ మొదటి బంతికి సింగిల్ తీసి, ముకుల్ చౌదరికి స్ట్రైక్ అందించాడు. రెండో బంతికి ముకుల్ సిక్స్ బాదాడు. అప్పుడు సమీకరణం 4 బంతుల్లో 7 పరుగులుగా మారింది. 3, 4 బంతులకు పరుగులు రాకపోవడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. 2 బంతులకు 7 పరుగులుగా సమీకరణం మారింది. అయితే అయిదో బంతికి ముకుల్ సిక్స్ బాదడంతో స్కోర్లు సమమయ్యాయి. ఆఖరి బంతికి ముకుల్ బీట్ అయ్యాడు. కానీ బైస్ రూపంలో ఒక పరుగు రావడంతో లఖ్ నవూ గట్టెక్కింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతా బ్యాటర్లలో కెప్టెన్, ఓపెనర్ అజింక్య రహానే (41; 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు), వన్ డౌన్ బ్యాటర్ రఘువంశీ (45; 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సు) రాణించారు. రొమ్మన్ పావెల్ (39, 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సు), కామెరూన్ గ్రీన్ (32; 24 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిశారు. లఖ్ నవూ బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్, దిగ్వేశ్ రాఠీ, అవేశ్ ఖాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## కివీస్‌పై భారత్ స్వీప్..



**న్యూఢిల్లీ :** ప్రతిష్ఠాత్మక బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా/ఓషియానా గ్రూపు1లో భారత్ అదరగొట్టింది. థాయ్‌లాండ్‌తో తొలి పోరులో 1–2 వెనుకంజలో నిలిచిన భారత్.. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో సత్తాచాటింది. బుధవారం జరిగిన రెండో పోరులో భారత మహిళల జట్టు 3–0తో న్యూజిలాండ్‌ను స్వీప్ చేసింది. థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో తడబడ్డ యువ ప్లేయర్లు వైష్ణవి అడ్కార్, సహజ యమ్లపల్లి పుంజుకుని ప్రత్యర్థిపై ప్రతాపం చూపించారు. తొలుత జరిగిన సింగిల్స్‌లో వైష్ణవి 6–2, 6–4తో ఐషి దాస్తీపై అలవోక విజయం సాధించింది. గంటన్నర పాటు సాగిన పోరులో వైష్ణవి తన ఆటతీరుతో ఆకట్టుకుంది. గత మ్యాచ్‌లో తప్పులను సరిదిద్దుకుంటూ మెరుగ్గా రాణించింది. మరో సింగిల్స్‌లో తెలంగాణ యువ ప్లేయర్ సహజ యమలపల్లి 6–1, 6–3తో వాలెంటీనా ఇవన్వో భారత్ ఆధిక్యాన్ని 2–0కు పెంచింది. తన అనుభవాన్ని ఉపయోగిస్తూ సహజ వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసింది. అదే దూకుడు కొనసాగిస్తూ భారత ద్వయం రుతుజా బోస్లే, అంకితారైనా 6–4, 6–2తో కివీస్ జోడీ ఎరిన్ రౌట్లిఫ్, మోనిక్ బారీపై గెలిచింది.

## అగ్రస్థానానికి వైశాలి..



**సైప్రస్ :** ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. బుధవారం జరిగిన తొమ్మిదో రౌండ్ పోరులో వైశాలి 10 తేడాతో భారత్‌కు చెందిన ప్రపంచ చాంపియన్ దివ్యాదేశ్‌ముఖ్‌పై విజయం సాధించింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో వైశాలిదే పైచేయి అయ్యింది. ఈ విజయంతో తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి వైశాలి 5.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. వైశాలితో పాటు జు జినర్(చైనా) సంయుక్తంగా టాప్‌లో ఉంది. మరోవైపు ఓపెన్ విభాగంలో వీ యి(చైనా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ఆర్ ప్రజ్ఞానంద డ్రాగా ముగించుకున్నాడు. విజయం కోసం ఇరువురు ప్లేయర్లు కడదాకా హోరాహోరీగా పోరాడారు. ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో కొనసాగుతుండగా, జావోకిర్ సింద్రోవ్ 6.5 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు.

## క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్.. తొలిరౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి!



భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్షిప్‌లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీయు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు. సీనియర్లు విఫలమైన చోట ఇరవై ఏళ్ల ఆయుశ్ ప్రత్యర్థికి దడ పుట్టించాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ ఈసారి 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన భారత కుర్రాడు.. 21–16, 21–12తో గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతడికి మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా) ఎదురుపడనున్నాడు. ఆయుష్ సెమీస్ చేరాలంటే జోనాథన్ వ్యూహాలను చిత్తు చేయాల్సిందే.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### అత్యధిక జనాభా గల కేంద్రపాలిత ప్రాంతం

- 1983వ సంవత్సరములో కామన్వెల్త్ కూటమి శిఖరాగ్ర సమావేశము జరిగిన ప్రదేశం
  ఢిల్లీ
- విశాఖపట్టణ ఉక్కు కర్మాగార స్థాపనలో సహకరించిన దేశం
  అప్పటి సోవియట్ యూనియన్
- కులీన పాలన అనగా
  అల్పజన పాలన
- సైకిల్ వెనుక భాగంలో వుండవలసినది
  ఎర్రటి రిఫ్లెక్టర్
- ఏడవ శిఖరాగ్ర సమావేశం జరిగిన నగరం
  న్యూఢిల్లీ
- సిక్కుల పదో గురువు ఎవరు?
  గురు గోవింద్ సింగ్
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవీ విరమణ వయసు ఎంత?
  65 సంవత్సరాలు
- 'కవితాగుణార్ణవుడు' అనే బిరుదు ఎవరిది?
  పంపకవి
- భారత రాజ్యాంగాన్ని శాసనీకరించి, అంగీకరించి, ప్రకటించింది ఎవరు?
  భారత ప్రజలు
- దృశ్య కాంతిలోని రంగులు ఎన్ని?
  7
- మద్యం తాగేవారిని గుర్తించే కిరణాలు ఏవి?
  పరారుణ కిరణాలు
- విదేశీ మారక నిల్వల సంరక్షణ కర్త
  రిజర్వు బ్యాంకు
- 'శిలాదిత్యుడు' అనే బిరుదు ఎవరికి ఉంది?
  హర్షవర్ధనుడు
- రాష్ట్ర విధాన పరిషత్‌కు గవర్నర్ ఎంతమంది సభ్యులను నామినేట్ చేస్తారు?
  1/6 వంతు
- కిందివాటిలో అత్యంత లోతైన సరస్సు ఏది?
  బైకల్
- కింది ఏ దేశం అతి ఎక్కువ దేశాలతో సరిహద్దును కలిగి ఉంది?
  రష్యా
- ఇది పసిఫిక్ మహాసముద్ర మేఖల యందలి అగ్నిపర్వతము
  కోటపాక్సి
- మేలి రకపు నైట్రేట్ నిక్షేపాలు
  అటకామా
- ప్రజాభిప్రాయ సమీకరణలో ప్రముఖ పాత్ర వహించేవి:
  వార్తాపత్రికలు
- సెయింట్ లారెన్స్ అనునది
  నది
- ప్రపంచంలో అత్యధిక వేగంతో నడిచే రైలు ఉన్న దేశమేది?
  జపాన్
- సబ్బులోని ప్రధాన ఘటకం ఏది?
  సోడియం స్టీరేట్
- రెండో మాధవవర్మ కీసరలో నిర్వహించిన యజ్ఞం ఏది?
  పురుషమేధం
- పోలియో వంటి వ్యాధులలో, వైరస్చే నశింపబడే కణాలు
  చాలకనాడీ కణాలు
- విద్యుద్దీపంలోని ఫిలమెంట్ దీనితో తయారవుతుంది.
  టంగ్‌స్టన్
- కాలుష్యం వల్ల ఓజోన్ పొరకు విఘాతం కలిగితే



అంటార్కిటికా మంచు ఖండం కరుగుతుంది.
- నయాగరా జలపాతం వీటిమధ్య ఉన్నది.
  ఇరీఒన్టారియో సరస్సుల మధ్య
- విద్యుత్ ప్రవాహ దిశను మార్చునది.
  కమ్యుటేటర్
- వేములవాడ చాళుక్యుల్లో చివరి రాజు ఎవరు?
  మూడో అరికేసరి
- ఏ సంవత్సరంలో గాంధీజీ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చాడు?
  1919
- రాష్ట్ర శాసనసభ సభ్యుడిగా గవర్నర్ ఎవరిని నామినేట్ చేస్తారు?
  ఆంగ్లో ఇండియన్
- శరీరంలో టెలిఫోన్ వైర్లలా పనిచేసే నిర్మాణాలు
  నాడులు
- హెడ్ హంటర్సు జాతివారు యిచట నివసించుచున్నారు.
  బోర్నియా
- ప్రపంచంలో పెద్ద మంచినీటి సరస్సు
  సుపీరియర్
- పిల్లి గర్భావధి కాలంతో సమానమయిన గర్భావధి కాలం ఉండే జంతువు



కుక్క
- నైట్రోజన్ డయాక్సైడ రంగు
  ఇటుకరాయి రంగు
- ఉత్తర అమెరికాలోని నదులకు జన్మస్థానము
  కార్డిలెరాస్
- కాలానార్లో పట్టాభిషేకం నాటికి అక్బర్ వయసెంత?
  14 సంవత్సరాలు
- ఏ సముద్రాన్ని 'ఎండిపోతూ నశించిపోతున్న సముద్రం'గా పేర్కొంటారు?
  డెడ్ సముద్రం
- కిందివాటిలో నియాసిన్ విటమిన్ లోపంతో సంబంధం లేని వ్యాధి?
  డెంగీ
- గైక్వాడ్లు ఏ ప్రాంతం కేంద్రంగా పరిపాలించారు?
  బరోడా
- స్వభావంలో ఇస్లామిక్ కాని గాత్ర సంబంధమైన హిందుస్థానీ సంగీత శైలి ఏది?
  ధృపద్
- మెదడుకు హాని కలుగకుండ రక్షించునది
  మస్తిష్క మేరుద్రవం
- రైలుపెట్టెల సమైక్య కర్మాగారం ఇచ్చట ఉంది.
  పెరంబూర్
- గొప్పదైన మిసిసిపి నది ఎందులోకి ప్రవహిస్తుంది?
  మెక్సికో జలసంధిలోకి
- రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గవర్నర్ ఎన్ని సంవత్సరాలకు ఒకసారి నియమిస్తారు?
  5
- వివాహ పన్నును పూర్తిగా ఉపసంహరించుకున్న విజయనగర రాజు ఎవరు?
  కృష్ణదేవరాయలు
- కేఫియా అరబికా మొక్కలో....నుండి కెఫిన్ తయారగును.
  గింజలు
- ధ్వని తరంగాలు
  అనుదైర్ఘ్య
- కేంద్రపాలిత ప్రాంతాలలో అత్యధిక జనాభా గలది:
  ఢిల్లీ

# కమ్యూనిస్టు ఉద్యమ దార్శనికుడు చంద్ర రాజేశ్వరరావు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
### చంద్ర వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



నల్లగొండ...

**ప్రజాపక్షం/నల్లగొండ :** పేదల కోసం జీవితాంతం పోరాడిన మహానేత, కమ్యూనిస్టు ఉద్యమ దార్శనికుడు చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూం భవన్‌లో చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళుaర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాజేశ్వరరావు తెలంగాణా సాయుధ పోరాటంలో రాజేశ్వరరావు పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. సమాజ మార్పు కోసం కట్టుబడి పనిచేసిన ఆయన త్యాగాలు ఎన్నటికీ మరవలేనివని నెల్లికంటి సత్యం కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు జీవితం, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నమ్మిన సిద్ధాంతం ఎల్లవేళలా ఆదర్శప్రాయమైనవి, సర్వదా అనుసరణీయమైనవి, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు ఎం.నందం, రేపాక లక్ష్మిపతి, తెల్లగమల్ల దశరథ, పుట్టల సుజాత పాల్గొన్నారు.

### పోరాట యోధుడు చంద్ర

**నాగర్ కర్నూల్ :** పీడిత, తాడిత జనోద్ధరణ కోసం అలుపెరగని పోరాటాలు చేసిన కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సిపిఐ జిల్లా కార్యాలయం కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలనరసింహ్మా మాట్లాడుతూ తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్‌లను సమన్వయపరుస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సిఆర్ కీలకపాత్ర వహించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మారేడు శివశంకర్, బండి లక్ష్మీ పతి, తప్పేట కిరణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేసు మల్ల శివకృష్ణ, సిపిఐ టౌన్ నాయుడు, గొర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పోరాటాలకు ప్రతీక సిఆర్

**ఖమ్మం :** దేశంలో నిరంతర ప్రజా పోరాటాలకు ప్రతీకగా సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) నిలిచారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల పాటు సిపిఐ జాతీయ కార్యదర్శిగా పని చేసిన సిఆర్ చారిత్రాత్మక భూ పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ఆయన పోరాటాల ఫలితంగా దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్...

### యావదాస్తినీ పేదలకు పంపిణీ చేసిన మహోన్నత వ్యక్తి చంద్ర

**భద్రాద్రి కొత్తగూడెం :** దేశంలో భూ పోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేదలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయులని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఆర్ వర్ధంతిని గురువారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించారు. సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. అనంత రం సాబీర్‌పాషా మాట్లాడుతూ జమీందారీ కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై తన యావదాస్తినీ పేదలకు పంపిణీ చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించడమే సిఆర్‌కు ఇచ్చే నిజమైన నివాళి సాబీర్‌పాషా అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, రమణమూర్తి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, జర్పుల ఉపేందర్, జహీర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్ సిపిఐ కార్యలయంలో సిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, కే.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ భాషా, సత్యనారాయణరెడ్డి, ఎఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాజశేఖర్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఇందిర, టౌన్ పార్టీ నాయకులు సుందర్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం...



భద్రాచలం...



మహబూబ్‌నగర్...

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి సరికాదు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి సరికాదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా అన్నారు. అమెరికా కాల్పుల విరమణను ప్రకటిస్తూనే ఇరాన్‌ను భయాందోళనకు గురిచేస్తుందన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ సిపిఐ' విరాళాల సేకరణలో భాగంగా గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని నారాయణగూడ మేఫిల్ హోటల్ నుండి 'షాప్ టు షాప్' కరపత్రాలు పంచుతూ ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఈ.టి.నరసింహ్మా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఆర్థిక వనరులను దోచుకోవడానికి అమెరికా యుద్ధాలు ప్రారంభించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తూ ఇతర దేశాలను కబళించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సొంత దేశంలోనే 90 లక్షల మంది రోడ్లపైకి వచ్చి యుద్ధం చేయొద్దు సైనికుల ప్రాణాలు తీయొద్దని నిరసన ప్రదర్శనలు చేపట్టగా దీంతో వెనక్కి తగ్గినట్టు చెబుతున్నప్పటికీ ఇరాన్‌పై అనేక ఆర్థిక ఆంక్షలు విధించడమే కాకుండా ఇరాన్‌కు మద్దతిస్తున్న దేశాలపై ఇజ్రాయిల్ ద్వారా లెబనాన్ లాంటి దేశాలపై దాడులకు అమెరికా ఉసిగొల్పడంలాంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. యుద్ధం వద్దు శాంతి పరిష్కారం అనే ఆలోచనతో ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటాలు నిర్వహించి ఆధిపత్యం చెలాయించాలనుకున్న దేశాల విధానాలకు చరమగీతం పాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్ , ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి చెట్టుకింది శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సురేందర్, నాయకులు ఎం.శ్రీమాన్, చైతన్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటాలు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటాలు నిర్వహించే పార్టీ సిపిఐ అని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. గురువారం సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని డివిజన్ 1లో ఖానాపూర్ రోడ్డు భాగ్యనగర్ ప్రాంతంలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం పోరాడటమే లక్ష్యమని, అందుకు ప్రజలకు చేరువకావడానికి ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కుల, మత, అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పంటలకు కనీస మద్దతు ధర లేక, ఎరువులు, విత్తనాల ధరల పెరుగుదలతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, కాంట్రాక్ట్ వ్యవస్థ వల్ల వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. విద్యా, వైద్యరంగాలు సామాన్యులకు భారం అవుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్యులు బతుకలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇల్లులేని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందని పశ్య పద్మ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నాయకులు పి.ముత్యాలు, పి.రంజిత్, బి.రఘురాం, ఫిరోజ్‌అలీ, రమేష్, కుశాల్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** విద్యారంగానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు, శాశ్వత భవనాలు కల్పిస్తోందని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని కూకట్‌పల్లి ప్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.8 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కల్సి శంకుస్థాపన చేసారు. వీటిలో రూ.4.95కోట్లతో పిఎం ఉషా గ్రాంట్ నిధులతో కళాశాల జి ప్లస్ 1 భవనం, రూ 2.84 కోట్లతో డిఎం ఎఫ్టీ నిధులతో జి ప్లస్ 2 అదన పు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పలు అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకొని ఉన్నతస్థాయిని అందుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చందన, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల పథకం- పేదలకు వరం

### కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు నిలువ నీడను అందించే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మల్కాజిగిర కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్‌నగర్ డివిజన్‌లోని ప్రగతినగర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశ కార్యక్రమంలో గురువారం హౌజింగ్ బోర్డు ఎఇ శ్రీహరి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్‌తో కల్సి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ఈ పథకం కింద ఆర్థిక సాయంగా ప్రభుత్వం అందించే రూ.5 లక్షలు ఎంతగానో ఆదుకొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు శ్రీనివాస్, నాయకం భాస్కర్, అజయ్‌కుమార్, సాయి కృష్ణ, సోమేశ్‌చారి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ షాపులను స్థానికులకు కేటాయించాలి

### బిజెపి అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ డబల్ బెడ్ రూమ్ సముదాయంలో షాపులను స్థానికుల కేటాయించాలని బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దుండిగల్ సర్కిల్ పరిధి దుందిగల్ గ్రామం, గండిమైసమ్మ చౌరస్తా, బహదూర్‌పల్లిలో డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఉన్న స్థానికులకు మాత్రమే షాపులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని అధికారులు ఆన్లైన్ టెండర్ ద్వారా షాపుల వేలం పెడితే ఎక్కడో ఉన్నవారికి షాపులు అక్కడ కేటాయింపు జరిగితే వారు అక్కడికి వెళ్లి షాపు నడపడం ఇబ్బందులకు గురవుతారని, ఎక్కడి నుండో డబల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న స్థానికులు ఉపాధి లేక అక్కడ దూరం వెళ్లి ఉద్యోగాలు వ్యాపారాలు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కావున స్థానికులకు డబల్ బెడ్ రూమ్ సముదాయంలో ఉన్న వారికి మాత్రమే ఓపెన్ టెండర్లు పెట్టి స్థానికులకు కేటాయిస్తే వారికి ఉపాధి, వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

## అతివేగానికి నిండు ప్రాణం బలి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. అజాగ్రత్తతో నియమ నిబంధనలను పట్టించుకోకుండా ఓ కుటుంబాన్ని రోడ్డున పడేసి వారికి కన్నీళ్లు మిగిల్చిన సంఘటన నవాబుపేట మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతుడు కోళ్ల నాగేష్ తండ్రి పుల్లయ్య వయస్సు 51 సంవత్సరాలు నివాసం మంతటి గ్రామం, మండలం నాగర్ కర్నూల్ జిల్లా నవాబ్ పేట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో డ్రిప్ పైప్ లైన్ ఫిట్టింగ్ పని పూర్తి చేసుకుని తిరిగి వికారాబాద్ వెళుతుండగా మార్గమధ్యలో నాగిరెడ్డిపల్లి గ్రామ గేటు వద్ద మోత్కుపల్లి గ్రామానికి చెందిన మదిరె నరసింహారెడ్డి తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపి మృతుడు కోళ్ల నాగేష్ యొక్క ద్విచక్ర వాహనానికి టక్కరు ఇవ్వగా మృతుడు తీవ్ర గాయాలతో ఉండగా నవాబ్ పేట్ పోలీసు వారు వెంటనే స్పందించి వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రోజు ఉదయం మరణించడం జరిగింది. ఈ విషయంపై మృతుని కుమారుడు కోళ్ల చంద్రశేఖర్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గిరి అన్నారు అన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, కుంటుంబ యజమాని తెలిపిన వివరాల ఇలా చందాసభ పాషామియా కుటుంబంతో హాస్పిటల్‌కి వెళ్లారు. ఇంటికి తాళంవేసి వెళ్లగా సోమవారం అర్ధరాత్రి దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లో 3తులాల బంగారం 1లక్ష50వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం వచ్చేసరికి తాళం పగలగొట్టిన ఇంటిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ తో పరిశీలించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ధరూర్ మండల కేంద్రంలో కేరెల్లి గ్రామంలో, వికారాబాద్ మున్సిపల్ లోని రాజీవ్‌గృహకల్ప, కూరగాయల మార్కెట్ రైతుబజార్ సమీపంలో మొత్తం 5 దొంగతనాలు జరిగినట్లు తెలుస్తుంది.

# అలుపెరుగని పోరాటాల ధృవతార 'చంద్ర'

### రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు విఎస్. బోస్



**ప్రజాపక్షం/కాప్రా:** పీడిత, తాడిత జనోద్ధరణ కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన కమ్యూనిస్టు ఉద్యమ ధృవతార చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ కొనియాడారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 32వ వర్ధంతి సందర్భంగా నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆశయాల కోసం తన యావదాస్తిని పేదలకు పంచి పెట్టిన మహనీయుడన్నారు. అగ్రనాయకులు మఖ్దూం మోయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, నారాయణరెడ్డిలను సమన్వయపరుస్తూ తెలంగాణా సాయుధ పోరాటంలో ఆయన పాత్ర కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాల మేరకు ముందుకు వెళ్లాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్రావు, సత్యప్రసాద్, ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, నరసింహరావు, ఆరుట్ రాజ్‌కుమార్, రాజేష్, కళ్యాణ్ , గీత, రజని, మాళవిక, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు దుబ్బకోటి రాజయ్య మృతి

### నివాళులు అర్పించిన సిపిఐ రాష్ట కంట్రోల్ కమిషన్ మెంబర్ డిజి.సాయిలుగౌడ్





**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామానికి చెందిన మేడ్చల్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు దుబ్బకోటి రాజయ్య మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ మెంబర్ డిజి సాయిలుగౌడ్ అన్నారు. గురువారం మేడ్చల్‌లోని శ్రీరంగవరం గ్రామానికి వెళ్లి దుబ్బకోటి రాజయ్య పార్థివ దేహంపై సిపిఐ జెండాను కప్పి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1981 నుంచి సిపిఐ లో సభ్యుడిగా, కార్యకర్తగా కొనసాగారని మేడ్చల్ మండల పార్టీ సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు.

శ్రీరంగవరంతో పాటు వివిధ గ్రామాల్లో కార్మికుల ఐక్యత, కార్మికుల హక్కులు, కార్మిక సంఘాల బలోపేతానికి, ప్రజా సంఘాల ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ మనుగడను కాపాడుతు మేడ్చల్ నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఎన్నికల్లో పార్టీ ఉనికిని ప్రజల సమస్యలపై పోరాడి జీవితం చివరి వరకు పార్టీలో కొనసాగారని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడు తు తన స్వగ్రామంలో తుది శ్వాస విడిచారని చెప్పారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తు వారి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల సిపిఐ కార్యదర్శి నారెడ్డి శశిధర్‌రెడ్డి, సిపిఐ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

### జర్నలిస్టుల సంక్షేమానికి సంపూర్ణ సహకారంఃఎమ్మెల్యే బిఎల్ఆర్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** జర్నలిస్టుల సంక్షేమానికి తన సంపూర్ణ సహకారాన్ని అందజేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రాధిక చౌరస్తాలోని పరివార్ హోటల్లో పండగ వాతావరణంలో జరిగిన కాప్రా ప్రెస్‌క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బండారి లక్ష్మారెడ్డితో పాటు నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌లు హాజరై అధ్యక్షులు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సురేష్, కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. పదవులను బాధ్యతగా భావించినప్పుడే న్యాయం చేయకలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకట్‌రెడ్డి, కాప్రా డిసి శ్రీహరి, మాజీ ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, బొంతు శ్రీదేవి, పన్నాల దేవేందర్‌రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, శీనివాస్‌రెడ్డి, అంజయ్య, టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, మోతే వెంకట్‌రెడ్డి, జి బాల్‌రాజ్‌గౌడ్, టిఫ్ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ చైర్మన్ రోషిరెడ్డి, లయన్స్ గవర్నర్లు ఇన్నారెడ్డి, సురేష్, శేఖర్‌రెడ్డి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**జర్నలిస్టులకు కుట్టు మిషన్లు అందజేసిన లయన్ మాణిక్‌రెడ్డి**

జర్నలిస్టుల కుటుంబాలకు అండగా ఉంటానని లయన్ మాణిక్‌రెడ్డి అన్నారు.కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సందర్భంగా జర్నలిస్టుల కుటుంబాలకు మాణిక్‌రెడ్డి తన వంతుగా 30 కుట్టు మిషన్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నగర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు జ్యోతిర్మయాచారి,శ్రీనివాస్,కోశాధికారి సురేష్, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాల్‌రాజ్‌గౌడ్, సలహాదారులు చంద్రమౌళి, కెసి మోహన్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి : కలెక్టర్ మనుచౌదరి





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని పోటీవాతావరణంలో ఆనుకొన్నది సాధించేందుకు ప్రణాళికాయుక్తంగా ముందు కెళ్లాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఉద్బోధించారు.గురువారం కూకట్‌పల్లిలోని తెలంగాణా మైనారిటి బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యా బోధన ఏ విధంగా ఉన్నదంటూ ప్రశ్నిస్తూ మౌలిక సదుపాయాలు, భోజన పదార్థాలు మెనూ ప్రకారం నాణ్యతతో ఉంటున్నాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. అక్కడి కిచెన్‌లోకి వెళ్లి వంట సామగ్రి, వండిన పదార్థాలు, వంట విధానాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు కలిసి భోజనం చేసారు.

# కలెక్షన్ కింగ్స్ జిపిఒ, విఆర్‌ఎలు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని జిపిఒ విఆర్‌ఎ కలెక్షన్ల బాగోతం బట్టబయలయిన ఆడియో బయటికి రావడంతో రెవెన్యూ అధికారులు అలర్ట్ అయ్యారు. అవినీతికి పాల్పడిన అధికారుల్లో అలజడి మొదలయ్యింది. వివరాల్లోకి వెళితే సర్వే నెంబర్ 120 డాక్టర్ బస్తీలో కొందరు అక్రమార్కులు మున్సిపల్ అనుమతులు ఉన్నయంటూ 58, 59 జీవోల పేరుతో ఏకంగా జి + 4 నాలుగు అంతస్తులతో ఎటువంటి సెట్ బాగ్స్ వదలకుండా భారీ అక్రమ కట్టడాన్ని మొదలుపెట్టారు. ఈ నిర్మాణం వెనుక వీఆర్‌ఎ గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి, అక్రమాలను అరికట్టడం, సమీకృత భూభారతి పోర్టల్ ద్వారా పారదర్శకమైన సేవలను అందించడం మర్చిపోయి అక్రమ సంపాదనే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారి (జిపిఒ)తో కలసి పెద్దమొత్తంలో ముడుపులు మూటకట్టుకున్నారంటూ నిర్మాణదారుడి నుంచి ఫోన్ ఆడియో వైరల్ అయ్యింది. అదే విధంగా సర్వే నెంబర్ 120/23లో అధికార పార్టీకి చెందిన మైనారిటీ నాయకుడు 60 గజాల స్థలంలో పాగావేసి చిన్నపాటి బేస్మెంట్ నిర్మాణాన్ని నిర్మించాడు. మొదట్లో స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు వెంటనే ఆ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేశారు.

అనంతరం కూల్చిన కొద్ది రోజుల తర్వాత ఆ స్థలానికి 59 జిఒ ఉందంటు నకిలీ దస్తావేజులు సృష్టించి నిర్మాణాన్ని పూర్తి చేశాడు. గత ప్రభుత్వం కొంతవరకు 58, 59 జిఒలను మంజూరు చేయడంతో కొందరు నిరుపేదలు ఇండ్లు కట్టారు. మిగతా కొంతవరకు ఖాళీ స్థలాలు అలాగే మిగిలి ఉండడంతో కొందరు భూ కబ్జాదారులు రేకులతో కాంపౌండ్ వాల్, మరోపక్క ఏకంగా రేకులతో ఇంటి నిర్మాణాన్ని చకచకా పూర్తిచేసి కబ్జాకు తెరలు తీశారు. విలువ చేసే ప్రభుత్వ భూములు కళ్ళముందే కబ్జాలకు గురవుతుంటే అధికారులు మాత్రం తమ వంతు బాధ్యతలు నెరవేర్చడం లేదన్న అపవాదు వెలబడుతుంది. అక్రమ నిర్మాణాలను కొనసాగిస భూ కబ్జాలు అంతా బహిరంగనే జరుగుతున్న అధికారు లు మాత్రం తనకి ఏమీ తెలియనట్లు నటించడం పరిపాటిగా మారింది. ఇదంతా రెవెన్యూ అధికారులు కాంట్రాక్టు మాట్లాడుకొని సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముందుగా భూ బకాసురులు రెవెన్యూ అధికారులతో బేరం కుదిరించుకొని అంతా ఓకె అనుకున్న తర్వాతే కబ్జాదారులు ప్రభుత్వ భూమిని మింగేయడానికి బరిలోకి దిగుతున్నట్లు స్థానికంగా గుసగుస లు వినబడుతున్నాయి. ఇద్దరి అవినీతి సిబ్బందిపై శాఖ పరమైన చర్యలకు శ్రీకారం చుడుతున్నట్టు సమాచారం

**మండలం తాసిల్దార్ ఎస్.రాజేశ్వర్ రెడ్డి వివరణ**

డి.పోచంపల్లి, చంద్రశేఖర్ రెడ్డి నగర్ సర్వే నెంబర్ 120లో జరుగుతున్న ప్రభుత్వ భూములు కబ్జాలపై దుండిగల్ గండి మైసమ్మ ఎమ్మార్వో ఎస్.రాజేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా ఆయన పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని ఆయా ప్రాంతం సంబంధిత అధికారులతో విచారణ జరిపించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అక్రమాలను, ఉపేక్షించబోమని ఎమ్మార్వో వెల్లడించారు.





## వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** వికలాంగుల సంక్షేమం, ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు పరుస్తోందని, వీటిని సద్వినియోగపరచుకోవాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. గురువారం ఎంఎంసి కాప్రా మున్సిపాలిటి కార్యాలయంలో వికలాంగుల సమస్యల సత్వర పరిష్కార లక్ష్యంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 100 ప్రాంతాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తూ వికలాంగుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నుండి వచ్చిన 96 ధరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించాలన్నారు. వివాహాలు చేసుకొన్న వధూవరులు ఇద్దరూ వికలాంగులైతే కళ్యాణలక్ష్మి పథకం కింద అదనంగా రూ. 2 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తున్నామని, ఇళ్ల స్థలాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, ఉన్నత విద్యలో 5, కోర్టు ఉద్యోగాల్లో 4, రాజీవ్ వికాసం పథకంలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. 40 శాతం వరకు వికలాంగులైతే ఉచితంగా సహాయక ఉపకరణాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంక్షేమ అధికారి, కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్, ఆల్వాల్ బిఆర్‌బి కోఆర్డినేటర్, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, టివిహెచ్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తింకొండ కిరణ్ తదిరులు పాల్గొన్నారు.

## పేద వర్గాల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

### రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర
### సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పేద వర్గాల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని వారి సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేస్తామని రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్‌లు అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలో గురువారం ఆర్జికే కాలనీలో సిపిఐ నాయకులు పెద్ద ఎత్తున ఇంటింటికి తిరిగి సిపిఐ చేసిన పోరాటాలను తెలుపుతూ ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లొట్టి ఈశ్వర్, కల్లూరి జయచంద్రలు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో 142 కోట్ల మందికి సమ సమాజ నిర్మాణానికి జరిగే మహా ఉద్యమంలో వేల వీర కిరణాలు తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజల పక్షం ప్రశ్నించే గొంతుకై దేశ స్వతంత్రం పోరాటంలో గాని ప్రజల చేత ప్రజల కొరకు ప్రజాస్వామ్య పద్ధతులు ఎన్నుకోబడ్డారని అన్నారు.140 కోట్ల మంది పక్షాన గొంతెత్తి నినదించిన బంధుకులై తిరగబడి చట్టసభలో చేసిన చట్టాలే నేటికీ మనదేశంలో కొనసాగుతున్నాయి. ఉద్యోగ భద్రత కార్మికుల యాక్ట్ 44 చట్టాలు రైతులకు భద్రత రైతు గిట్టుబాటు ధరలు కల్పించడంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర దేశంలోనే 142 కోట్ల ప్రజల గుండె చప్పుడు 100 సంవత్సరాలుగా దోపిడీ పాలక వర్గాలను ఎదిరించి ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ స్ఫూర్తితో ఇంటింటికి కరపత్రం ద్వారా ప్రజల దగ్గరకు వెళుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు సదాశివ, మురళి, బి శ్రీనివాస్ చౌదరి, సంకుల అంజి, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడానికి దారిచూపే ఎన్ఎస్‌యుఐ : పీసరి మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు సేవ చేయడానికి దారిచూపే న్యాయకత్వాన్ని కల్పించిన ఎన్ఎస్‌యుఐ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ నాయకులకు ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా దేవరయాంజాల్ గ్రామానికి చెందిన పీసరి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత 2007 సంవత్సరం నుంచే కళాశాలలో విద్యార్థి నాయకుడిగా ఎదిగి కళాశాల ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశానని అన్నారు. 2009లో మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశానని చెప్పారు. 2010లో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2015లో ఎన్ఎస్‌యుఐ సంస్థాగత ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవచేసే అవకాశం లభించిందన్నారు. ఈ ప్రయాణంలోనే న్యాయకత్వం, సేవా భావం, కట్టుబాటు వంటి విలువలను నేర్చుకున్నానని వివరించారు. అనంతరం 2019లో రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా పనిచేశానని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసే అవకాశం లభించిందని అన్నారు. విద్యార్థి శక్తి దేశ భవిష్యత్తుకు పునాది వంటిదని పేర్కొన్నారు.



## కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** 99 రోజులు ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం వికారాబాద్ మున్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య పాల్గొని ప్రతి రోజు ఉదయాన్నే తమ విధులు నిర్వహిస్తు పట్టణమంతా పరిశుభ్రం చేస్తు సేవలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, కార్మికులు ఎల్లపుడు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం గేరిగేంట్‌పల్లి లో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందని ప్రతి ఒక్కరిలో సేవా గుణం ఉండాలని జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో బక్కొల బాలమణి 8వ వర్ధంతి సందర్భంగా బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిఎన్ రామ్మోహన్ ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి విచ్చేసి బక్కో బాలమణి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వైద్య శిభిరం ప్రారంబించారు. ఈ శిభిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు షఫీ, మసూద్, మాజి ఎంపిటిసి బక్కొల కల్యాణి, రామాలయం మాజి ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ సభ్యులు శర్మ, రమేష్, మధన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధేయంగా కృషి చేస్తా

### మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు

**ప్రజాపక్షం /పరిగి :** అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తాం అనిమున్సిపల్ వౌస్ చైర్మన్ మనుమంతు అన్నారు.పరిగి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు న్యామత్ నగర్ లో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు గురువారం పైపులైన ఏర్పాటుచేయించిన వైస్ చైర్మన్ ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే సహకరంతో మున్సిపల్ లోని ముడవ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. ప్రజలు నాపై సమ్మకానికివమ్ము చేయకుండా వార్డులో ఐదు సంవత్సరాల పాటు వీదిలైట్లు ,మంచినీటి సౌకర్యం డ్రైనేజీలు ,సిసిరోడ్లు నిర్మాణ పనులు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ ,సురేష్ ,అబ్దుల్ తదితరులు పాల్గోన్నారు.



## 18న హిందూ సమ్మేళనం

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** గండి మైసమ్మ బస్తీలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని రమణ మహర్షి ట్రస్ట్ అధ్యక్షుడు ఏమండ్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈ నెల 18న శనివారం సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్నట్లు ఏమండ్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. హిందూ సమ్మేళనంలో హిందూ బాంధవులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక పెద్దలు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలక్టరేట్ ఆవరణలో గురువారం ఆయన సమతా క్యాంటీన్ ప్రారంభించారు. అనంతరం అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సహాయ చెక్కులను, గుర్తింపు పత్రాలను, దివ్యాంగులకు త్రీవీలర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అన్ని వర్గాలకు సంక్షేమం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సమతా కిచెన్ ద్వారా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఇతర అట్టడుగు వర్గాల వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 10.47లక్షల మంది దివ్యాంగులు, 10 లక్షల మంది వృద్ధులు ఉన్నారని, ఇందులో హైదరాబాద్ జిల్లాలో రెండు లక్షల మంది వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 50వేలకు పైగా సదరన్ సర్టిఫికెట్లు, అయిదు వేల యుడిఐడి కార్డులు జారీ చేశామని మంత్రి చెప్పారు. అలాగే 29,902 మంది దివ్యాంగులకు పింఛన్లు అందించామన్నారు. జిల్లాలో 404 మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. నిర్మాణ్ సంస్థకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డకు చేయూత



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** కాలేయ వ్యాధి సమస్యతో బాధపడుతున్న పేదింటి ఆడబిడ్డకు రంగారెడ్డి జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య చేయూతనందించారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నక్క జంగయ్యగౌడ్ కూతురు అనూష కాలేయం సమస్యతో బాధపడుతోంది. ఆరోగ్యం బాగుపడాలంటే రూ.80లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన జంగయ్యగౌడ్ అంత ఖర్చుపెట్టి వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడం తో విషయం తెలుసుకున్న కొత్తకుర్మ సత్తయ్య గురువారం రూ.25వేల చెక్కును జంగయ్యకు అందించారు. అలాగే ప్రభుత్వంతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వైద్య ఖర్చులకు అయ్యే డబ్బు సమకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. జంగయ్యకు సాయం చేయదలిచినవారు ఫోన్ నెంబర్ 9347096677ను సంప్రదించాలని సూచించారు.

## ఎల్‌పిజికి ప్రత్యామ్నాయంగా నాచురల్ గ్యాస్ పైప్ లైన్

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్‌పిజి గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నాచురల్ గ్యాస్‌ను వ్యవస్థీకరించడానికి అన్ని శాఖలు సహకరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె.చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్ లో పైప్ లైన్ నాచురల్ గ్యాస్‌ను వ్యవస్థీకరించడంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్ వినియోగములో ఎల్‌పిజి గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించే పైప్‌లైన్ గ్యాస్ వినియోగానికి రోడ్, నేషనల్ హైవే ఇతర ప్రాంతాలలో నిర్మాణ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. పైప్‌లైన్ గ్యాస్ వినియోగానికి ప్రజలు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలని, నిర్మాణపరంగా వచ్చే ఆటంకాలను పరిష్కరించే విధంగా అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో పైప్‌లైన్ గ్యాస్ వినియోగం అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వి.సురేశ్ మోహన్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత, మిషన్ భగీరథ ఎస్ఇ ఎం.ఆంజనేయులు, ఇఇ ఆర్.రాజేశ్వర్, పంచాయతీరాజ్ ఇఇ శ్రీరామ్ రాములు, ఇంజనీరింగ్, పరిశ్రమలశాఖ, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీని బలోపేతం చేసేందుకు కృషి

రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. గురువారం నాంపల్లిలోని ఇందిరా భవన్‌లో రంగారెడ్డి జిల్లాలో డిస్ట్రిక్ట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ గురించి డిసిసి అధ్యక్షులు, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎఐసిసి, సిడబ్ల్యుసి నాయకులు చల్లా వంశీచంద్‌రెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి జిల్లాలో పార్టీ విస్తరణ ఎలా జరగాలో అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో పార్టీ వ్యవహారాలను, ఎన్నికల వ్యూహాలను స్థానిక సమస్యలను పర్యవేక్షించడానికి డిస్ట్రిక్ట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ దోహద పడుతుందన్నారు. కీలక కమిటీ నియమకం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లాలోని ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కంటెస్టెడ్ క్యాండెట్స్, కీలక నాయకులు ఇందులో సభ్యులుగా ఉండి, స్థానిక ఎన్నికలు, పార్టీ బలోపేతంపై నిర్ణయాలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల నుండి 26 మందితో డిస్ట్రిక్ పొలిటికల్ అఫైర్స్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమం ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, కాంటెస్ట్ ఎమ్మెల్యేలు మధు యాష్కి గౌడ్, జగదీష్ గౌడ్, ఆర్‌జిపిఆర్‌ఎస్ అధ్యక్షులు సిద్దేశ్వర, సేవాదళ్ అధ్యక్షులు రమాకాంత్, కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, మున్సిపల్ చైర్మన్ దేవరీ సమత, సోనియా దర్శన్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి భీంభారత్, ఎస్‌టి సెల్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో జాప్యం ఎందుకో చెప్పాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం గొల్లపల్లి..చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా వనపర్తి జిల్లాలో నిర్వహించే బహిరంగ సభకు వెళ్తున్న హరీష్‌రావుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. షాద్‌నగర్ డివిజన్‌లోని లక్ష్మీదేవిపల్లి వల్ల రిజర్వాయర్ నిర్మాణం పనులు చేస్తామని చెప్పి నేటి వరకు పనులు ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ హామీలుగానే మిగులుతున్నారే తప్పా అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందించాల్సింది పోయి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, రాజావరప్రసాద్, రాంబాల్‌నాయక్, శ్రీకాంత్, నవీన్‌లు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనులకు శ్రీకారం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాలిటెక్నిక్ కళాశాలను నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గరువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో నిర్మించనున్న పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ స్థానికంగా పాలిటెక్నిక్ కళాశాలకు భవనం లేక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని వివరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను దూరం చేసేందుకు ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు ఆకాంక్షించారు. విద్యారంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పీఠ వేశారని, కార్పోరేట్ స్థాయిలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఆశించిన దానికంటే పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరుగుతుందని గుర్తు చేశారు. విద్యారంగ సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, లింగారెడ్డి గూడ సర్పంచ్ ఎంపి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, గ్రామస్తులు కందూరి అంజయ్య గౌడ్, చిలకమారి నర్సింహులు, శ్రీనునాయక్‌లు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ బాధిత రైతుల దీక్షలు

**ప్రజా పక్షం/యాచారం :** ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల సమస్యలను పరిష్కరించని పక్షంలో అందోళన చేస్తామని గిరిజన రైతులు హెచ్చరించారు. రోడ్డు నిర్మాణ బాధితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 24 రోజుకు చేరాయి. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో భూములను తీసుకోని ఇబ్బందులకు గురి చేస్తుందని ఇప్పుడు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం మా భూములు ఇవ్వాలంటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. బలవంగా భూసేకరణ చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# చంద్ర రాజేశ్వరరావు ఆశయాలు సాధిద్దాం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్వాతంత్ర సమరయోధుడు, సాయుధ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించడానికి కృషి చేయాలనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. గురువారం సిపిఐకి సుదీర్ఘ కాలం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి హాజరై రాజేశ్వరావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ, ఆధిపత్య ఆలోచన విధానం లేకుండా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో భూమిలేని నిరుపేదలకు భూమి కోసం సామ్రాజ్యవాదనికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాడని గుర్తు చేశారు. ఆయన పని చేసే సమయంలో "నాకు ఆస్తిపాస్తులు ఏమి లేవు, నేను ఎవరికి ఏమి ఇవ్వాల్సిన పని లేదు, ఎవరి నుండి ఏమి తీసుకోలేదనే" మాట ఎంతగానో అక్కర్శించిందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, సిపిఐ నాయకులు సాయిలు, పేరాల గోపి, వినోద్ నాయక్, సైదులు ముదిరాజ్, రాములు, గణేష్, దేవమ్మ, క్రాంతి, రమేష్ నాయక్,, ఎ.లక్ష్మీ, లింగం, ఆవుల యాదగిరి, ప్రియా, క్రాంతి, లక్ష్మి, సుధాకర్, అశోక్, శోభన్, అన్నపూర్ణ, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకు చేయూతనివ్వండి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకు చేయూత నివ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి కోరారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎల్‌బినగర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం హైకోర్టు కాలనీ, రైతుబజార్‌లో సిపిఐకి చేయూత నివ్వండి అనే నినాదంతో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవం నుండి నేటి వరకు పేద, బడుగు బలహీన వర్గాల పక్షానే నిలబడి పోరాడుతోందని గుర్తు చేశారు. ఎర్ర జెండా ఉద్యమాలకు బడా కార్పోరేట్ల నిధులు ఉండవని, కేవలం సామాన్య ప్రజలు, శ్రమజీవులు ఇచ్చే స్వచ్ఛంద వారాళాలే ఈ పోరాటాలకు ప్రాణవాయువు అని వారు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరుపేదల హక్కుల కోసం నిరంతరం వీధుల్లో ఉండి పోరాడే సిపిఐకి ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఆర్థిక సాయం అందించి అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి కర్నె సుజాత, మర్రి శోభన్, హైకోర్టు కాలనీ డివిజన్ కార్యదర్శి చెంది వెంకట్, అధ్యక్షులు గోల్కొండ నాగరాజు, ఎఐటియుసి హయత్ నగర్ మండల కార్యదర్శి పట్టేటి శేఖర్, మహిళా నాయకురాలు కొప్పుల సరిత, సౌజన్య, సుమతి, శివ జ్యోతి, యమున, సౌజన్య, సుజాత, కళ్యాణి, కవిత, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్:** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం షాబాద్‌లో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పార్టీ అభ్యున్నతికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వంటగ్యాస్, డిజిల్, పెట్రోల్ నిత్యవసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు అండగా పని చేస్తున్న సిపిఐకి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామస్వామి, రైతు సంఘం నాయకులు ప్రభులింగం, మహిళ అధ్యక్షురాలు మంజుల, మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, నాయకులు నక్కల జంగయ్య, రఘురాం, రుక్కయ్య, ఆనందం, రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎంఆర్ఎఫ్

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నంది గామ మండలంలోని అప్పారెడ్డిగూడకు చెందిన సబ్బా అనసూయ, దివిటీ అంజయ్య, నాగుల నరసింహా, బండోనిగూడకు చెందిన రాగులపల్లి జగన్, ఈదుపల్లికి చెందిన రాళ్లబండి పద్మమ్మ, మామిడిపల్లికి చెందిన కారె సింధు ప్రియా, పిట్టలగూడకు చెందిన గంగిశెట్టి పురుషోత్తంలకు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హన్మంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు, సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌళిక సౌకర్యాలు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** చిన్న కుంటబడి స్కూల్‌ను అప్పర్ ప్రైమర్ స్కూల్‌గా ఏర్పాటు చేసి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిశోర్ కోరారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

## ఆరోగ్య పరిరక్షణకు వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆరోగ్య పరిరక్షణకు వైద్యసేవలను న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలోని బార్ అసోసియేషన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.స్వాతిరెడ్డి ఆదేశాల మేరకు న్యాయవాదులకు, కక్షదారులకు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి వైద్య సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బంది కృషి చేయాలని కొత్తూరు సిఐ నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రం సమీపంలోని ఏఓసిఎల్ సంస్థ ప్రాంగణంలో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ అధికారులు, ఐఓసిఎల్ భద్రత సిబ్బంది, నాట్కో సంస్థ సెక్యూరిటి సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నా

## భాష మార్చుకోకపోతే రాజకీయ భవిష్యత్తు ఉండదు



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** భాష మార్చుకోకపోతే రాజకీయ భవిష్యత్తు ఉండదని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ అన్నారు. గురువారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కోహెడలో బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, బిందు రంగారెడ్డి, కళ్యాణ్ నాయక్, సామ శ్రీనివాస్ రెడ్డి, చక్రవర్తి గౌడ్, కిషన్ గౌడ్, బుడ్డ బాబు, కోటేశ్వరరావు, ధనుంజయ్ గౌడ్, పల్లపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**ప్రజాపక్షం/యాచారం :** బిజెపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. గురువారం యాచారం మండలానికి చెందిన బిజెపి నాయకులు రాంచందర్ రావును కలిసి వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొండా మధుకర్‌రెడ్డి, నందివనపర్తి గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, పురుషోత్తం, దేవరకొండ ఈశ్వర్, వంగూరి సాయి, మారగోని శేఖర్ పాల్గొన్నారు.

## చలివేంద్ర ఏర్పాటు




**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యకేటేడ్ యూత్ అసోషి యేషన్ అద్వర్యంలో గురువారం వేసవిని దృష్టిలో ఉంచుకోని నిరుపేదల దాహన్ని తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు నిట్టు బిరప్ప, మూలి రమేశ్, నూకం శ్రీలత, మహేంధర్, యంజాల విజేత చంద్రకాంత్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
10-04-2026
www.prajapaksham.in

తెలంగాణ సామాజిక నేపథ్యంతో రాబోతున్న చిత్రం 'సర్కార్ బాయి'. శ్రీరామ్ నిర్మల, సాయి కీర్తన హీరోహీరోయిన్లుగా, లారా దర్శకత్వంలో రూపొందుతున్న 'సర్కార్ బాయి' చిత్రానికి సికింద్రాబాద్ గణేష్ టెంపుల్లో పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

రీల్

# 'బిగ్ బాస్' ఫేమ్ అర్జున్ హీరోగా 'పరమపద సోపానం'



'అర్ధనారి', 'తెప్ప సముద్రం', 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ అంబటి.. అటు తర్వాత బుల్లితెరపై 'బిగ్ బాస్' రియాలిటీ షోతో ఫ్యామిలీ ఆడియన్స్‌కి మరింత దగ్గరయ్యారు. ప్రస్తుతం రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'పెద్ది'లో కూడా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు అర్జున్ అంబటి. అతను హీరోగా రూపొందిన లేటెస్ట్ మూవీ 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ సినిమాని 'గణపర్తి శ్వేత' సమర్పణలో 'స్వయంభూ క్రియేషన్స్' సంస్థపై గణపర్తి నారాయణరావు తేలప్రోలు ప్రసన్న ఆంజనేయులు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. పులగం సుప్రియ సహ నిర్మాత. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ 'పరమపద సోపానం' చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు.అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు నాగ శివ. ఇక మాస్ మహారాజ్ రవితేజ 'ఈగల్' వంటి భారీ బడ్జెట్ సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న డేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన 'చిన్ని చిన్ని తప్పు లేవో' 'భూమ్ భూమ్' వంటి లిరికల్ సాంగ్స్‌కి అలాగే టీజర్‌కి విశేషాధారణ లభించింది. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ తాజాగా చిత్ర బృందం ఒక పోస్టర్‌ను వదిలారు. ఇందులో హీరో అర్జున్ అంబటి లుక్ ఇంటెన్స్ ఫీల్ కలిగిస్తుంది. అలాగే కథ, కథనాలపై కూడా అవగాహన కలిగించేలా ఉంది. ఈ చిత్రానికి దర్శకత్వం : నాగ శివ, నిర్మాతలు : గణపర్తి నారాయణరావు, తేలప్రోలు ప్రసన్న ఆంజనేయులు, సహ నిర్మాత : పులగం సుప్రియ, లైన్ ప్రొడ్యూసర్ : పసుపులేటి సౌమ్య, సంగీతం : డేవ్ జాండ్, సినిమాటోగ్రఫీ : ఈశ్వర్.

# ఆహాలో 'డార్క్ నైట్'




పూర్ణ ప్రధాన పాత్రలో రూపొందిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం డార్క్ నైట్. జి.ఆర్. ఆదిత్య ఈ చిత్రానికి కథ రాసి దర్శకత్వం వహించారు. పూర్ణ ఇందులో హేమ పాత్రలో నటించి కథకు కీలకంగా నిలిచే పాత్రను పోషించారు. ఆమెతో పాటు త్రిగుణ్ (ఆదిత్ అరుణ్) రోషన్‌గా, విధార్థ్ అలెక్స్‌గా, సుభాశ్రీ రాయగురు సోఫియా పాత్రలో నటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆధిత్యా, సంగీత దర్శకుడు మిస్కిన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రాన్ని పట్లోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో పి19 స్టూడియోస్ పతాకంపై సురేష్ రెడ్డి కొవ్వూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా ఇక ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు రెడీ అయ్యింది. ఏప్రిల్ 8 నుంచి ఈ మూవీ ఆహా తెలుగులో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో ప్రత్యేకమైన భావోద్వేగం ఉంటుంది. చిన్న చిన్న తగాదాలతో భార్య భర్తల మధ్య ఏర్పడే ఎడబాటు మరో విధంగా తడబాటుకు గురి కాకూడదని, దాంపత్య జీవితంలో భార్య భర్తల తప్పు ఒప్పులు పక్కన పెడితే, ఇరువురి మధ్య వచ్చే గ్యాప్‌లో మూడో వ్యక్తి వలన కాపురంలో ఎలాంటి ముసలం పుడుతుందో డార్క్ నైట్ చిత్రం చూస్తే తెలుస్తుంది. ముఖ్యంగా ఇప్పటి జనరేషన్‌లోనున్న యూత్‌కు సంభందించిన పలు అంశాలు హైలెట్‌గా వారి అనుభవాలను ప్రతిబింబిస్తాయి అని నటి పూర్ణ అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత సురేష్ రెడ్డి కొవ్వూరి.

## 'ఓ..సుకుమారి'
# షూటింగ్ పూర్తి

హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ఇప్పుడు ఈ ఇద్దరూకలిసి విలేజ్ ఎంటర్‌టైనర్ 'ఓ.! సుకుమారి' చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఫైట్స్ : అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.



## టాలీవుడ్‌లో
# 'మహిళా నిర్మాతల జోరు'

తండ్రి ఆశయాలు కొనసాగించడానికి వారసులుగా వారి మగ పిల్లలు ముందుకొస్తారు. కానీ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మాత్రం వారసురాలిగా ఆడపిల్లలు ముందుడగు వేశారు. పురుష పుంగవుల పెత్తనం కొనసాగే ఈ గ్లామర్ ఇండస్ట్రీలో మహిళలు నిలదొక్కుకోవడం అనేది ఒక సవాలు లాంటిదే. అయితే ఇక్కడ మనం చెప్పుకుంటున్న మహిళా నిర్మాతలు ఎవరూ కూడా సామాన్య కుటుంబానికి చెందిన వారు కాదు. ఒక మహిళా ఆర్థిక క్రమశిక్షణతో ఉంటే ఇల్లు, కుటుంబం ఎంత చక్కగా ఉంటుందో టాలీవుడ్‌లో ఈ నలుగురు మహిళా నిర్మాతల ఆర్థిక క్రమశిక్షణ చూస్తే సినిమాలు అంతే చక్కగా ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు. తెలుగు సినిమా పరిశ్రమలో అగ్ర నిర్మాతల ఆడ పిల్లలు ఇప్పుడు తమ తండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు నడుంబిగించారు. తండ్రి చూపిన అడుగుజాడల్లో నడుస్తూ సినిమా నిర్మాణ రంగంలో బాటలు వేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో నలుగురు మహిళా నిర్మాతల జోరు కొనసాగుతోందని చెప్పవచ్చు. తండ్రి ఆశయాలు కొనసాగించడానికి వారసు

లుగా వారి మగ పిల్లలు ముందుకొస్తారు. కానీ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మాత్రం వారసురాలిగా ఆడపిల్లలు ముందుడగు వేశారు. పురుష పుంగవుల పెత్తనం కొనసాగే ఈ గ్లామర్ ఇండస్ట్రీలో మహిళలు నిలదొక్కుకోవడం అనేది ఒక సవాలు లాంటిదే. అయితే ఇక్కడ మనం చెప్పుకుంటున్న మహిళా నిర్మాతలు ఎవరూ కూడా సామాన్య కుటుంబానికి చెందిన వారు కాదు. ఒక మహిళా ఆర్థిక క్రమశిక్షణతో ఉంటె ఇల్లు, కుటుంబం ఎంత చక్కగా ఉంటుందో టాలీవుడ్‌లో ఈ నలుగురు మహిళా నిర్మాతల ఆర్థిక క్రమశిక్షణ చూస్తే సినిమాలు అంతే చక్కగా ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు. తెలుగు సినిమా పరిశ్రమలో అగ్ర నిర్మాతల ఆడ పిల్లలు ఇప్పుడు తమ తండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు నడుంబిగించారు. తండ్రి చూపిన అడుగుజాడల్లో నడుస్తూ సినిమా నిర్మాణ రంగంలో బాటలు వేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో నలుగురు మహిళా నిర్మాతల జోరు కొనసాగుతోందని చెప్పవచ్చు.

## స్వప్న దత్




ప్రముఖ నిర్మాత చలసాని అశ్వని దత్ కుమార్తె స్వప్న దత్. ఈమెకు పద్దెనిమిదేళ్ల వయసులో ఉన్నప్పుడే నిర్మాతగా అడుగుపెట్టింది. ఆజాద్ అనే చిత్రానికి అసోసియేట్ నిర్మాతగా వ్యవహరించింది. తండ్రికి సంబధించిన వైజయంతి మూవీస్‌లో పలు చిత్రాలకు పని చేసిన స్వప్న దత్ 2014లో స్వప్న సినిమా బ్యానర్‌ను స్థాపించింది. సోదరి ప్రియాంక దత్‌తో కలిసి ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాను నిర్మించింది. ఈమె నిర్మించిన మహానటి సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికి తెలిసిందే. నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా మహానటి సినిమాను తెరకెక్కించారు. విదేశాల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్న స్వప్న వైజయంతి టెలివెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై లోకల్ టీవీని కూడా కొంత కాలం నడిపించారు.

## సుప్రియ యార్లగడ్డ



దివంగత నటుడు అక్కినేని నాగేశ్వర్ రావు మనవరాలు సుప్రియ యార్లగడ్డ. ఒక పక్క అన్నపూర్ణ స్టూడియో నిర్వహణ బాధ్యతలు చూసుకుంటూనే నిర్మాతగా కూడా తన స్థానాన్ని పదిలం చేసుకుంటోంది. సినిమా కుటుంబానికి చెందిన సుప్రియ హీరోయిన్‌గానే సినీ రంగ ప్రవేశం చేశారు. పవన్ కళ్యాణ్ సరసన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే సినిమాలో హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా అనంతరం నటన పట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆ తరువాత అన్నపూర్ణ స్టూడియోస్ సిఇఒగా బాధ్యతలు నిర్వస్తిస్తునే నిర్మాతగా కూడా ముందుకెళ్తున్నారు. గూఢచారి, జీ2, డెకాయిట్, అనుభవించు రాజా, బాయ్స్ హాస్టల్ వంటి సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. లూజర్ 2, వ్యూహం, మిస్ ఫర్‌ఫెక్ట్ వంటి వెబ్ సిరీస్‌లను కూడా సుప్రియ నిర్మిస్తున్నారు. నిర్మాతగా తన స్థానాన్ని పదిలపరచుకుంటున్నారు.

## సుస్మిత కొణిదెల



మెగా కాంపౌండ్ నుంచి వచ్చిన మరో నిర్మాత సుస్మిత కొణిదెల. మెగాస్టార్ చిరంజీవి కుమార్తె. ఈమె తొలుత కాస్ట్యూమ్ డిజైనర్‌గా సినిమా రంగ ప్రవేశం చేశారు. చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య, ఆచార్య, సైరా నరసింహా రెడ్డి, ఖైదీ నం. 150సినిమాలతో పాటు రామ్ చరణ్ నటించిన రంగస్థలం సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసింది. సాహు గారపాటితో కలిసి సేనాపతి అనే సినిమాకు నిర్మాతగా మారింది. ఇటీవల చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమాకు సుస్మిత నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా ఆమెకు నిర్మాతగా డబ్బులతో పాటు మంచి పేరు కూడా తెచ్చి పెట్టింది. షూట్ అవుట్ అటు ఆలేర్ అనే సిరీస్‌ను కూడా సుస్మిత నిర్మించారు.

## నిహారిక కొణిదెల



మెగాకాంపౌండ్ నుంచి నిర్మాతగా దూసుకొచ్చినఅమ్మాయి నిహారిక కొణిదెల. నటుడు, నిర్మాత, ఎపిలో ఎమ్మెల్సీ అయిన నాగబాబు కుమార్తె నిహారిక ఇప్పుడు చిన్న సినిమాల పాలిట పెద్ద నిర్మాతగా మారారు. ఢీ జూనియర్స్ అనే రియాలిటీ షోకు యాంకర్‌గా వ్యవహరించిన నిహారిక ఇప్పుడు పూర్తిగా నిర్మాణ రంగంపై ద్రుష్టి పెట్టింది. ముద్దపప్పు ఆవకాయ అనే షార్ట్ ఫిలింలో నటిగా కనిపించింది. ఒక మనసు అనే సినిమాలో కూడా నటించింది. యాక్టింగ్ అనే ఇష్టపడే నిహారిక ఇటీవల తాను నిర్మించిన రాకాస అనే సినిమాలో తీర్మార్ డ్యాన్స్ చేసి ప్రేక్షకులను అలరించింది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థను స్థాపించి హాలో వరల్డ్ అనే సినిమాను తొలిసారిగా పూర్తి స్థాయిలో నిర్మాతగా పనిచేశారు. ఈ సినిమాకు 2024లో తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు కూడా దక్కింది. ఇటీవల విడుదలైన రాకాస అనే సినిమాను నిర్మించింది.

# బిఆర్ఎస్‌పై విమర్శలకు జీవన్ రెడ్డి సమాధానం చెప్పాలి..

## ఆధారాలు ఉంటే రండి..'మంత్రి పొంగులేటి'ఆరోపణలపై చర్చిద్దాం..
## ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ ఉండబోదు...: టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎంఎల్‌సి టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించే ముందు,ఆయన గతంలో బిఆర్ఎస్‌పైన చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైన ఆరోపణలు చేయడం కాదని, వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకొస్తే చర్చకు సిద్ధమని ఆయన బిఆర్ఎస్‌ఎల్‌పి నాయకుడు హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. తనకు ఉన్న సమాచారం మేరకు ఇప్పట్లో మంత్రి వర్గ విస్తరణ ఉండబోదని స్పష్టం చేశారు.



నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా గాంధీభవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్‌యుఐ జెండాను మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సిడబ్ల్యుసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి , ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యుఐ నాయకత్వాన్ని అందించే ఒక ఉత్పత్తి కేంద్రమని, ఎన్ఎస్‌యుఐని మరింత బలోపేతం చేసేందుకు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. నాదర్‌గుల్ భూముల కుంభకోణం బిఆర్ఎస్ హయంలో జరిగిందన్నారు. బిఆర్ఎస్ దోపిడి ప్రజలందరికీ అర్థమైందని, తాము నిర్మించిన ప్రాజెక్టులకు ఇప్పటి వరకు ఎక్కడ కూడా ఒక్క గీత పడలేదని, కానీ బిఆర్ఎస్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మాత్రం మూడేళ్లలో కూలిపోయిందని చెప్పారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 14 సార్లు బి ఫామును అందజేసిందని, ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేయడం సరికాదని సూచించారు. బిఆర్ఎస్, బిజెపి వేర్వేరు కాదని, ఈ రెండు పార్టీలు కలుస్తాయన్నారు.

**'విద్యార్థి సంఘం' ఎన్నికలు నిర్వహించేలా చూస్తా...: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇతర రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా తాను ప్రయత్నిస్తానని అన్నారు. ఈ విషయమై తాను అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి సిఎం రేవంత్ రెడ్డిని కోరనున్నట్టు తెలిపారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో రాజకీయ పరిజ్ఞానం పెరుగుతుందని, భారత రాజ్యాంగం, భారత రాజకీయాలపై అవగాహన కలుగుతుదని వివరించారు. భవిష్యత్‌లో మంచి రాజకీయతరం వచ్చేందుకు విద్యార్థి సంఘాల ఎన్నికలుపునాది లాంటిదన్నారు.

# పంట కొనుగోలులో మహిళా సంఘాలకు పెద్దపీట

## ఈ నెలాఖరు లోపు 3403 ఐకెపి కేంద్రాల ఏర్పాటు
## మహిళల చేతుల్లో 40 శాతం కంటే ఎక్కువ కేంద్రాలు...

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రంలో పంట కొనుగోలు వ్యవస్థలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నెలాఖరు వరకు 3,403 కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు చర్యలను మరింత వేగవంతం చేసింది. ఇందిరా క్రాంతి పథం (ఐకెపి) ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రాలు వేగంగా పెరుగుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొత్త మార్పునకు దారి తీస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. గత ఖరీఫ్ సీజన్‌లో మహిళా సంఘాలు పంట కొనుగోలు ద్వారా రూ. 80.60 కోట్ల కమీషన్ సంపాదించగా, గత యాసంగి సీజన్‌లో రూ. 81.65 కోట్ల ఆదాయం పొందారు. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడం, తూకాలు పారదర్శకంగా ఉండటం, సేవలు సులభంగా అందుబాటులో ఉండటం వంటి అంశాలు రైతులను ఐకెపి కేంద్రాల వైపు ఆకర్షిస్తున్నాయని, ఫలితంగా రైతులకు రవాణ ఖర్చులు తగ్గడం, తక్షణ చెల్లింపులు పొందే అవకాశం కూడా కలుగుతోందని ప్రభుత్వం తెలిపింది. రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు, వ్యవసాయ సహకారం సంఘాల ద్వారా మొత్తం 8,251 పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 3,403 కేంద్రాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం కంటే ఎక్కువ కేంద్రాలు మహిళ సంఘాల చేతుల్లోనే ఉండనున్నాయి. పంట కోతలు మొదలైన నేపథ్యంలో ప్రస్తుతం దాదాపు 500 ఐకెపి కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమవ్వగా స్థానిక ఎంఎల్‌ఎలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలు కేవలం కొనుగోలు వ్యవస్థకే పరిమితం కాకుండా, వారి ఆర్థిక స్థిరత్వానికి ప్రధాన ఆధారంగా మారాయని ప్రభుత్వం తెలిపింది. రైతుల నుంచి కొనుగోలు పరిమాణం కూడా గణనీయంగా పెరిగింది. ప్రతి సీజన్‌లో సుమారు 40 లక్షల మంది రైతుల నుంచి ఐకెపి కేంద్రాల ద్వారా పంట కొనుగోలు జరుగుతుండగా, సగటున 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లావాదేవీలు జరుగుతున్నాయి.



**మూడు వేలు దాటిన ఐకెపి కేంద్రాలు : మంత్రి సీతక్క**

బిఆర్ఎస్ హయంలో సుమారు 1,500 ఐకెపి కేంద్రాలు మాత్రమే ఉండగా,ప్రస్తుతం ఈ సంఖ్య 3 వేలకు దాటడం మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో లభిస్తున్న అవకాశాలను సూచిస్తోందని మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలు మహిళలకు ఆదాయం కల్పించడంతో పాటు రైతులకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన సేవలను అందిస్తున్నాయని వివరించారు. ఐకెపి సెంటర్ల నిర్వహణలో మహిళా సంఘాలు చూపుతున్న నిబద్ధత, పా రదర్శకత రైతుల్లో విశ్వాసాన్ని పెంచిందని సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్ తెలిపారు. రాబోయే రో జుల్లో మరింత సాంకేతిక సహాయం, శిక్షణ అం దించి ఈ వ్యవస్థను మరింత విస్తరిస్తామన్నారు.

# పెన్షన్ బకాయిలన్నీ చెల్లించాల్సిందే: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లేదంటే ఆర్థిక ముఖ్యకార్యదర్శి కోర్టుకు రావాలని ఆదేశం వేర్వేరు శాఖల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెన్షన్, జీపీఎఫ్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, ఆర్జిత సెలవు, సరెండర్ సెలవు, గ్రూపు ఇన్సూరెన్స్ వంటి పదవీ ప్రయోజనాల చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని హైకోర్టు ఆర్థిక శాఖను హెచ్చరించింది. కోర్టు ఉత్తర్వులను ఆషామాషీగా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. కోర్టులతో ఆటలాడే పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాలని హితవు చెప్పింది. పాక్షిక చెల్లింపులు చేసి వాయిదాలపై వాయిదాలు తీసుకుంటామని కుదరదని చెప్పింది. జూన్ 10వ తేదీకి విచారణను వాయిదా వేస్తున్నామని, అప్పటిలోగా రిటైర్డు ఉద్యోగులు అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఉత్తర్వులను జారీ చేసింది. ఒకవేళ ఒక్క రిటైర్డు ఉద్యోగికి చెల్లించకపోయినా అందుకు కారణం ఏమిటో వివరించేందుకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. దాదాపు 758 మంది రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 221 మందికే పూర్తిస్థాయిలో చెల్లింపులు చేశారన్నారు. ప్రభుత్వం 737 మందికి చెల్లించామని చెప్పినప్పటికీ, కోర్టులో పరిశీలించిన రికార్డుల ప్రకారం ఆస్థాయిలో చెల్లింపులు చేయలేదన్నారు. టోకెన్‌లు జారీ చేయడాన్ని చెల్లింపుగా పరిగణించలేమన్నారు. మొత్తం 3656 టోకెన్‌లు జారీ చేశామని, వాటిలో 1056 టోకెన్‌లకు మాత్రమే చెల్లింపులు జరిగాయని, ఇంకా వేల సంఖ్యలో టోకెన్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిటిషనర్ల న్యాయవాది వాదిస్తూ, ఒక్కో పిటిషనర్‌కు పలు హెడ్‌ల కింద టోకెన్‌లు జారీ అయినప్పటికీ, కొన్నింటికి మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు.మరో అవకాశం ఇస్తున్నామని, నిర్ణీత గడువులోగా అన్ని బకాయిలను పూర్తిగా చెల్లించి ప్రతి పిటిషనర్‌కు చెల్లింపులు జరిగినట్లు స్పష్టమైన నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

# తనిఖీలతో మెరుగుపడిన బోధన

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులలో ఈ బృందాల పట్ల ఆందోళన పెరిగిందని చర్చ జరుగుతోంది. కొందరు ఉపాధ్యాయులు నివేదికల రూపకల్పన, పాఠశాల పరిపాలనా వ్యవహారాల పేరుతో పాఠ్యాంశాలు నిర్ణీత సమయంలో పూర్తి చేయడంలో వెనుకబడుతున్నట్లు తేలింది. బోధనలో లోపాల వల్ల విద్యార్థులు నాణ్యమైన చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ బృందాల ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. ఆకస్మిక తనిఖీలతో పాటు, ఇప్పటికే తనిఖీ చేసిన పాఠశాలలను మళ్ళీ పర్యవేక్షించే బాధ్యత కూడా ఈ బృందాలకు అప్పగించారు తొలి తనిఖీ తర్వాత పాఠశాలలు మళ్ళీ పాత పద్ధతులకు మళ్ళకుండా నిరంతర పర్యవేక్షణ సాగిస్తున్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో తనిఖీలు జరిగేలా, ఒక్కో బృందానికి మూడు నెలల వ్యవధిలో 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత లేదా 50 ఉన్నత పాఠశాలల చొప్పున లక్ష్యాలను నిర్దేశించారు. అయితే, కొన్ని జిల్లాల్లో తనిఖీలు ఆశించిన స్థాయిలో జరగలేదని గుర్తించి, వచ్చే విద్యా సంవత్సరం నుండి మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, పాఠశాల తనిఖీలు అత్యధికంగా సంగారెడ్డి (811), సూర్యాపేట (442), ఆదిలాబాద్ (429), నాగర్‌కర్నూల్ (367) జిల్లాల్లో జరగ్గా పెద్దపల్లి, నిర్మల్, మెదక్, వికారాబాద్‌లలో అసలు తనిఖీలే మొదలు కాకపోవడం గమనార్హం.

# ముగిసిన పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే 5గంటల సమయానికే 86శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పటికే కూలో నిల్చున్న వారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదిలాఉంటే ఈ సారి కేరళం, అసోం, పుదుచ్చేరి ఈ మూడు ప్రాంతాలలోనూ ఓటర్లు భారీ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.కేరళంలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ చాలా చురుకుగా ప్రారంభమైంది. ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకునేందుకు దేశ విదేశాలలో ఉన్నటువంటి కేరళం రాష్ట్ర వాసులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం 6గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉత్సాహంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు.సిపిఐ (ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్), బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఏ) అనే మూడు ప్రధాన కూటములు ఈ శాసనసభ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతూ అధికారం చేజిక్కించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సొంత జిల్లా అయిన కన్నూర్ జిల్లాలో పోలింగ్ చాలా భారీగానే జరిగింది. కీలక నియోజకవర్గాలైన తాలిపరంబ, పయ్యన్నూర్‌లలో మధ్యాహ్నం 3గంటల సమయానికి 65శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. సిపిఐ(ఎం) కంచుకోటగా భావించే ఈ జిల్లాలో ఎల్‌డిఎఫ్ అత్యధిక స్థానాలు దక్కించుకుంటుందని రాజకీయవిశ్లేషకుల అంచనా. అయితే ఈ మూడు ప్రధాన కూటములైన ఎల్‌డిఎఫ్,యుడిఎఫ్, ఎన్‌డిఏ హోరాహోరీ తలపడుతున్నప్పటికీ ప్రధాన పోటీ ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ మధ్యనే ఉంటుందని ప్రీపోల్ సర్వేలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత వి.డి.సతీషన్, కాంగ్రెస్ ముఖ్యనేత రమేశ్ చెన్నితాల, ఎఐసిసి ప్రధానకార్యదర్శి, ఎంపి కె.సి.వేణుగోపాల్, కేంద్ర మంత్రి సురేశ్ గోపి, నటులు మమ్ముట్టి, మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్, రాష్ట్ర మంత్రి శివన్‌కుట్టి తదితరులు వారి వారి పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, అసోంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి భారీ పోలింగ్ నమోదు కొనసాగింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి అసోంలో 59.63శాతం ఓటింగ్ నమోదైంది. భారీ ఓటింగ్ ధోరణి బిజెపిని ఆందోళనకు గురిచేసింది. బిజెపి తరపున ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ అసోంలో అధికారంలో ఉండటం వల్ల ఈ అత్యధిక శాతం ఓటింగ్ ఆందోళనకు కారణమయ్యింది. అసోంలో అత్యంత కీలకమైన ఎన్నికల పోరు ప్రధానంగా బిజెపి, కాంగ్రెస్‌ల మధ్యనే కొనసాగింది. రెండుసార్లు అధికారపీఠాన్ని దక్కించుకున్న బిజెపి ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ మూడోసారి అధికారాన్ని దక్కించుకుని హ్యాట్రిక్ సాధించుకునే దిశగా సర్వశక్తులొడ్డారు. కాగా గౌరవ్ గొగొయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ కూటమి బిజెపి నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు కొనసాగించిందని చెప్పక తప్పదు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పుదుచ్చేరిలో 72.4శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వేళ క పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికారులు వినూత్న ప్రయత్నం చేశారు. అందమైన అమ్మాయిలా అలంకరించిన రోబోతో ఓటర్లకు పూలతో స్వాగతం పలకడం విశేషంగా ఆకట్టుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com